భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మే 1956

సంపుటము 33 : : సంచిక 5

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1956



మహాపరినిర్వాణ మహోత్సవం

'దీపవంశ' అనే బౌద్ధపాళీగ్రంథాన్ని అనుసరించి గౌతమబుద్ధుడు నిర్వాణం చెంది ఈ వైశాఖ పూర్ణిమకు 2500 సంవత్సరాలవుతుంది. బుద్ధుని జననమూ, నిర్వాణమూ కూడా వైశాఖ పూర్ణిమ పుణ్యదినమే అనే ప్రతీతి ఒకటి వుంది. దీన్ని పురస్కరించుకుని—నిర్వాణ దినాన్ని 'వర్ధంతి' అనటమే గాని 'జయంతి' అనే సంప్రదాయం లేకపోయినా—భారత ప్రభుత్వం 'పరినిర్వాణ జయంతి' అనే పేర ఆధికారికావధిని మహోత్సవాలు జరపటానికి నిశ్చయించింది. వైశాఖపూర్ణిమ తదాదీ (మే 24) కేంద్ర ప్రభుత్వమూ రాష్ట్రీయ ప్రభుత్వములూ కూడా దేశం సర్వత్రా యీ మహోత్సవాలు జరపటానికి విస్తృతావధిని యేర్పాట్లు చేస్తున్నారు. భారతప్రభుత్వ ఆహ్వానాన్ని అందుకుని సమస్త బౌద్ధ దేశాల ప్రతినిధులూ ఢిల్లీకి వచ్చి ఈ ఉత్సవ కార్యక్రమాలలో పాల్గొన బోతున్నారు. ఈ మహోత్సవం భారతప్రభుత్వ పరమాశయమైన 'పంచశీల' ప్రచారానికే గాక ఆసియా సాంస్కృతిక సమైక్యతను ద్యోతమానం చేయటానికి గూడా ఉపకరించగలదు.

'అహింసా పరమో ధర్మః'

సంబోధము

శ్రీ హారీత శివశర్మ

ఉరువేల భూమిభృత్తుదయించె నెచ్చట
మరి నిరంజరయు సొంపెరుగు నెచట
నెచ్చట నజపాలు రిద్ధశోభులు కూర్తు
రానందగీతికా నూనపదము
ముచలింద సాగర మ్మెచట నరాతి భీ
కరమయి సాధుసంగతిని నెరపు
అశ్వత్థతరుమూలమందు మ్రొక్కిన మ్రొక్క-
సేనీయగ్రామ సంక్షేమ మెచట

నచట నుందురు యోగులు, నచట నుందు
రార్య సత్యమ్ములారయునట్టి వారు,
నచట వృక్షముల్ వట్టినయట్టి నీడ
నూత్న ధర్మగవేషణ ప్రత్నపథము.

చల్లని నీరముల్ కదలి సాగరగర్భము చెందునో మహో-
ద్భుల్లసితంబు ఫల్గునదియొద్దనె యాగి తపించునో పొరిన్
తల్లి నిరంజరానదియుఁ దానొక దుఃఖముచేత నెంతొ శీ
ర్ణిల్లినదయ్యె నూతనమనీషవలెన్ హొయసుల్ వెలార్చెడిన్.

తన యెన్ని జన్మల తపము ఫలించెనో
ఆ రావిచెట్టు క్రొత్తాకు తొడిగె
నచట న్యగ్రోధమ్మునందు యేమున్నదో
తన కొమ్మలోన నందనము విరిసె
అవును రాజాయతనవనరుహమ్మది
వీతరాగస్ఫూర్తి వింత లొలికె
ధర్మమ్మునందు మూర్తమ్మందియున్నట్లు
ప్రజ్ఞాంకమయ్యె నశ్వత్థ తరువు

ఒకటొకటి నిల్పి యింద్రియ వ్యూహ మడచి
దుఃఖ దౌర్మధ్య పాథోవిధూన నాత్మ

నీ నిరంజరాజల వేణి నూని బలిసి
పట్టు నీడలు నిర్వాణ పథసమాప్తి.

ఆ నీడల్, కుశలమ్ములై, దిశదిశాహ్లాద శ్రియః శ్రావ్య క
ర్మాసీతంబులునై, విధూత భృశధర్మద్వేషి. మారోగ్రగద
ర్వానూన ప్రథితమ్ములై, కదిలె, నత్యంత ప్రశాంతమ్ములై
ధ్యానోన్మీలితుడైన శాక్య ఋషి తా ధర్మంబు బంధించువో.

ఏ కల్పంబున తాను బుద్ధుడయి ఎంతే స్నిగ్ధచిత్తుండునై
శ్రీ కల్యాణ మృదూక్తులన్ వినమిత శ్రీకున్ సుమేధున్ తనున్
ప్రాకామ్య స్థితి చూచి బుద్ధుడవు రారమ్మంచు దీపంకరుం
డాకంఠంబుగ నన్న వాక్కు హృదయంబందున్ ప్రశంసించుచున్.

తన పది ముఖ్య జన్మములు తత్పరమైన తపః ప్రభావ వ
ర్థన రతిచే గడించుకొని తాల్చిన పారమిత ప్రధాన భా
వనములు నొందుకొంచు గురువై మృదువై ధృత ధర్మమార్గ చా
లనములు శీలముల్ నిడుదలై మరి చల్లనివై చరించినన్

దృంహిత దాన యోగ పరిధీకృతనైజమహః ప్రభూతిచే
సంహననం బొనర్చె తమసంబుల నెవ్వడు, వాడు బోధి కాం
తింహావణించి మారకృతతీర్ణ దురోదర తాపృదుప్త భీ
ష్మాంహములన్ అడంచిన మహాతపముల్ తన యందు వెల్గినన్.

తన విస్సాంతర జన్మ సత్కథ వినూత్నంబైన స్వప్నంబు ఛా
యను ధీనేత్రము ముందు తోచి పదిలంబైనంత తానప్డు నె
ట్టన బాలించిన దానయోగ ఘన నిష్ఠాస్పష్టద్రాఘిష్ఠతల్
కనుగొంచున్ మది నూని గౌతముడు నిష్కామాచ్ఛతేజచ్ఛటన్.

గుంజిత మధురస్వర సం
రంజితమయి నట్టి యీ నిరంజరయు మహా
వ్యంజనయుత ధర్మశ్రీ
పుంజమ్మయినట్లు క్రొత్తపోకడను చనున్.

ఇట్టి వెన్నెల లిప్పుడే గాని మున్నెప్డు
లేవు వసంత సంజీవకములు
ఇట్టి చల్లనిగాలు లిప్పుడేగాని యె
ప్పుడు లేవు వేడిమి నడచు జిల్లు

సంబోధము

లింతటి యందమ్ము నెప్పుడు చిక్కఁడు
 ద్యుతిమంతమయిన చందురుని మోము
ఇంత విశదములై యెప్పుడు లేవు ది
 క్కులు స్వచ్ఛములును అకుంఠితములు
ఊహ కందని యొక క్రొత్త పోహణమున
సర్వమును గూడ ధర్మభాస్వద్వికాసి
శ్రద్ధచేతను వినమితాశా ప్రతారి
కృష్ణతృష్ణా తమస్వినీ జిష్ణువయ్యె.

తన యెడందకు నేమి తాత్పర్యమబ్బెనో
 అజపాలవట ద్రుశిఫాంకితతలి
కూర్చున్నవాఁ డక్లై కూర్చుండె నెన్నాళ్లో
 ధర్మచింతనరక్తి తాల్మి బలిసి
పుట్టుట పెరుగుట గిట్టుట జీవికి
 సహజమే యగును పో; సంతసమరి
దుఃఖమ్మునందున దోధూయమానులై
 జీవులు వేగుదు రీవిధమున

కర్మమందురు; కావచ్చు; గాని దుఃఖ
బహుల జరఠమ్ములోకమ్ము; బధిరమయ్యె
ధర్మమన్నను ధర్మతాత్పర్యమనిన
తిరిగి వెలిగింతు ధర్మసందీప్తి నిపుడు.

అరయఁగ జన్మము దుఃఖము, కరమును దుఃఖమ్ము వ్యాధి, కానరు జనముల్
జర చేతను మృతిచేతను గరగరనయి జీవితమ్ము కష్టమున పడుఁ.

ఎవ్వఁడు గాని పుట్టినపు డెట్టుల నుండెను యట్టు లేచిరం
బెవ్విధి నుండు; నీ నడుమ నెక్కఁడవో వయసుల్: దురీహచే
త్రెవ్వదొ జీవితంబు; మఱి తేకువ లేమిటికిన్ వచింతురో
దివ్వియ లేని చీకటి విధిన్ ముదుసళ్లయి కుందుటేటికో!

ఒకని దేహంబు కచ్చికవోలె నుసిరాలు
 రాలు నొక్కఁడు పండు రాలినట్లు
ఒక్కఁడు లేవలే డూతయు లేని దే
 బ్రతుకలే డొకఁడు దుర్భ్రిమల గుడిచి
సర్వ రోగమ్ముల ఖర్వమై తనయందు
 నిల్వ నేడ్చును మది నిల్వకొకఁడు

ముదిమిపై బడ్డ సమ్మోహ్మయంచు నార్చును
బ్రతుకు విపర్యాస పథమునబడి

ఇదియ జీవితమ్ము నిదియును లోకమ్ము
దుఃఖదురితవారి దోగి లోగి
బృంగిపోయి బెండుబెండగుచున్నది
తగిన తేపలేక, దారిలేక.

నిత్యమేదియొ మరియు ననిత్యమేదో తెలియరానట్టి చీకటి తెట్టులందు
జిక్కి మనుజులు దుఃఖరాజిని పడుదురు మరి వివేకంబులేమి సందర్భమిదియ.

దుఃఖముకన్నను సత్యము
దుఃఖపు సముదయమె యగును; దోర్బలము మెయిన్
దుఃఖనిరోధ మెమ్మరిగిన
దుఃఖనిరోధంపు పథము తోడై నిలుచున్.

అని చింతించెడి శాక్యరాజకుల వంశాంకూరమహా, లోకవ
ర్ధనమహా, ధర్మము చూపు బుద్ధిని మునీంద్రమహాత్మ, ప్రసిద్ధార్థ భా
వన మేఘమ్మునయందు తోచినవివో, వారుల్, మహాధర్మచం
దన వాతాయతవాసనాభరితముల్ ప్రాక్కాంతి గర్భంబులున్.
ఒక భూమీరుహమూల దేశమున తానూహించు ధర్మంబు, వే
రొక భూమీరుహ దివ్య శాఖికలధామోత్సర్గ దేశంబునం
దు కరాళంబగు దుఃఖ సంతతికి ప్రత్యూహమ్ము నూహించుచి
ట్లోక వారమ్మును వారమాపయిని తానూనెన్ మహాబోధమున్.

అప్పుని వోలిక కడు ప్రే
మాప్తిన్ బోధి చలచ్ఛద మాశా వ్యాప్తిం
గోప్తిగ పట్టిన నీడల
సప్తాహము గడిపెను "ప్రతిసల్లీను"డునై.

తాను సమాధి పొంది బహుధాచరియించు హృషీకజాలమున్
పూనియడంచి గోతముడు పొంది సుఖమ్ము, విముక్తి ధర్మముల్
ఊనిన యంతలో జగములో నడతెంచెను శాంతు లుద్ధర
శ్రీ నమితమ్ములున్ మహిమ చేతను దుఃఖనివారకమ్ములున్.

ఇంతటి దాకను నంతు తేలని చిక్కు
చిటికలో తేలితో తెంచినట్లు
ఇంతటి దాక దానెంత తపించిన
దొరకని అర్థమ్ము దొరికినట్లు

ఇంతటిదాక నేమేమి చేసిన గాని
తీరని ఒకపని తీరినట్లు
ఇంతటిదాక దుర్దాంతమై, పోనట్టి
బాధ, యొక్కటి విడి పారినట్లు
'శాక్య ఖత్తియగోతమ సమణ విరజ
విమల' మానసబోధి సంవీజ్యమాన
శీతసంబోధి వాయువీచీవితాన
శబలిత వినూత్న ధర్మసంసత్తు వాలిచె.

జరయును మరణంబు జాతిచేతను కల్గు
తనర జాతికి ఉపాదాన మిక్క
తృష్ణ చేతనుకల్గు నీ యుపాదానంబు
తృష్ణకు వేదన మిచ్చు బ్రతుకు
వేదన స్పర్శచే విక్రమించును మరి
నామరూపంబులం దడియు పుట్టు
విజ్ఞాన ప్రత్యయ విధిబడివచ్చును
నామరూపముల విరామగతిని
"మలిన పరిదేవ దుఖ్ఖదోమ్మనస"ములకు
ఇవియ కారణ మగుచును, నులియబెట్టు
సర్వ లోకమ్ములను గూడ; సత్యమైన
ధర్మధృతి వీని నడచి పథ్యమును చూతు.

అగును నిరోధమార్గమునయందున నే పోనగున్, సమూలమై
తెగిపడు దుఃఖచక్రమును; తేకువతో వ్రతశీల సంపదల్
చిగురుల నొత్తినొత్తియు బచేళిమమాగలి బ్రహ్మచర్య దీ
క్ష గడిపినన్ మహోధ్వములు గన్నడు ధర్మపుచక్రమున్ బడిన్.

స్వామి మెడంద నా తపము సాగిన సాగుట బోధివృక్షశా
ఖామృదు రాగరంజిత శిఖావలయంబులలో కషాయముల్
బ్రామిన ప్రాగ్దిశాగత ప్రభాకర దివ్యకరాళి హోవళిన్
ఓమిన ధర్మమై దిశల నోమినదై, మిగిలెన్, గభీరమై.

ఆ వైశాఖము నట్టిపూర్ణిమయు నార్యశ్రీ మహోద్యోగముల్
ఈ వైశాఖమునందు గాదు మరి యేయే కాలఘుందై ననున్
రావున్; రావును నట్టి ధర్మకలనారాజ త్తపశ్చర్యలున్
ఈ వైశాఖము మాత్ర మిట్టు లరుదెంచెన్ స్వామికీర్త్యంకమై.

శ్రవ్యనాటిక:

శ్రీరామ పాదుకలు

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

పాదుకలు

శ్రీ రఘురామ పాదసర
సీజమరందము గ్రోలి గ్రోలి త
ద్భరితోన్నతిం దగిలి
పుల్కలు పెత్తి సజీవ వాణి నో
రారగ బల్కు మాకు మన
స్సైనది తత్కథ విన్న వేళ మం
దారము పూచి యీ మనము
వన్ విరజిమ్మును దివ్య వాసనల్

అలనాటి నడచి బాటల బోవ మునిరాణి
పాషాణతనువు జీవమున గదలె
నవనీతమంచు గ్రొన్ననలంచు వైదేహి
ములు ద్రొక్కుకొనుచు మాయమ్మ నడచె
ముసలి రాజుల బ్రోవ ముసలి పల్లెను జేర
ఎడద తేనెల మమ్ము గడిగె గుహుడు
విరతి సాకేత పృథ్వి నేల భరతుని
మృదు మస్తకమ్ము మన్నించె మమ్ము
ఏ మహారణ్య వృక్ష సంజాత తనువు
నుండి పుట్టిన వారమో, పండిపట్టి
పూర్వ పుణ్యాన నరసుర పూజలంది
ఇచట నీ హేమ పీఠి వసించినాము.

[గంభీరంగా ఒక ప్రకటన వలె]

అలనాటి నడచి బాటల బోవ మునిరాణి
పాషాణతనువు జీవమున గదలె.

[గౌతమాశ్రమం...ప్రాంతఃకాలం,
అహల్య—ఇంద్రుడు]

అహల్య: (గంభీరంగా) చాలు దేవరాజా ఇక వెళ్ళు. అది సుముహూర్తమో దుర్ముహూర్తమో... నాలోనూ... ఇన్నాళ్లుగా అణచి వుంచిన బడబానలం పొంగింది. ఇక ప్రళయం తప్పదు. అయినా విచారించను—నువ్వు మాత్రం కంటపడటం నాకిష్టంలేదు. అది శివుని మూడవకన్ను. ఈ గుబురు చెట్లచాటునుంచి త్వరగా వెళ్లిపో.

ఇంద్రు: (పరిహాసంగా) కాస్త నమవు. ఎట్లా వెళ్లను? పేరుకు స్వర్గంగాని అక్కడ ఏముంది? నా అమృత కలశం...స్వర్గసీమ... నీ సుందరవదనంలో ఉన్నాయి. విడిచివెళ్లగలనా? శపించనీ ఆ తాపోధనుణ్ణి. మోయలేని ఆయన తపోభారం కొంత తగ్గుతుంది. నా దేవకార్యం కొంత నెగ్గుతుంది.

అహ: అం—అం—అదిగో గౌతములు!

ఇంద్రు: కాని...

[గౌతముని కర్కశ స్వరం]

గౌత: ఆఁ అక్కడతం! ఎవరు నీవు? నన్ను చూచి సాలవృక్షాల చాటునుండి తప్పించుకొని పోతున్నావా? ఏ దొంగతనానికి ఈ ముని వేషం తొడుగు? ఏమీ నా వేషమే నా? ఏమిటి అహల్య అట్లా రాతి బొమ్మలా నిల్చుని చూస్తున్నది.? ఓహో తెలిసింది. ఈ కళంక క్రీడలో ఆమె కూడా భాగస్వామినియేనా? ఇంద్రా ఇక నీ బ్రతుకు ని...ష్ఫలం... పో...ఆశ్రమం విడిచి....అహల్యా... అలాగే రాపడి కదలక మెదలక శిలవైపోతావు—తప్పదు—నీ ప్రత్యుత్తరంతో నా కర్ణాలను కళంకితం చేయదలచుకోలేదు.

అహ: ప్రభూ! ప్రభూ! క్షమ, క్షమ, అయ్యో, నాలుక గట్టి పడిపోతున్నది. శిలరాయి—యింక—గతి—గతి?

గౌత: తపస్వినీ! భావియుగంలో శ్రీరామచంద్రుని పవిత్ర పాదధూళి...

* * *

విశ్వామిత్రుడు:

రామచంద్రా! ఇదీ—యీ శిలా గాథ—... ఆ మునిపత్ని అహల్య వర్షసహస్రాలనుంచీ పాషాణ రూపంతో యిక్కడ పడివున్నది...అదిగో నీ దక్షిణ

పాదస్పర్శతో ఆరాయికదలి ఎట్లా అహల్యగా మారు తున్నదో చూడు.

[హఠాత్తుగా విచ్చిన గొంతు అహల్య]

పతితపావన శ్రీరామభద్రమూర్తి!
ఏది? నీపాదకంజాత మెంత మృదువు!
ఎంత కరుణావిశాల మ్మదెంత ప్రేమమె
నా శిలాజీవితమున ప్రాణములు పోసె ...

*   *   *

"వనసీతనుంచు క్రొన్ననలంచు వైదేహి
ములు త్రొక్కకొనుచు మామంగువతిచె"

[సీత—రాముడు—లక్ష్మణుడు]

సీత : అయ్యయ్యో!—ఏమివార్త అభిషేకమన్నా అరణ్యమన్నా—ఏమి మీ నిర్విచారము... పట్టుబట్టలను నారచీరలను ఒక్కటే చూపుతో చూచే మీ గంభీరవదనము నన్ను వణకిస్తున్నది ఇక గత్యంతరంలేదా?

లక్ష్మ : (హఠాత్తుగా అందుకొని) లేకేమి...ఈ ధనువును ఒక్కసారి మ్రోగించి అంతా చక్క జేస్తాను.

రాము : (శాంతంగా) లక్ష్మణా ఎవరిమీద నీ ఆగ్రహం? విల్లెత్తి ఎవరిని దండించాలనా వయ్యా—నీవూ నేను పుట్టకముందే రాజ్యం పినతల్లికి దత్తమయింది. నీకు తెలియదు ఇక శాంతించు...నా అటవీ ప్రయాణానికి సర్వం సిద్ధంచేయించు. ఇప్పుడే ప్రయాణం.

సీత : ఏమిటీ ... ఆర్యపుత్రు లొక్కరేనా? ప్రయాణం...వీలులేదు. సుఖదుఃఖాలలో ఆగ్రహోపాలలో భాగం పంచుకొనే ఈ అర్థాంగికికూడ సగభాగం వుంది వనవాసంలో...ఇదిగో నేను సిద్ధమవుతున్నాను.

రాము : సీతా ఏమిటి నీమాటలు? వనవాసం అంటే అయోధ్యాపుష్పోద్యానం అనుకొంటున్నావా? భయంకర మృగాలు...ముళ్లపొదలు, రాళ్ళగుట్టలు—అడుగడుగున...

సీత : కనుకనే—నేనూ వస్తాను—నా ప్రభువు మెత్తని పూలపాదాలలో ముళ్లుగుచ్చుకోడమేనా? నేను సహించను...ముందున్న దర్భముళ్ళు త్రొక్కి నేను దారి సరిచేస్తాను.

రాము : లక్ష్మణా వదినను వారించలేవా?

లక్ష్మ : అన్నా ఏమిచెప్పను...

విభుని గ్రహణమ్మునందైన విడదు తార
తిరు వోరగినంత లతి వసుంధరను ప్రాలు
బురదదిగిన గజేంద్రుని కరిణి విడునె
పయన మచిత మ్మనుచయేమె వదిన కిపుడు.

నేనుమ నిరంతరాశ్రితుణ్ణి గదా! పైని తమ చిత్తము.

రాము : (నవ్వుతూ) ఇదేనా నీమన్య వర్తిత్వం? నీవుకూడా వనవాసానికేనా? వద్దు నాయనా ...సీతా! లక్ష్మణునికి నచ్చచెప్పు.

సీత : సౌమిత్రీ! నామాట విను నాయనా; మమ్ములను వెళ్లనీ...

లక్ష్మ : అమ్మా అన్నగారి పాదసేవలో మీకీ స్వార్థం ఎప్పటినుంచీ వచ్చింది? మీరు దక్షిణపాదం సేవిస్తావుంటే నేను వామ పాద పరిచర్య చేస్తాను.

రాము : భళిరా! ఏమి ముగ్ధహృదయులు.

*   *   *

"మునలిరాజుల త్రోవనునలి పక్లైమ జేర
ఎపెద లేసెల మమ్ము గడిగె గుహుడు."

[గుహుడు—రాముడు]

గుహు : (విచారంగా) ఈ పాడు చేతులతో ఇదిగో మట్టిపాలు తెచ్చాను...శ్రీ రామచంద్రా! పట్టాభిషేకానికి, కలిగిన కామకలు తెచ్చి మీ పాదాలచెంత సమర్పించవలసిన సేవ కుడికి—ఈ ఆనతి పెట్టావేమయ్యా—మహాప్రభూ—

రాము : మిత్రమా కంటనీరు పెట్టకు సీతా సుమంత్రుడూ మాడకుండా యీపాలతో జడలు కట్టుకోనీ...త్వరగా గంగదాటడానికి.... ఆయత్తపరుచు...లే...

[పడవవాళ్ల కంఠాలు—గంగ గలగలలు]

— పాట —

అడవిదారులుదాటి అకొండ దాటి
జడదారిసాంబయ్య జడలన్ని దాటి
కోరి పరుగువచ్చె కొమ్మ గంగమ్మ
పూలు కుంకుమ పోసి మొక్కుకుందాము!

గుహు : ఓహోయ్...కొండన్న! అపడవ సరిగా రేవులోకి రానీ. మహారాజా ఒడుదుడుకులలో ఎక్కలేరు. మాతల్లి సీతమ్మ అసలే ఆ గుండురాళ్ళల్లో అడుగు పెట్టలేదు. ఆఁ... ఆఁ...అదీ సరి మా ప్రభువులు నడిచే దారిల్లో మెత్తనియిసక...చిగుళ్లూ పరిచావుకదూ. మంచిపని చేశావు. ఊహూఁ నీకూ తెలుసును రామయ్య తండ్రిని సేవించడం. ఇక రావచ్చు కూ తండ్రి—ఆయన మెత్తని అడుగులు మోపిన నేల ఎంత ముద్దు

లోలుకు ఉన్నదిరా ఆ మట్టితీసి కళ్ళకద్దుకోవాలనిపిస్తున్నది.

రామ : నేస్తం ఏమి వెఱ్ఱి ప్రేమ నీది. ఆ చెక్కిళ్ళు తుడుచుకో. గంగను సమీపించాం — ఇంక పడవ ఎక్కవచ్చుకదూ ?

గుహుడు : (ఆర్తింగా) బాబ్బాబు... ఒక్క నిముషం వుండండి మీ బంగారుపాదాలు కడిగి వేస్తాను నెత్తిమ్మీదకు ఈడు జోడులైన మీ అడుగుదోయిని నా కన్నీటితో కడిగి వేస్తాను. రామయ్య తండ్రీ రాతిని నాతిని చేసే పొవెలున్నాయి నీ అడుగులలో.
రాయికీ కఱ్ఱకు ఎంతో దూరలేదు — నీ అడుగులు సోకగానే నా పడవ పడతిగా మారిపోతే — నాకు బ్రతుకు తెరువు లేదు ఆ పని మాత్రం చెయ్యకు. నీ కిచ్చగలిగితే — నన్ను నీ పాదుకలుగా మార్చుకో. అంతేగాని పది మందిని ఏరు దాటించే పడవను మాత్రం మార్చకు.

రాము : (నవ్వుతూ) మిత్రమా... సందేహమెందుకు — నీ ప్రేమ యీ గంగకంటె లోతైనది — అలాగే కాని...

* * * *

"వితత సాకేత పృథ్వీ నేత భరతుని
మృదుమ స్తకమ్ము మన్నించె మమ్మ-"

రామ : ఎవరు...? భరతుడా, నాయనా — ఎన్నాళ్ళకు నిన్ను చూడగలిగాను.
రమ్ము తమ్ముడ భరత! వక్షమ్ము విప్పి
ఎలభుజమ్ముల నను కౌగలింపు మయ్య
మెలగము నెత్తుము శిరదించు మోహవమ్ము
వేదనా దగ్ధ దేహము నాహ్లాదపరపు.
తండ్రిగారిని తలచుకొని విచారించకు — మనవంటి పుత్రులు ఆయన సత్యవ్రతాన్ని శిరసావహించి పాలిస్తూ వున్నప్పుడు ఆయన ధన్యులు కాక యింకేమిటి..."

భర : అన్నా లక్ష్మణునివలెనే నాపైనికూడ అనుగ్రహించకూడదా...? నేను కూడ అడవిలో వుండి పరిచర్య చేస్తాను.

రామ : నాయనా వద్దు వద్దు. ఇక్కడ లక్ష్మణుడు- అక్కడ నీవు — ఇది నా నిర్ణయం —

భర : ఆర్యా, దయచూపండి ఈ దేహం యిక్కడనే వుండి, అక్కడి పనులు కూడా నిర్వహిస్తుంది. మీ పేరు చెపితేనే రాజ్యానికి శ్రీరామరక్ష గదా.

రామ : కైకేయినందనా, అట్లా జరగడానికి వీలు లేదు. నేను పితృదేవుల ఆనతివల్ల అడవికి వచ్చానుగాని, గర్వం చేతగాని, మతిభ్రమ చేతగాని కాదుగదా. మన కులగౌరవం సత్య ముని మరచిపోకు.

భర : అన్నా, అభిషేకం మాట...?

రామ : అమ్మగారు కోరినట్లే జరిగితీరాలి.

భర : ఆర్యా — గాయంపై మరింత గాయం చేస్తారా...?

రామ : నాయనా క్షోభపడకు. నీ హృదయం నిష్కల్మషం. నీ మృదు వచనాలకు, గుణ పరంపరకు లోబడిపోయేవంటే నమ్మ కాని. మన కర్తవ్యపాలనం? ఇద్దరం కలసి ఆ మహారాజును అసత్యవాదిని చేద్దామా...? ఆలోచించు — వేగిరపడకు.

భర : అన్నా యింకేమీ ఆలోచించలేను మీ నియమావసానంవరకూ మీ పాదాలచెంతనే వుంటాను.

రామ : అట్లా అనకు. నాయనగారి సుకృతం ఫలవంతం కానీ- ఇక వాదం వద్దు నీవు అయోధ్యా రాజ్యం పాలించకపోతే నామీద ఒట్టు.

భర : అయ్యో, ఇక మాటలాడకుండా చేశారు. అయితే, ఒక నిర్ణయంమీద మీ రాజ్యాన్ని పాలిస్తాను.

రామ : (సంతోషంగా) ఏమిటా నిర్ణయం....?

భర : నా చేతిలో వుంచిన రాజ్యాన్ని పదునాలుగు సంవత్సరాల మరునాడు వెంటనే మీరు వచ్చి స్వీకరించాలి.

రామ : మంచిది.

భర : (సంతోషంగా) అయ్యా, తపోధనులూ, పౌరులు, వినండి ఈమాట. దీనికి అన్యథా ఎప్పుడూ జరుగకూడదు. సరే అన్నా యింకొక వరం యివ్వక తప్పదు నాకు.

రామ : (ఆనందంగా) నాయనా ఏమి టది ?

భర : అన్నా నీ పాదుకలు నాకు ప్రసాదించు. వాటిని శిరసావహిస్తాను. మీరు వనవాసం నుంచి తిరిగి వచ్చేవరకు యీ పాదుకలే సింహాసనాన్నలంకరిస్తాయి. మీ పాదాలకు మారుగా ఈ పాదుకలను పూజిస్తాను. అనుగ్రహించు.

రామ : వత్సా, ఎంతకాలానికో నాకు కొంత ఖ్యాతి దక్కిందనుకొన్నాను. అల్ప కాలంలో నీవంత యశస్వివైనావు. నీ అభిమతమే కానీ, ఇదిగో పాదుకలు.

భర : ధన్యుణ్ణి. శిరసావహించి పట్టుకువెళతాను.

కంఠాలు : జయము రామచంద్రప్రభువునకు జయము, జయ భరతకుమారునకు జయ!

సమానాంతర రేఖలు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

చలమయ్య రెండో కూతురు రుక్కిణి కందిచేలో కూర్చుని గాఢంగా ఆలోచిస్తోంది. సంధ్య వేళ. ఊరు సద్దు మణిగిపోతోంది. తానేమో యిక్కడికి వచ్చేసింది. భయంతో గజగజ వణికిపోతోంది. తొందరలోను, ఆవేశంలోను యేదో అనేసింది. ఏదో చేసేసింది. తన ధైర్యానికి తానే ఆశ్చర్యపడుతోంది. బలీయమైన అవసరం, యెంతపనైనా చేయిస్తుంది. కాకపోతే తానెక్కడ! సూరిబాబు యెక్కడ! వళ్ళంతా గలతరించిపోతోంది. తాను చేసింది తప్పేమో! తన తండ్రికి తెలుస్తే యేమవుతుందో? ఊళ్ళోవాళ్ళకి తెలుస్తే యేమనుకుంటారో! అయినా మా అయ్య చెపుతూనే వుంటాడు వాళ్ళ సంగతి. నేను చేసినదాంట్లో తప్పేమీ లేదులే అనుకుని తృప్తిపడుతోంది. ఏమిటో, యెప్పుడూ రాని ఆలోచనలూ వస్తున్నాయి. ఒక్కసారిగా తన అరచెయ్యి చూసుకుంది. ఇంకా కందగడ్డలాగానే ఎర్రగావుంది. సూరిబాబు చెంపకంటె తనచెయ్యే బాగా కందిపోయిందనుకుంది. అరచెయ్యివైపు అట్టే చూస్తూవుంటే, సూరిబాబు చెంప అచ్చుగుద్దినట్లు కనిపిస్తున్నట్లుంది. కళ్లు చెదిరిపోయినాయి. శరీరం వణికింది. గబగబ అరచెయ్యి తుడిచేసుకుంది. ఇంకా ఆ ఎర్రదనం తగ్గటంలేదు. ప్రక్కనున్న తొట్టిలో చెయ్యికడుక్కుని పమిటకొంగుతో తుడుచుకుంది. ఇంకా ఆనవాలు కనిపిస్తూనేవుంది. భయంవలన చేసేదేమీలేక ఏడుపొచ్చింది. చేసింది తప్పుకాదని తన అంతరాత్మను నమ్మించలేక పోవటంలో వుక్రోషంవచ్చింది; మళ్లీ వుక్రోషంవలన కూడా ఏడుపే వచ్చింది. చందమామ గుండ్రంగా కదులుతున్నాడు. ప్రక్కన తొట్టినీళ్ళల్లో. తనవైపు యెవరో చరిచినట్లనిపించింది. చప్పున నీళ్లు కుమ్మరించేసి తొట్టె బోర్లించేసింది. పైనవున్న చందమామ తననుచూసి పక్కన నవ్వినట్లనిపించింది. చారడేసి కళ్లు, గులాబిరంగు చెక్కిళ్లు విశాలమైన నుదురు నిజంగా చలమయ్య కొంపలో తప్పబుట్టింది రుక్కిణి. నలుగురూ యిదేమాట అసలు చలమయ్యకు పుట్టిందప్పుడేగా! రామనాథంగారి పోలిక. అచ్చుగుద్దినట్లు కనిపిస్తోంది. ఇవన్నీ వింటూంటే వురితీసుకుని చచ్చిపోదామని అనిపిస్తూ వుంటుంది రుక్కిణికి. కాని ధైర్యం చాలటం లేదు. ఇంకా యేవేవిటో జ్ఞాపకంవస్తున్నాయి. ఇంటికి వెళ్ళటమూ, వెళ్ళకపోవటమూ మనస్సు యేమీ ఆలోచించుకోలేక పోతోంది. ఈపాటికి తప్పకుండా అయ్యకు బాబుగారొచ్చి జరిగిన విషయం అంతా చెప్పేవుంటారనుకుంది. ఏమిటో ఒక్కసారిగా రుక్కిణికి యెక్కడలేని ధైర్యం వచ్చినట్లనిపించింది. పోనీ చెప్పనీ. దీంట్లో దాపరికం యేముంది. నేనూ చెపుతాను వున్నదంతా, నాకేమన్నా భయమా, ముందరవుతే నే నేమీ చెయ్యలేదు. తప్పంతా అయ్యగారిదే ధైర్యం తెచ్చుకుంది. పమిటకొంగు బిగించేసి నడుముకు చుట్టుకుంది. చెదిరిన ముంగురులను వెనక్కు నెట్టేసి, మాటిమాటికి అరచేతిని చూసుకుంటూ ఇంటిదారి పట్టింది రుక్కిణి. పైకి కనిపిస్తున్నంత ధైర్యం లోపలనుంచి రావటంలేదు. అందువల్లనే బెరుకుగానే అడుగులు వేస్తూ, ఒక్కొక్కప్పుడు అంగలు వేస్తూ ధీమాగా బయలుదేరింది. ఎవరో ఒకళ్ళిద్దరు రుక్కిణిన్ని చూసి వ్యంగ్యంగా నవ్వారు. తన మనస్సులో ఇంకో టేమీ ఆలోచించే పరిస్థితిలో లేదు. ఏమీపట్టించుకోకుండానే చరచర నడిచి వెళ్ళిపోతోంది.

చలమయ్య సాధారణంగా, ప్రొద్దుకుంకగానే వేపచెట్టుక్రింద నులకకుక్కి వేసుకుని కూర్చుని, చేతికి మూతికిపట్టని చుట్టపీకతో సాము చేస్తూ వుండేవాడు. అట్లాగే చెయ్యి మూతి కాల్చుకుంటూ; నిప్పుగుగప్పిన నిప్పు కనిపించకుండానే పొగవదులుతూ వుండేవాడు. ఏమిటయ్యా, ఇంట్లో అంత పొగాకు పెట్టుకుని, ఆ చుట్టముక్క కాల్చుకుంటా వెందుకు అని అంటూవుండేది రుక్కిణి. అలాంటిది, చలమయ్య అక్కడ లేనేలేడు. రుక్కిణిమాత్రం వచ్చి వాకిట్లో

నుంచుంది. రోజా ఉంటున్న యిల్లే క్రొత్తగా కనిపించింది. పరాపరి లోపలకు పోవటానికి మనస్సు ఒప్పటంలేదు. అటూ ఇటూ ఆదుర్దాగా చూస్తూ నుంచుంది. ఇంట్లోంచి మారిబాబు కమతగాడు కన్ను బుస్సులాడుకుంటూ బైటకు వస్తున్నాడు. రుక్కిని ప్రాణాలు పైకి ఎగిరిపోయినాయి. తనశరీరం కని పించకుండా, వేపచెట్టు ఆశ్రయం యిచ్చి దాచేసింది. రుక్కినికి ఏమిచెయ్యాలో యేమీ పాలుపోవటంలేదు. అట్లాగే యింటిలోనికి తొంగి తొంగి చూస్తూ నుంచు న్నది. గంగి, గంతులు వేసుకుంటూ బైటకు వచ్చే సింది. అటూ ఇటూ ఓసారి చూసి, వేపచెట్టు క్రింద నులక కుక్కి లాగి, దానిమీద ఖరావుగా చతికిలింది. అమ్మ కూడా కోపంగానే బైటకు వచ్చేసింది. చలమయ్య, చిల్లుబడ్డ చుట్టపీకను, రెండు పళ్ళ మధ్య కరిచి పట్టుకుని, వికృతంగా మొహంపెట్టి, యేమిటో అట్టహాసంగా వచ్చేశాడు. బైటకు వచ్చిన ముగ్గురూ కూడా మూడు రకాలుగా మొహాలు పెట్టి మొటమొట లాడుతున్నారు. రుక్కిని చెట్టుచాటున. చక్కాండన్న మాటేగాని, యెంతసేపని అక్కడ అట్లా వుండి పోతుంది కనక! ఆ ముగ్గురిదగ్గర మొహం యెట్లా చూపిస్తుంది. ఉక్కిరి బిక్కిరయి పోతోంది. అమ్మ, నులకమంచం దగ్గరగా చతికిలబడింది. చలమయ్య వీధి గుమ్మం దగ్గరగా నడుస్తున్నాడు. సమయం చిక్కింది గదా యెవరూ చూడకుండా తాను యింట్లోకి జారు కోవచ్చు గదా అని అనుకుంటూ అడుగులేస్తూ రుక్కిని యింటి లోపలివైపుకు పోసాగింది. చలమయ్య గబు క్కున యెందుకో వెనక్కు తిరిగాడు. రుక్కిని చటు క్కున నిలబడిపోయింది.

"ఏం రుక్కిని యింటికి రావటానికి ఏళాపాళా లేకేంటి..." చలమయ్య కస్సుమన్నాడు.

గంగి, అమ్మ యిద్దరూ కూడా రుక్కిని వైపుకు తిరిగారు.

"ఈ యాళదాకా యేం చేస్తుందావే..." గంగి కోరచూపులతో అడిగింది.

రుక్కిని గతుక్కుమంది.

"ఏమిటే అట్లా చూసుకు పోతున్నావు" అమ్మ వికటంగా అడిగింది.

రుక్కిని యేమీ మాట్లాడలేదు.

"నలుగురు కళ్ళల్లోపడి నాశనమైపోదా మనుకుం టున్నావా......గంగి చేసిన రభస చాలు......ఇహ నువ్వు కూడా......" చలమయ్య ముందుకు అనలేక పోయాడు.

"ఇంటికొచ్చి కూకుంటే, పొట్టగడిచే దెట్లా... తానేమో యేమీ చిల్లిగవ్వకూడా సంపాదించి పెట్టలేదు. పోనీ యెవరైనా సంపాదించుకుని వస్తుంటే, చూసి ఓర్వలేదు. గంగికేమీ సుఖంలేదు. తన శరీరం అమ్ముకుని, నిన్ను నన్ను పోషిస్తోంది. ఆ మాత్రం యిదిలేదు, సిగ్గు, పైగా దాన్ని నానా మా టలు అనటం, దానికి పెళ్ళిచేసి దానింటికి దాన్ని పంపిస్తే సుఖపడక పోయిందేమిటి...చేతగాని చవట. ఆత్మను అమ్ముకుని, వాళ్లకు వీళ్ళకు తొత్తుగా వుంటూ మనకు సహాయం చెస్తున్నాకూడా నీకు జాలి కావటలేదు. పైగా గౌరవం, మర్యాద, వంశం యేమి టేమిటో పలుకుతావు. అవన్నీ దానికి మాత్రం లేవేంటి? నీకంటె యెక్కువే వున్నాయి. తింటే గద వద్దూ... మొహానికి పెట్టుండాలి...' అమ్మగొంతు చాలా తీవ్రరూపంలోకి వచ్చేసింది.

'ఆయ్యకంటె ఆ బాబుగార్లే క్షేమంగానూ, గౌర వంగానూ చూస్తారు...' గంగి యింకా యేదేమిటో వాదిస్తూనే వుంది.

రుక్కిని వింటే, చలమయ్యకూడా లోపలికి వెళ్ళాడు బరబరా, యీ అంటున్నవన్నీ యెవరోనా అన్నట్లు.

'ఏమే రుక్కి...నిజం చెప్తావా చెప్పవా' చలమయ్య నిలదీశాడు.

రుక్కిని ఒళ్ళంతా చెమటెక్కిపోయింది.

'నువ్వేంచేసావ్వావు...ఇంతసేపటిదాకా యెక్క డున్నావు...మారి బాబుగారింటికి వెళ్ళావా... నాకు అన్నీ తెలుసు. నాకళ్ళకే గంతలు కట్టదా మను కుంటున్నావా? గంగిని యిచ్చాను నే నేమి అనేట్టులేదు. నిజంచెప్పు...' చలమయ్య రుక్కిని వూపిరి ఆడ నీయటం లేదు.

రుక్కినికి, తన తండ్రికి జరిగిన విషయం అంతా తెలిసిపోయిందేమో అని భయంగా వుంది. ఆసమ యంలో రుక్కినికి నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో

తెలీకుండా వుంది. ఇంతలోకి, గంగి, అమ్మకూడా లోపలికి వచ్చేశారు.

'ఏమిటా నిలవెయ్యటం...నాకు అంతా తెలుసు. నేను కనుక్కుంటాన్లే నువ్వుపద...' అమ్మ చొరవ చేసుకొని చలమయ్యను వెనక్కి నెట్టేసింది.

రుక్కినికి యేమీ అర్థం కావటం లేదు. తన తండ్రి అడిగే ప్రశ్నలకు గాని, అమ్మ చెప్పే సమాధానానికి గాని పాత్రేమిటో రుక్కినికి బోధపడటం లేదు. ఆ సమయంలో మాత్రం, తప్పించుకుని బైటపడ్డాను అని లోపల లోపల సంతోషించింది. చలమయ్య కోర చూపులు చూస్తూ, వాకిట్లో అరుగుమీద కూలబడ్డాడు.

'అమ్మా...' అని పిలిచింది రుక్కిని యెంతో ఆవేదనగా.

'అమ్మాయి రుక్కిని నాకు అంతా తెలుసు... నువ్వేమి చెప్పక్కర్లేదు...'

గంగి యేమిటో చెప్పబోయి ఆపేసింది.

రుక్కినికి అంతా అయోమయంగా వుంది. ముందు ముందు యేమవుతుందో అనే భయం పట్టుకుని పీకిస్తోంది. తాత్కాలికంగా అప్పటికప్పుడవుతే యెట్లాగైతే బైటపడింది. మనస్సులో దిగులు, భయం స్థావరాలు యేర్పరచుకున్నాయి. ఆ రాత్రంతా రుక్కిని మనస్సంతా కలవరపడి పోతోంది. నిద్రపట్టటం లేదు. చాపమీద అటూయిటూ దొర్లిపోతోంది. మధ్య మధ్య లేచి, కాసిని మంచినీళ్లు త్రాగి మళ్ళీపడుకుంటోంది. తెల్లారుతుంది. మళ్ళీ బాబుగారింటికి పనికి వెళ్ళాలి. పనికి వెళ్లితే, బాబుగారు వూరుకోరు తిన్నె మన్నా చేస్తారు. పోనీ పనికి వెళ్ళనంటే, అయ్య, అమ్మ, వూరుకోరు. వెళ్ళనవటానికి కారణాలు యేం చెప్పాలి. అక్క కూడా వప్పుకోదు. పరిపరివిధాల ఆలోచిస్తూ కళ్లుమూసింది, అప్పటికే తెల్లవారిపోయింది.

'రుక్కీ! యింతసేపైనా నిద్దర లేవవేమిటే...' లేవ... రుక్కిని తట్టి, అమ్మ నిద్రలేపుతోంది.

రుక్కిని బద్ధకంగా అటూయిటూ సాగి, కళ్లు నలుపుకుంటూ లేచి కూర్చుంది.

'ఒక్కనాటికే యిట్లా అయిపోయినావేంటే...' అమ్మ, రుక్కిన్ని చూసి నవ్వుకుంది.

అమ్మవంక అదోరకంగా చూసి, రుక్కిని ప్రక్క వదిలి పెట్టేసింది.

అమ్మ, గంగితో యేమిటేమిటో చెప్పతూ సంబరపడి పోతోంది. గంగికూడా తెలిసినట్లు నవ్వేసింది. చలమయ్య పిల్లిద్దర్ని చూసి చిట చిట లాడి పోయాడు.

"ఇయ్యాళ్ల పనికి వెళ్ళవేంటి...ఎంత ప్రొద్దెక్కిందో చూశావా...రుక్కిన్ని, సూరిబాబుగారింటికి వెళ్లమని ప్రోద్బలం చేస్తోంది అమ్మ.

"అమ్మ!...తలకాయ నెప్పి బాగా యెక్కువగా వుందే. ఇయ్యాల యెక్కడికి వెళ్లలేనే..." తలకాయ గట్టిగా పట్టుకుని వున్నచోటనే చతికిల పడింది రుక్కిని.

అమ్మ మళ్లీ నవ్వుకుంది. జుట్టు నిమురుతూ పోనిలే యివ్వాళటికి అక్క వెళుతుందిలే అన్నది అమ్మ; రుక్కినికి ప్రాణం యెంతో తేలికగా అనిపించింది.

ఈ నాడు ఉదయం గంగేవెళ్ళి అక్కడ పనులన్నీ చూసుకుని వచ్చింది. మధ్యాహ్నం దాటినప్పటినుంచి మళ్ళీ రుక్కినికి. గుండె అదురు యెక్కువయింది సాయంత్రానికి యేమి వంక చెపుదామా అని ఆలోచిస్తోంది. ఎట్లాగైనా అక్కనే కోరుకుందాం సాయంత్రం కూడా వెళ్లి పనిచెయ్యమని అనుకుంది రుక్కిని. గంగి, రుక్కిని కోరినట్లుగానే చేసింది. కాని మళ్లీ తెల్లారుతుంది. తాను పనిలోకి వెళ్ళాలి. అప్పుడేం చెయ్యటం ఈ ఆలోచన ఆ రాత్రి నుంచే ప్రారంభమయింది రుక్కినికి. ఎన్నాళ్లు యిట్లా గడపటం అనుకుంది. ఏదో ఒకనాడు యిది బైట పడక మానదు. నలుగురు నాలుగు మాటలు అనటం తప్పదు. ఏట్లాగైనా ధైర్యం చేసుకుని ముందుకు పోవాలని నిశ్చయం చేసుకుంది. అంతగా బాబుగారు అడుగుతే వున్నది వున్నట్లు చెప్పేద్దాం నలుగురికీను. అప్పుడే తప్పెవ్వరిదో అందరికీ తెలిసిపోతుందని, గుండె నిబ్బరం చేసుకున్నది రుక్కిని.

భల్లున తెల్లారింది. ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నులయి పోయారు రుక్కిని అదివరకు వెళ్లినట్లుగానే సూరిబాబుగారింటికి పనికివెళ్లింది. కసువుపూడ్చి ముగ్గేసింది. గదులు చిమ్మి చెత్త అవతల పారపోసింది.

ఒకటో రెండో బట్టల్ని బండకేసి బాది ఎండలో ఎండేసింది. చెంబులు గిన్నెలు తోలిచి యింట్లో పెట్టేసింది. ఇన్ని పనులు చేస్తుండగా ఎప్పటి కప్పుడు రుక్కిని మనస్సులో ఓ విధమైన ఆవేదన, భయం, తొట్రుపాటు, పెల్లుబుకుతూనే వున్నాయి. కాని యెవరూ కూడా తన పనికేమీ అడ్డంరాలేదు. సూరిబాబుగారు అసలు కనిపించనే కనిపించలేదు. రుక్కినికి భయం కంటె ఆశ్చర్యం యెక్కువ అయింది. తాను వూహించుకున్నట్లు యేదీ జరగలేదు. పైపెచ్చు. సూరిబాబే కనిపించలేదు రుక్కినికి వుక్కిరి బిక్కిరి అయినట్లయింది. మామూలుగానే జరుతున్నా అమ్మగారు అని చెప్పి వచ్చేసింది. రుక్కిని. సాయంత్రం కూడా చెప్పతిగ్గ మార్పేమీ కనిపించలేదు, రుక్కిని పనిలో. అయితే ఆ పని యీ పని చెప్పటంవలన, ఆ సాయంత్రం రోజూకంటె కొంచెం ఆలస్యంగానే యింటికి వచ్చింది.

ఎదురుగా చలమయ్య వచ్చేసి, 'ఇంతసేపటి దాకా యేంచేస్తున్నావు' అని ప్రశ్నించాడు.

'అమ్మగారు యేవో పనులు చెప్పారు. అందుకని ఆలస్యం అయింది...' తొణక్కుండా నిదానంగా సమాధానం చెప్పింది రుక్కిని.

చలమయ్యకు ఆ సమాధానం యేమాత్రం కూడా తృప్తిగాలేదు. పైగా అది అబద్ధం అని కూడా అనుకున్నాడు. ఇంతలోనే అమ్మ యింట్లోంచి వచ్చేసింది.

'రుక్కి వచ్చావమ్మా! నీ మాటే అనుకుంటున్నా...' భుజాన చెయ్యివేసి, అమ్మ, రుక్కిన్ని లోపలికి తీసుకు వెళ్లింది.

'సూరిబాబుగారు యేమన్నారు......' అమ్మ నవ్వుతూ అడిగింది.

రుక్కిని యేమీ మాట్లాడలేదు.

'అమ్మకు యెక్కడలేని సిగ్గు......' అమ్మ, రుక్కిని, చెక్కిళ్ళను గట్టిగా వత్తి లోపలికి వెళ్ళిపోయింది.

రుక్కిని యెంతో తీవ్రంగా ఆలోచించటం మొదలు పెట్టింది. అమ్మ ధోరణి తనకేమీ అర్థం కావటంలేదు. లేకపోయినా సమయానుకూలంగా, అవుననో, కాదనో సమాధానం చెప్పి, ఆవేశం తప్పించుకుంటూ వస్తోంది. ఒకటి రెండు రోజులు గడిచిపోయినాయి.

రుక్కిని మనోవేదన యెక్కువయిపోతోంది. ఇంట్లో చూస్తే అమ్మ ధోరణి ఒకవిధంగా వుంది, తండ్రి ధోరణి యింకోవిధంగా వుంది. బాబుగారింటికి పనికి వెళితే అక్కడవాళ్లు కూడా ముక్తసరిగా మాట్లాడి ముభావంగా వూరుకుంటున్నారు. సూరిబాబుగారు వస్తే కనిపించనే కనిపించటంలేదు. బాబుగారెక్కడ అని యెంతో అమాయకంగా అడిగినా, ఆ ప్రశ్న యెన్ని విధాల యెంతమంది అర్థం చేసుకుంటారో అనే భయం. రోజురోజుకు రుక్కిని నలిగి నలిగి పోతోంది. చాలా గడ్డు రోజులు తెచ్చిపెట్టుకున్న భయంతో గడిపేసింది.

ఆనాడు పనెక్కువవటంవలన, ఆయాసపడుతూ అలసిపోయి యింటికి వచ్చింది రుక్కిని. బద్ధకంగా వాకిట్లో మంచంలో నడుము వాల్చింది. చలమయ్య ఆనాడు అప్పటికి యింటికి రాలేదు. ఆ రాత్రికి గంగి యింటికి రాదని అమ్మకు తెలుసు. అమ్మ ఒక్కర్తే యింట్లో వుంది. కొడిగట్టిన దీపాన్ని కోసివి, చమురు నిండా పోసి ఓ లాంతరు వెలిగించి సావిట్లో పెట్టింది. ఉండి ఉండి గవ్వ గవ్వ మంటోంది. చేలకేసి గట్టిగా రెండుసార్లు కొట్టి, ఆ లాంతరును వీధి గుమ్మం దగ్గరకు తీసుకువచ్చేటప్పటికి, మంచంలో పడుకునివున్న రుక్కిని కనిపించింది.

"రుక్కి ఎప్పుడొచ్చావే...ఎంతసేపయిందేమిటి...' అమ్మ లాంతరు పట్టుకుని మంచం దగ్గరకు వచ్చింది. రుక్కిని అలిసిపోయి, మొహం యెంతో నీరసంగా కనిపించింది.

అమ్మ పమిటకొంగుతో రుక్కిని మొహంఅంతా తుడిచేసి మెల్లిగా లోపలికి తీసుకుపోయింది.

'రుక్కి! అట్లా రోజు రోజుకు నలిగిపోతున్నావేమిటి...బాబుగారు నీతో దక్కగా మాటలాడుతున్నారా ..వారి దయ మనకుండాలే గాని, మనకు తక్కువేమిటి...ఇంకా నువ్వు చిన్నపిల్లవి. నీకుబాగా తెలీదమ్మా...అంత సిగ్గు వుండకూడదు. ఎంతయినా అయ్యగారితో చనువుగా వుండి, వారిని మెప్పించావంటె, యింకా మనకు యేలోపమూ వుండదు......

ఏమిటి నేను చెపుతోంది తెలుస్తోందా...' అమ్మ నవ్వుతూ, రుక్కిణ్ని అడిగింది.

రుక్కిణి ఎందుకనో బలవంతంగా చిరునవ్వు తెప్పించుకుని అమ్మవంక చూసింది.

అమ్మ పకాలున నవ్వింది.

ఆరాత్రి రుక్కిణికి తీవ్రమైన ఆవేదన కలిగింది. అమ్మ అంతరార్థం పూర్తిగా తెలుసుకుంది. ఏ కారణం చేత అమ్మను, తాను ఏవగించుకుంటోందో, మళ్లీ ఆ విషయాన్నే ప్రోత్సహిస్తూ తనదగ్గర ప్రస్తావించటం, రుక్కిణికి యెంతో వికటంగా అనిపించింది. కచ్చితంగా తనతల్లికి చెప్పెయ్యాలనుకుంది. తనతల్లి మీద తనకు యెన్నడూ రాని కోపం వచ్చేసింది. తాను ఒక యింటిదైతే భర్త కొంపట్టుకుని చెమటోడ్చి పనిచేసి యింత గంజి త్రాగలేకపోదు తన శరీరంలో మంచి ఓపిక వుంది. కష్టించి పనిచెయ్యగలదు తన బ్రతుకు తాను బ్రతకగలదు. మరీ యీ నీచమైన బ్రతుకు అమ్మ తనకు యెందుకు ఉద్బోధిస్తోంది, తనస్వార్థంకోసం. అక్కను అనవసరంగా అల్లరిపాలు చేశారు. ఈనాడు అక్కంటే నలుగురు యేమనుకుంటున్నారో అర్థం కావటంలేదు. కడుపుకు లేని యింట్లో పుట్టాం. కడుపుకోసం కష్టం చెయ్యగలం. ఇంకా మనకు లోటేమిటో. ఇతరులను మెప్పించాలని, యెవరికోసమో కూడబెట్టాలని, మనం నాశనమయిపోవటం యెందుకో అర్థంకావటంలేదు. నా జీవితం నన్ను చూసి మురిసిపోయిన వాళ్లందర్నీ మెప్పించటానికి కాదు. నా జీవితం నాకోసం, నా ఆనందంకోసం. అంతే. అమ్మకు యివన్నీ చెప్పేస్తాను. మళ్ళీ ఆ విషయం నాదగ్గర తీసుకురాకుండా చేస్తాను. ఏమిటేమిటో ఆరాత్రల్లా అనుకుంటూనే వుంది. లోపలలోపల కృశించి పోతూనే వుంది.

చిరాకుగా లేచి, రేగిన జుట్టుకు యింత నూనె పట్టించి పైముడుకు నూరిబాబుగారింటికి వెళ్లిపోయింది రుక్కిణి. వీధిగుమ్మం తీసేవుంది. లోపలికి వెళ్లిపోయింది. కాని యేమిటో భయమేస్తోంది. ఆ యిల్లు ఆ ఒక్కరాత్రిలోనే యెంతో మారిపోయినట్లనిపించింది. చెప్పలేని భయం, రుక్కిణ్ని ఆవహించింది. ఆ యింట్లో కనిపిస్తున్న ఒకరిద్దరు వ్యక్తులు భయంకరంగా కనిపిస్తున్నారు. తప్పటడుగులు వేసుకుంటూ, పనిలోకి వెళ్ళింది. వాకిట్లోకి యింతలో ఓ బండీవచ్చి ఆగింది. ఇంట్లోంచి ఓ ముసలావిడ, యింకో నడి వయస్సు వ్యక్తి వెళ్ళి బండీలో యెక్కారు. బండీ సాగిపోతోంది. రుక్కిణి అదేపనిగా అట్లా చూస్తూ నిలబడిపోయింది. వెళుతున్న బండీని సాగనంపటానికి కొంచెం ఆలస్యంగా లోపల్నుంచి నూరిబాబు వచ్చి, చెయ్యూపి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు రుక్కిణి, నూరిబాబును మళ్ళీ చూడటం అదే మొదటిసారి. వళ్లు ఝల్లుమన్నది ప్రక్కకు తప్పుకుంది. నూరిబాబు నిరామయంగా లోపలి గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. రుక్కిణి హృదయంలో ఆవేదన అలలాగ పైకి వుబుక్కు వస్తోంది. దకదక ఆ పని యీ పని చేసుకుపోతోంది. నూరిబాబు కూర్చున్న గది గుమ్మం దగ్గరకు వచ్చేటప్పటికి, రుక్కిణి ఆగిపోయింది. తన అరచెయ్యి మళ్ళీ చూసుకుంది. ఇంతలోనే నూరిబాబు లోపల్నుంచి బైటకు వచ్చేసి, తలవంచుకుని గంభీరంగా దిగి వెళ్లిపోయాడు. రుక్కిణి, నూరిబాబు కళ్ళల్లోవున్న గంభీరతను భరించలేకపోయింది. రుక్కిణికి హృదయం బ్రద్దలయినట్లనిపించింది. వళ్లంతా గజగజ వణికిపోయింది. తనకు తెలీకండానే తన శరీరం తడిసిపోయింది. పెద్ద నిట్టూర్పు విడిచి యింటికి వెళ్లిపోయింది.

రోజు రోజుకి రుక్కిణి సన్నపడిపోతోంది. మనోవ్యాధి యెక్కువయిపోతోంది మనిషి చేసిన తప్పు పనిని ఎదిరిస్తూవుంటే ఆ తప్పు పనిని సమర్థించే శక్తి అతనిలోనుంచి బహిర్గతం అవుతుంది. అలాంటి తప్పు పనిని, యే ఒక్కడూ కూడా విమర్శించకండా, యెవరూ పట్టించుకోకండా వుంటే, మానవుల్లో అంతర్గతంగా వుంటున్న ఆ మనోదౌర్బల్యం సన్నగిలి పోతుంది. పశ్చాత్తాపానికి, పరితాపానికి అవకాశం కలుగుతుంది. తాత్కాలికంగా అహంకారం పెరిగి పోయినా. రాను రాను, తాను చేసిన తప్పును యెంతో ఘోరంగా చిత్రించుకుని పశ్చాత్తాపపడి ప్రణాలు తీసుకుంటారు. ఇదో రకపు మనో ప్రవృత్తి. ఇలాంటి ప్రవృత్తిలో పడి తిన్నకు పోతోంది రుక్కిణి. నూరిబాబు తనను యేమి చేమిటో చేస్తాడని, తన తల్లి, తండ్రి, యింకా యితరులు, తనను యేకో ఆడిపోస్తారని అనుకున్న రుక్కిణి అప్పట్లో, తాను చేసినపని చెడ్డదికాదు అని రుజువు

చెయ్యటానికి తగిన సామాగ్రిని చేకూర్చుకుంది. ఈనాడు ఆ విషయం యెవరూ పట్టించుకోవటం లేదు. సూరిబాబే, తన యెదుటనుంచి, తలెత్తకుండా గంభీరంగా వెళ్ళిపోయాడు. రుక్కిణ్ని మరింత పిచ్చిదాన్ని చేసింది యీ సంఘటన. తాను చేసింది నిజంగా తప్పేమో. సరిగ్గా అర్థం చేసుకోలేదేమో, ఏమైనా తొందరపడ్డానేమో, యేమిటో యేమిటో రుక్కిణి పిచ్చిదానిలాగ ఆలోచిస్తోంది. ఆమెలో ఆ వేదన పశ్చాత్తాపానికి దారితీస్తోంది. కాని యేం చెయ్యాలో తోచటం లేదు.

ఆనాడు కూడా మామూలుగానే సూరిబాబుగారింటికి వెళ్ళింది. పనులేవో తన చిత్తం వచ్చినట్లు చేసుకుపోతోంది. మనస్సు మథించుకుపోతోంది. మెల్లిగా మేడమీద గదికి వెళ్ళటానికి మెట్లు యెక్కుతోంది. అంత పెద్ద యింటిలోను సూరిబాబు తప్ప యింకా యెవ్వరూ లేరు. నిశ్చలంగా ఏమిటో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు సూరిబాబు.

సూరిబాబు జీవితం మహా తమాషా అయినది. అతని మానసిక ప్రవృత్తి బహు చిత్రమయినది. జీవిత లక్ష్యం యేమిటో నిశితంగా ఆలోచిస్తూ వుంటాడు. తనకు జ్ఞాపకం వచ్చినప్పటినుంచి, తాను నిర్దుష్టమైన విషయావృతాలలో విహరిస్తూ, ఆలోచనలు చేస్తూ వుండేవాడు. ఆలోచిస్తున్నకొద్దీ, ఆస్తి, ధనం, మానవజీవిత పురోభివృద్ధికి ఆటంకాలు అని నిశ్చయానికి వచ్చాడు. అయితే అతని తాలూకు యెవరో దాయాది పోవటంవలన, ఏభై ఎకరాల ఆస్తి, ఓ పెద్ద తోట ఇతనికి సంక్రమించినాయి. వెలుగుల్లో కలిసి తిరగాలని వుబలాట పడ్డాడు. ఆత్మీయులకోసం, సూరిబాబు యెంతో పరితపించిపోయాడు. తాను ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న తన అన్న అకస్మాత్తుగా తనను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. తనతల్లిదండ్రులు తనను పూర్తిగా అర్థంచేసుకుని తన పురోభివృద్ధికి యెంతో దోహదం యిస్తారని కలలుకంటూ వుండేవాడు. కాని తన తండ్రి తనకు జ్ఞాపకం వచ్చినప్పటినుంచి పెళ్లి చేసుకోమని యింట్లో పోరుపెడుతూ వుండేవాడు. తనతల్లి దానికి వత్తాసుగా నీతులు బోధిస్తూ వుండేది. కాలగర్భంలో యిద్దరూ కలిసిపోయారు. ఆస్తిని ఆసరాగా పెట్టుకుని, ఆత్మీయత వలకబోయాలని, చాలామంది విఫలంగా ప్రయత్నించారు. ఆత్మీయత అనేది డబ్బుతో కొనేది కాదని సూరిబాబు యెన్నడో గ్రహించాడు. ఇలా తన జీవితం సుఖమయం చేసుకోవటానికి కృతనిశ్చయుడై వుండిపోయాడు. ఆ సమయం కోసం యెంతో ఓపిగ్గా కనిపెట్టుకు కూర్చున్నాడు. ఆ సమయం వచ్చిందనుకున్న తరుణంలో, అతను పూర్తిగా దెబ్బతిన్నాడు. తాను ఊహించలేని విషయం జరిగింది. దానికి కారణమేమిటి? బాధ్యత యెవరిది? తానెంతవరకు బాధ్యుడు! సంఘంలో మానవునికి మానవునికి ఇనుప తెరలెందుకు! ఇవి సృష్టించిన వారెవరు? వీటిని విచ్ఛిన్నం చేసే శక్తి యెవరికుంది? గుణాలన్నీ డబ్బుచే అంటిపెట్టుకుంటాయా? గుణహీనులలో డబ్బుచే అంటిపెట్టుకున్నవాళ్లు యెంతమంది? జీవితంలో ధ్యేయం యేమిటి! నిజమైన ప్రణయానికి విలువ లేక పోవటం, తుచ్ఛమైన కామానికి విలువ వుండటం! ఈ విరుద్ధభావాలెందుకు? ఒక స్త్రీ, అబల తిండికి నోచుక్కనే అభాగ్యురాలు, రూపసి, ఆమెలో నేను ఊహించలేని శక్తి యెవరు యిచ్చారు. కృత్రిమ బంధనాలలో బిగించేసి, యితరుల సౌభాగ్యాన్ని చూడలేని కొంతమంది స్వార్థపరులతో ఏర్పడిన సంఘమా? అర్థంలేని ఆవేశంలో, తన బాగుయేమిటో తాను తెలుసుకోలేని ఒక అమాయకపు పిల్ల క్రౌర్యమా! ఇంత డబ్బున్నా, జీవితంలో నేను యెందుకు సుఖపడటం లేదు. నాకు వ్యక్తుల్లో విశ్వాసం నశించింది. సంఘంమీద గౌరవం లేదు. నేను కూడా ఒక నిస్సహాయుడు లాగ సంఘపు పురిత్రాడులో యేనాడో ఒకనాడు చిక్కుడు పోవాల్సిందే! ఆలోచించి ఆలోచించి అలసిపోయాడు. చివాలున కుర్చీలోంచి లేచాడు. కిటికీ తలుపులు వేసేశాడు. బైటకు రాబోతున్నాడు ఎదురుగా రుక్కిణి నిలబడి ఉంది. ఒక్కక్షణం తీక్షణంగా చూశాడు రుక్కిణి వంక. రుక్కిణి వెక్కి వెక్కి యేడ్చి, కాళ్ళమీద పడింది క్షమించమంటూ.

పెద్ద నిట్టూర్పు విడుస్తూ, నిశ్చలంగా నిలబడిపోయాడు.

“అయ్యగారు, అయ్యగారు” అంటూ వలవల యేడ్చింది రుక్కిణి.

సూరిబాబు యేమీ చలించకుండానే అట్లాగే నిలబడి ఉన్నాడు.

రుక్మిణి మళ్ళీ పిలిచింది.

సూరిబాబు తీక్షణంగా చూశాడు మళ్ళీ ఓ సారి రుక్మిణి కళ్లల్లోకి.


'రుక్మీ! లోకం నన్ను ఏమిటేమిటో అంటోంది. నీకు వినిపిస్తోందో లేదో నాకు తెలీదు నేను నీ జీవితాన్ని నాశనం చేశానట. నీ పొంగి పొరలుతున్న యౌవనం, నేను చూసి సహించలేక నీకు తీరని అన్యాయం చేశానట. దానికి ఫలితమే నువ్వు రోజు రోజుకు ఇట్లా అయిపోవటంట నామీద మంచి విశ్వాసం వున్నవాళ్ళే నన్ను యీ విధంగా తూలనాడుతున్నారు. నీతో పరిచయముందనే ప్రచారం చాలా తీవ్రంగా సాగిపోతోంది. నా గౌరవానికి, నా ఆత్మకు అలాంటి పరిచయం యెంతో వంచన అని యీనాడు గ్రహించుకోగలిగాను. నీ జీవితం అంతా సుఖమయం చేద్దామని నా జీవితం సుఖమయం చేసుకుందామని, మానవులు కల్పించిన బంధనాలన్నింటినీ త్రుంచివేసి, యెంతో వున్నతమైన ఆదర్శంతో నిన్ను పెళ్ళి చేసుకుందామని ఆశించి నీ దగ్గరికి వచ్చాను. కాని నువ్వు అపార్థం చేసుకున్నావు నన్ను. నాడబ్బు నా ఆస్తి నా ధనం, నన్ను సరిగ్గా అర్థం చేసుకోనీయలేదు అది నీ తప్పెంగాదు. కాని యీ నాడు నాకు తగినశాస్తి జరిగింది. నీ జీవితంలో నిప్పులు పోస్తానవే దురభిమానంతో, నా జీవితాన్ని నాశనం చేశావు నా మనస్సులో క్రోధ పుట్టించావు. ఈ దావాగ్ని యీ జన్మను క్రమక్రమేణా దహించుకుపోతుంది. నాకు తెలుసు. నా జీవితంలో నేను కోరుకున్నదేదీ జరగలేదు. అన్నింటిని సహించి, చివరకు నీ ప్రేమకోసం తపన పడ్డాను. అది కూడా నాకు లభ్యంకాలేదు. నేను నిన్ను ప్రేమించటం నా స్వార్థంకోసమే కాదు. నిన్ను చూసి, నేను చాలా ఆలోచించాను. నీ జీవితంలో యెలాంటి కష్టాలు యెదుర్కోవలసి వస్తుందో యీ సంఘంలో వుంటున్న నేను పూర్తిగా గ్రహించగలను. వాటన్నింటిని తొలగించి, నీ రూపానికి నీ గుణానికి తగ్గ అవకాశాలు యివ్వాలని, యెంతో దూరం ఆలోచించి, యెంతో ఆదర్శం అనుకొని నీ దగ్గరకు వచ్చాను. అది నువ్వు గ్రహించుకోలేక పోయావు. ఈ నాడు నీ వల్ల నేను, నా వల్ల నీవు భ్రష్టులమై పోయినాం. ఈ అపవాదు యీ అపనింద తప్పించటానికి నేను శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. నువ్వు కూడా ప్రయత్నం చేసి నా పరువు నిలబెట్టు. అంతకంటె నిన్ను కోరేదేమీ లేదు. నేను చెప్పినవాటిల్లో యే ఒక్కటీ కూడా పూర్తిగా అర్థం చేసుకోలేవని నాకు తెలుసు, కాని నా ఆవేదన తగ్గేదెట్లా! నేను యెవ్వరితో ఇవన్నీ చెప్పి హృదయ భారాన్ని తగ్గించుకోగలను...' సూరిబాబు గజ గజ వణికిపోతూ నిలబడివున్నాడు.

అయ్యగారు నాకేం తెలీదండీ, నన్ను క్షమించండి...హోరుమని ఏడుస్తోంది రుక్మిణి.

'ఈ పరిస్థితుల్లో నే నేమీ చెయ్యలేను...' చెయ్యి మొహానికి అడ్డం పెట్టుకుని సూరిబాబు దబదబ క్రిందకు వెళ్ళిపోయాడు.

రుక్మిణికి యెంతో ఛాయామాత్రంగా బాబుగారి బాధ అర్థమయింది. తన అరచేతిని భూమిమీద గట్టిగా నాలుగైదుసార్లు బాదింది. తనను తాను నిందించుకుంటోంది. తాను చేసిన ఘోరమైన తప్పుకు పశ్చాత్తాపపడటానికి కూడా అవకాశం లేకపోయింది. హృదయంలోనుంచి నిప్పు అవిర్లు బుసలు కొడుతూ పైకి వస్తున్నాయి. తన కల్మషాన్ని దహించేస్తున్నాయా అన్నంత తీవ్రంగా వచ్చేస్తున్నాయి మనస్సు పరిపరివిధాల పోతోంది. తన జీవితాన్నే సమాప్తి చేసుకోవాలని వచ్చిన ఆవేశం అక్షణంలోనే మాయమైపోయింది. తాను జీవితంలో యెంతో సుఖం అనుభవించాలని, యెంతో ఆనందంగా గడుపుతూ వుండాలని యేమిటేమిటో కలలుకంటూ వుండేది. తన అందాన్ని చూసి తానే అమాయపడుతూ వుండేది. అలాంటిది యీనాడు జీవితాన్ని సమాప్తిచేసుకోవాలనే ఆలోచన వికృతంగాను, విరుద్ధంగాను తోచింది. అయ్యగారికి తనమూలాన చెడ్డపేరు వచ్చిందని తెలుసుకుంది. దానికి తాను చెయ్యదగ్గ పనేమిటి ఆలోచించటం మొదలుపెట్టింది. ఓమూల అమ్మ తననియెవరికో అమ్మేసి డబ్బు సంపాదించాలనిఆశపడుతూ వుంటుంది. అక్క జీవితం అంతా బజారుపాలయింది. అయ్య యేమీ చెయ్యలేనివాడు. ఇక వీళ్ళతో వుండి లాభంయేమిటి? నాకు వీళ్లతో యేవిధమైన సంబంధమూ లేదు. నేను వీళ్ళెవ్వరికీ కనిపించకుండా యెక్కడికో దూరంగా వెళ్ళిపోతాను. అక్కడే నా జీవితం క్రొత్తవిధంగా సాగించు

కుంటాను. ఇక యీ వూళ్ళో నాకు తావులేదు. ఓ నిశ్చయానికి వచ్చేసింది. ఆ సాయంత్రం బండికి యెవరికీ చెప్పకుండా ఆ వూరు వదిలి వేసి వెళ్ళిపోవాలని నిశ్చయించేసుకుంది రుక్మిణి. పగలల్లా మండిన సూర్యుడు పశ్చిమాద్రిలోకి కుంగిపోతున్నాడు సూరిబాబు గదిలో పిచ్చివాడిలాగ పచార్లు చేస్తున్నాడు అటూ యిటూ. అతని బుర్ర వేడెక్కిపోతోంది ఏమీ ఆలోచన తట్టటం లేదు. చటుక్కున యేదో ఓ వుపాయం తట్టి నట్లు వులిక్కిపడ్డాడు. తాను యీ వూరు వదిలి పెట్టి వెళ్ళిపోవాలి. ఈ అపనింద భరించలేను. ఈ అపవాదు సహించలేను అనుకున్నాడు. గబగబ పెట్టెలోకి వాలు రైదు బట్టలు కుక్కేసి, సరిగ్గా బండి టైముకు రైలు స్టేషను చేరుకున్నాడు. సండెర్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఎరుగున్న వ్యక్తి యెవరైనా కనిపి
వులిక్కి పడుతున్నాడు. ఆవేదనగా రైలు రావటాని
యింకా యెంత టైముందో కనుక్కున్నాడు. ఆనా
కూడా గంట లేటుగానే రైలు వచ్చింది. ముచ్చెమట్ల
పోసిన సూరిబాబు తెప్పరిల్లి, రైలువచ్చి ఆగంగా
జనాన్ని నెట్టుకుంటూ ఓ పెట్టెలోకి చొరబడ్డాడు
గుంపులు గుంపులుగా వస్తున్న జనంమధ్య శరీరాన్ని
దాచుకుంటూ, తానుమాత్రం యెవర్నీ చూడకుండా
యెక్కడో జనం వత్తిడిగావున్న మధ్య పెట్టెలో
యెక్కేసింది రుక్మిణి. రైలు సాగిపోయింది. రాత్రి
వెళ్ళిపోయింది. తెల్లారేటప్పటికి సూరిబాబు రుక్మిణిని
లేవదీసుకుని వెళ్లాడనే మాట వూరంతా పాక్కి
పోయింది.



మా అమ్మ మళ్ళీ నా వేపు చూచి అన్నది. "నా అన్న వాళ్లందరూ గతించారట. ఆస్తిపాస్తులు గానీ అండదండలు గానీ లేవట పాపం!"

ఒకనాడు నన్ను తృణీకరించి వెళ్లిపోయిన సీత ఈనాడు తిరిగి నా పంచజేరి నా అనుగ్రహం ఆశిస్తోంది. ఒక వేళ ఇప్పుడు నేనూ తిరస్కరిస్తే?

ఊహించుకోలేకపోయా నా దృశ్యాన్ని. సిరి కోసం ఆప్తులమని చేరేవారు కోట్లకొలది. ఆమెనున్న కొద్ది ఆస్తిపాస్తులూ హరించిన తర్వాత? నడివీధిలో ఆ అమాయకపు పసికందులు అన్నహారాలకోసం గోడుగోడున అలమటించవలసి రావచ్చు. వీధి మొగ మెరుగని సీత నాల్గు బాటల కూడలిలో నిలబడి పరుల క్షమాభిక్ష అర్థించవలసి రావచ్చు.

ఆలస్యం ఏమాత్రం లేకుండా మా అమ్మ వేపు తిరిగి జవాబిచ్చాను. "సీత మనింట్లోనే వుండిపో కూడదా అమ్మా?"

మా అమ్మ నవ్వింది. ఆమెతో ఎనభై వసంతాల జీవితం గడిపిన మా నాన్నారికే ఆ మందహాసంలోని నిగూఢభావా లప్పుడప్పుడు అర్థంకావు. ఇక నేనా! అయోమయంగా ఆమె వేపు చూచాను. ఆమె సీతను వొళ్లో దాచుకుని మెల్లిగా సముదాయించటానికి ప్రయత్నిస్తోంది

ఆ దృశ్యం ఎంత హృదయవిదారకంగా వుంది!

తల నెరిసిన వృద్ధ మా అమ్మ. ఆమె వొడిలో జీవిత సుడిగుండా లర్థం చేసికోలేని అమాయక హృదయ సీత! పద్మపత్రంలా కంపిస్తున్న సీతను చూడలేక గబగబా ఆ ప్రాంగణం దాటి బయటకు వచ్చేశాను.

చెట్లమధ్యగా సిగ్గుపడ్డ ముఖంతో బయటకు వస్తున్న సూర్యుని చూచినా నా సీతను నేను మరువలేకపోయాను. కనుపించినా ఇంకా తృప్తిలేక తల్లిని బాధిస్తున్న లేగదూడను చూచినా అడుకుంటున్న ఆ బంగారుపాప నా మదిలో మెదులుతూనే వుంది. గోళీ లాడుతూ అల్లరిగా ఒకరి నొకరు త్రోసుకుంటున్న ఆ బడిపిల్లలను చూచినా, దిగులుగా ట్రంకుపెట్టె మీద కూర్చున్న ఆ నల్లబ్బాయి జ్ఞాపకం వస్తూనే వున్నాడు. కాలకృత్యాలు ముగించానన్న మాటే కాని గాయపడిన సీత హృదయాన్ని ఊరడించలేనే అన్న వేదన మిక్కుటంగా బాధిస్తూనే వుంది. త్వరత్వరగా మరలా చావడిలోకి నడిచాను. అమ్మ అక్కడలేదు. పిల్లలిద్దరూ అప్పుడే ఎక్కడకు వెళ్ళారో అర్థంకాలేదు. సీత మాత్రం ఒంటరిగా గోడనానుకుని నిలబడి తనలో తనే కుమిలిపోతోంది.

నా రాకను గమనించినట్లులేదు సీత. దుఃఖ బాష్పాలామె కళ్లకు తెరలుకట్టి ప్రపంచాన్ని చూడనీకుండా చేస్తున్నాయిగాబోలు! మెల్లిగా సమీపించి, కొద్ది దూరంలో నిలబడి "సీతా!" అని పిలిచాను. నేను పిలిచిన పిలుపు నాకే వినబడినట్లులేదు. సీతకు వినబడి వుండదని నా అభిప్రాయం. కాని సీత మెల్లగా కళ్లు తెరచి నా వేపు ఒక్కసారి చూచి తిరిగి కళ్లు మూసుకొంది.

ఆడవారి హృదయాలు అగాధాలట! కానీ అప్పటి సీతను చూచిన వారికి మాత్రం నేనామె హృదయపీఠంలో ఏ కొద్దిగానో స్థానం సంపాదించుకొన్నానని మాత్రం తెలిసికోగలరు. సీతను సమీపించి మెల్లగా ఆమెను నా వేపుకు త్రిప్పుకున్నాను. అప్పుడు...అప్పుడు...మొదలు నరికిన తరువులా సీత నాపాదాలవద్ద వాలిపోయింది. హీనమైన నాపాదాన్ని చేకి కన్నీటితో అభిషేకం చేసి, తన సన్నని చేతులతో నన్ను బంధించి 'రామూ' అన్నది దీనంగా.

నేను బలితుణ్ణ సూర్యను నన్ను తృణీకరించిన సీతలో ఇంతగా నాపై వాత్సల్యమున్నదని అంతవరకూ నాకు తెలీదు. మెల్లగా సీతను లేవనెత్తి "భయపడకు సీతా—ఇంకా నీ చిన్ననాటి రామూ చనిపోలేదు" అన్నాను ఆప్యాయతతో. సీత ఏమీ మాట్లాడలేదు. తనలో తననుకుంటున్నట్లుగా "నా పిల్లలు... నా పిల్లలు..." అని మాత్రం కలవరించింది.

నా కళ్లు చెమ్మగిల్లడం నేను చూసుకోనేలేదు. నా ఊహల్లో నేను పరిభ్రమిస్తూ ప్రస్తుతాన్ని మరచిపోవడం గమనించనేలేదు. సీత తన పమిట కొంగుతో నా కన్నీరు తుడిచే వరకూ జాగృదవస్థలోకి నేను రానేలేదు.

"నన్ను జూచి నువ్వు దుఃఖిస్తున్నావేమిటి రామూ!" వర్షించిన మేఘంలా వుంది ఆమె వదనం. జవాబుకోసం తడుముకున్నా న్నేను కొద్దిసేపు.

"నీ మెడకొక గుదిబండనను కాదుకదు రామూ నేను?" అంత విషాదంలో కూడా ఇంత సున్నితంగా మాట్లాడటం ఒక్క సీతకే చేతనవును.

అందుకే ఆమె అంటే నాకు పంచప్రాణాలూ! ఇంతలోకి ఆ చిన్నిపాప పరుగెత్తుకుంటూవచ్చి తల్లి వొడిలో వాలింది. ఆ పాపను సీత ప్రేమగా హృదయానికి హత్తుకుంది. ఆ పాప నును చెంపలపై ముద్దుల

వర్షం కురిపించింది. మాతృప్రేమ వంటిదేదో నా ముందే వొలక బోసింది.

"ఈ జబ్బు, ఆ దిగులే రామూ నా జీవితానికేను గదు. ఈ పసికందులను చూచే నే బ్రతుకవలసి వస్తోంది."

పెద్ద ఆరిందాలా సీత చెబుతున్న ఆ మాటలకు నేను నవ్వకుండా వుండలేక పోయాను. నా కళ్ళ ముందు పుట్టి పెరిగిన సీత చివరకు నాకే పాఠాలు బోధిస్తోంది.

"ఈ రోజే బళ్ళో చేర్పిస్తాను పిల్లిద్దర్నీ!" అన్నాను మెత్తగా ఆ పసిపిల్లల మొగాల్లోకి చూస్తూ. సీత నోటితో ఏమీ చెప్పకపోయినా ఆ కళ్లలో విరిసిన ఆ జ్యోతులు ఆమె భావాన్ని వ్యక్తం చేశాయి.

ఆలా ప్రవేశించింది సీత మళ్ళీ నా జీవితంలోకి. దిక్కు దిక్కూ లేని మా యిల్లు మళ్ళీ ఆనందపు తరంగాల్లో తేలియాడింది. మా అమ్మకు చేతినిండా పని; సీతకు మనసునిండా సంతోషం, పిల్లలకు కావలసినంత తృప్తి. ఒంటరివాణ్ణైన నేను మళ్ళీ సంసారంలో ఓ భాగ్యాన్ని కలిగిన వాణ్ణయ్యాను. రాత్రి పూట పిల్లలకుపాఠాలు, పగటిపూట బడిపనీ, సాయంకాలం చక్కగా సీతతో అదీ ఇదీ మాట్లాడడం; మా యింట్లో సీత తిరుగాడుతుంటే రాజహంస నడయాడుతున్నట్లుండేది. ఆమె మా యింటికి ఒక కళ, లక్ష్మి. కానీ—

ఆ రోజు రాత్రి...

పుచ్చ పువ్వులావున్న వెన్నెల ఆకాశంనుండి క్రిందకు రాల్తోంది. సముద్రపు కెరటాలు గట్టునున్న బండరాళ్ళను విడవలేక విడువలేక వెనక్కు వెళ్తున్నాయి. 'మినర్వా'నుండి జనం ఒక్కరొక్కరే తిరిగి తమ యిళ్ళకి చేరుకుంటున్నారు.

అయినా ఆ నిశీథ ప్రశాంతత విచిత్రం చెక్కు చెదరకుండా అలానేవుంది. దరిదాపు నిర్జనంగావున్న గజపతిరోడ్డుగుండా ఇంటికి నడక ప్రారంభించాన్నేను. దారిలో పడుకున్న ఒకటి రెండు కుక్కలు నన్ను చూచి మొరిగి దూరంగా వెళ్ళిపోయాయి. ఇల్లు చేరటానికింకా ఎంతో దూరం వుండడంవల్ల త్వరితం చేసిన నా నడకనుచూచి పైనున్న పున్నమ చంద్రుడు కూడా పరుగెత్తడం ప్రారంభించాడు.

దూరంగా మాటుక్రిందనున్న చీకటిలో ఏవో నీడలు రెండు ఒకదానిలో నొకటి త్వరత్వరగా కలిసిపోయాయి. అప్పుడే నన్ను దాటిపోయిన రిక్షాలో నుండి కిలకిలలు వినిపించీ వినిపించనట్లు వినిపించాయి. పైనున్న తారలుకూడా శశాంకుని పెనవేసుకుంటున్నాయి.

ఆ సౌందర్యానికి నేనూ వివశుణ్ణయ్యాను. నా హృదయాంతరాల్లో ఎక్కడో ఒకమూలనున్న ప్రేమకాంక్షలు తీయనిరాగ మాలపించాయి. అయినా ఇంటిమీద ధ్యాసతో నడుస్తూనే వున్నాను.

ఇంతలో—వెనుకనుండి గాజుల సవ్వడి. మల్లెపువ్వుల పరిమళం అనిర్వాచ్యమైన ఏదో ఆకర్షణకు లోబడి వెనుకకు తిరిగి చూడకుండా వుండలేక పోయాను.

తెల్లచీర ఆమె వొంటికి మరింత సోయగాన్ని సమకూరుస్తోంది. చక్కని ఆ వదనం మను సిగ్గుతెరలు చిందిస్తోంది ఆమె ఆ వెన్నెట్లో, ఒంటరిగా క్రీగంట దిక్కులు చూస్తూ — చూచి నవ్వులేసింది. దరిచేరకుండా వుండలేకపోయాను

శీతహారిణి ఒక్కసారి నా వైపుచూచి, తల వంచుకు నడవడం ప్రారంభించిందామె. మంత్రముగ్ధునిలా ఆమె ననుసరించాను.

ఆ అర్ధరాత్రి ఆ అందాలరాశితో ఎన్నో సందులూ, గొందులూ గడిచి చివరకు నేను చేరుకున్నది ఓ పూరిగుడిసె

బయట వెన్నెల వెలుగులు విహరిస్తుంటే ఆ పూరి గుడిసెలో గుడ్డిలాంతరు చివరిశ్వాస పీల్చుకుంటోంది. ఓ నులకమంచం వాల్చి, దానిమీద కూర్చోమన్నట్టిగా మౌనంగా సంజ్ఞచేసిందా యువతి.

పరులెవ్వరూ లేకపోయినా ఈ మూగ ప్రణయమెందుకో! నా నరనరాల్లో నాకే తెలియని స్తైర్యమేదో ప్రవహిస్తోంది. నా మనస్సు అంతు తెలియని ఆనందప్రపంచంలో విహరించాలని ఉరకలు వేస్తోంది. ఆ మంచంపై కూర్చోకుండా ఆ యువతి వెనుకకుజేరి ఆమె వదనాన్ని నా వైపుకు త్రిప్పుకున్నాను. ఆమె సిగలోని ఒక మల్లెపువ్వు నా పాదాలక్రిందబడి, నలిగిపోయింది. బలంగా ఆమెను నా వైపుకు త్రిప్పుకోవడంలో ఆమె చేతి గాజు ఒకటి విరిగిపోయింది.

అప్పటికీ ఆమె నాతో మాట్లాడనే లేదు. దీనంగా నాకండ్లలోకి చూస్తూ చేయి జాపింది డబ్బుకోసమన్నట్లుగా.

ఒక అబల—అదీ అర్ధరాత్రి—నా అనుగ్రహాన్నాశించడం, నిజంగానాలోని పురుషత్వం కోటుకాలరు సవరించుకొంది. గర్వంగా ఆమెవైపు ఒక్కసారి చూచి జేబులోని పర్సుతీసి ఆమె వైపు విసిరివేశాను.

నాయీ చర్యచూచి మెరిసిన ఆమె కండ్లలో సౌందర్యదేవత తాండవించి నట్లనిపించింది నాకు.

ఆమెనుండి ప్రసరించిన చంద్రికలు అణువణువునా నాకు శైత్యోపచారాలు చేశాయి.

ఆమె వేపు చూస్తూ అలాగే నిలబడిపోయాను చిత్రప్రతిమలా.

ఆమె పర్సు తెరిచింది. నాలో అభిజాత్యం వెలిగింది.

పర్సులో డబ్బుకోసం చూస్తోందామె. ఆమెలో విరిసిన అందాన్ని కళ్లలో కిస్తున్నాన్నేను. చూస్తుండగానే —ఆమె యెందుకో కళవళపడింది. ముఖం చిట్లించింది.

ఎఱ్ఱబడిన ఆమె వదనం ఎంత అందంగా వుంది!

మెల్లిగా ఆమెను సమీపించి కౌగలించుకోవాలనుకున్నాను అందుకు ముందు రెండడుగులు వేశాను.

ఇంతలో సుతిమెత్తని పదార్థమేదో బలంగా నా చెంపను—అబ్బా! కళ్ళు బైర్లు క్రమ్మాయి. అసరాకు పక్కనున్న గోడను—ఆనుకోవలసి వచ్చింది.

ఆమె బుసలు కొడ్తోంది!

కోపంతో ఆమె నిలువునా కంపిస్తోంది!

ఆమె అంటున్న మాటలేవీ నాకు సరిగా వినిపించలేదు. కానీ 'దరిద్రుడా!' అన్న శబ్దం మాత్రం నన్ను సమీపించి నా హృదయంలోకి చొచ్చుకుపోయింది. నా కాశ్చర్యం వేసింది. పిచ్చి పిల! నెలతిరిగే సరికి రెండువందల వెండిరూపాయలు సంపాయించే నన్ను దరిద్రుడంటోంది. నేనే దరిద్రుడనైతే ఈ హిందూదేశంలో ఇక నూటికి ఒకడుకూడా భాగ్యవంతుడుండడం—అసంభవం!

కూర్చున్న స్థలంనుండి లేచి ఆమెను సముదాయించబోయాను. నన్ను దగ్గరకు చేరనివ్వకుండా ఆమె కళ్లనుండి నిప్పులు కురిపిస్తూ ఉత్తి పర్సు నా ముందు పడేసి "ఏదీ డబ్బు?" అని అరిచింది.

పర్సులో చిల్లరడబ్బులు మాత్రం వున్న సంగతి, అప్పుడు జ్ఞాపకం వచ్చింది. నాకు ఈ అర్ధరాత్రి ఇంత పరాభవం సహించడం తలకొట్టేసినట్లనిపించింది. ఆమె వేపు సూటిగా చూడలేకపోయాను. మౌనంగా అలాగే కూర్చుండిపోయాను.

కొద్దిసేపు నిశ్శబ్దం. తలవంచుకు కూర్చున్న నాకు ఎవరో ఏడుస్తున్నట్లనిపించింది. ఆ ఏడుపులోనుండి ఆవిర్భవించి వస్తున్నాయి ఆ మాటలు. "ఈ వాడు కూడా గంజికి నేను నోచుకోలేదు. అరువు తెచ్చిన పూలకు డబ్బుకోసం వస్తాడు వాడు. ఇంటికెళ్తే అత్త—"

వినలేకపోయాను నేనా మాటలు. ఆమె హృదయంలోని బాధ ప్రతి మానవుడికీ అర్థమౌతుంది. కానీ మానవుడుగా చలామణీ అవుతున్నా ఆమెకు సహాయం చేసే స్థితిలో మాత్రం లేను.

ఆమె వేపు తిరిగి చూడకుండా ఆ గుమ్మందాటి బయటకు వచ్చేశాను. వెనకనుండి ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు కొద్దిదూరంవరకూ వినిపిస్తూనే వుంది.

నేను రోడ్డుమీద నడుస్తున్నాన్న మాటే కాని ఆమె రూపం నానుంచి చెరుపుకోలేకపోయాను. బెదురుతున్న ఆకళ్ళు, చూడగానే ఆకర్షించే ఆ మొహం యింటికి చేరేంతవరకూ నన్ను వెంటాడుతూనే వున్నాయ్.

అదీగాక పరాభవం నాలో జ్వలిస్తున్నా, స్త్రీ కాంక్ష కూడా నాలో జాజ్వల్యమానమౌతూనే వుంది. ఆమె కోపమూర్తిగా వున్న సమయంలో నాకు కనిపించినా, తెల్లచీరలో దాక్కున్న ఆమె దేహం నాకు చక్కిలిగింతలు పెడుతూనే వుంది.

ఇంటికి చేరి తలుపుతట్టగానే, గడియ వేసిలేదు గామోసు, వూరికనే వచ్చేశాయి తలుపులు. లోపలి కనుగెట్టి, గడియవేసి, పైనున్న చంద్రుడింకా వెలుగుతుండడం చూచి నాలో నేనే తిట్టుకుంటూ నా మంచం చేరబోయాను.

అసలే వేసవికాలం—అందులోనూ వెన్నెల రాత్రి. ఇటువంటి సమయంలో సామాన్యంగా మా అమ్మ నా మంచాన్ని దొడ్లో వున్న పున్నాగ చెట్టు క్రింద వేస్తుంటుంది. సీత రాకముందు మా అమ్మకూడా తన పక్కను దొడ్లోనే వేసుకునేది. కాని సీత మా జీవితంలో ప్రవేశించినప్పటినుంచీ వారిద్దరు కలిసి ఇంట్లో పడుకోవడం అలవాటు చేసుకున్నారు. పిల్లలుమాత్రం నామాలిమి మానలేక, నా ప్రక్కనే తమ మంచాలు కూడా వేయించుకుని, కథ చెప్పించుకుని మరీ నిద్రపోయేవారు ప్రతి రాత్రీ.

అలవాటు ప్రకారం పున్నాగ చెట్టు క్రిందున్న పక్కమంచం వద్దకు వెళ్ళాను. పున్నమి చంద్రుడు తన అకతాయితనం మానకుండా పడుకున్న వాళ్ళ మొగాలమీదకు వెన్నెల బాణాలు పంపుతూ చిలిపిగా నవ్వుతున్నాడు. ఆ పాలకాంతుల్లో నా మంచంమీద అమాయకంగా నిద్రపోతున్న సీత మొగం కొట్టవచ్చినట్లు కనిపించింది నాకు.

గాలికి గామోసు ఆమె జడ ముడివీడి ఆ నల్లని శిరోజాలు పట్టు దిండుమీద నాట్యం చేస్తున్నాయి! నల్లని శిరోజాల మధ్యగా ఎఱ్ఱని ఆమె పెదవులు నవ్వుకుంటున్నాయి తమలో తాము!

ఆ సౌందర్య మూర్తిని ఒక్క క్షణం అలా చూస్తూ నిలబడ్డాను. ఇంతలో ఆ ప్రశాంతమూర్తి ఆ స్థలంలో అదృశ్యమై, ఇందాక నేచూచిన ఆ అందాల బరిణ నవ్వుతూ ప్రత్యక్షమైంది.

నాకేమీ తోచకుండా వుంది. ఇది కలా? యథార్థమా? మళ్ళీ ఒక్కసారి కళ్లు నులుముకుని ఆ మంచంవేపు చూచాను. సీత చిరునవ్వులతో నిద్రిస్తోంది.

సీతను చూస్తూ, ధనంకోసం, మా నాన్న మ్ముకుపు నే ఆ వేశ్యను జ్ఞాపకం తెచ్చుకున్నందుకు నన్ను నేనే నిందించుకున్నాను కాని—నన్ను నేనెంత నిందించుకొన్నా ఆ భావం మాత్రం నాలోంచి పోవటంలేదు.

డబ్బు పారేసి ఆ యువతిని కొనుక్కోగలను నేను. సీతకు డబ్బే కాక సర్వం సమర్పిస్తున్నాను. అయినప్పుడు నాకు, ఆ యువతిపైవున్న అధికారం సీతపై మాత్రం ఎందుకుండ కూడదూ?

ఈ పాపపు వ్యూహంలో కీటకాన్నయ్యాను. తప్పించుకుందామన్నా తప్పించుకోలేకుండా వున్నాను. అక్కడికీ వెనుకకు తిరగాలని రెండడుగులు వేశాను. కానీ మనసులోని కొంటె పైశాచిక వికటాట్టహాసంతో ఉటంకిస్తోంది. నాలో చెప్పలేని దౌర్బల్యం ఏదో ప్రవేశించింది. లోని భావావేశంతో పాటు ప్రతి అవయవమూ ఎంతో ఆరాటపడిపోతోంది. మనసూ, మెదడూ, దేహం, ఒకటేమిటి చైతన్యమున్న ప్రతి అణువూ సీతపైనే కేంద్రీకృతమై నన్ను ఆమె వేపుకు నడిపించినై.

నిద్రిస్తోన్న ఆమె ఒంపుల సోయగంమీద పైనున్న పున్నాగపుష్పాలపడి తీయని పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు చలిస్తున్న ఆమె సౌందర్యం విభ్రాంతి కల్గిస్తోంది.

ప్రతీ మానవుడిలో విరుద్ధశక్తులు పనిచేస్తుంటాయట! కానీ నన్ను అప్పుడు మాత్రం రాక్షసత్వం నిలువునా ఆక్రమించుకొంది. ఏంచేస్తున్నానో నాకే తెలీదు. నాలో మంచీ-చెడూ-విచక్షణ పూర్తిగా నశించింది.

నిద్రిస్తున్న సీతపై ఏమి అత్యాచారం చేశానో!

ఆమె ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. ఉన్మాదస్థితిలోవున్న నన్ను జూచి కెవ్వుమని కేక వేసి 'అన్నయ్యా!' అంటూ నా పాదాలవద్ద పడిపోయింది.

ఆమె కేకలు విని అమాయకంగా నిద్రపోతున్న ఆ పసికందులు కంగారుగా లేచి, సీత నా అయోమయ స్థితిలో చూచి మరింత బెంబేలు పడిపోయారు.

పిల్లల భీతావహస్వరం విని ఇంట్లో పడుకున్న మా అమ్మ అదాటుగా ప్రవేశించింది ఏమిటేమిటంటూ.

నా తల తిరిగిపోతోంది. కాళ్ల క్రింది భూమి లోలోతునకు క్రుంగుతున్నట్లనిపిస్తోంది. నిలబడలేక తూలి క్రిందబడబోయాను.

మా అమ్మ నన్ను చూచి మరింత గాబరా పడిపోయింది. 'ఏమైంది రామూ!' అని అదుర్దాగా ప్రశ్నిస్తూ నాకు ఆసరాగా పట్టుకుంది.

సీత తనకుతానే తెప్పరిల్లుకున్నది. పరిస్థితి పరిలోకించి తన స్థానం తెలిసికున్నది గాబోలు మెల్లిగా మా అమ్మ ప్రక్కకు చేరి "ఏమీ లేదమ్మా నేనూ, నిద్రలో కొద్దిగా పెద్దగా కలవరించడం చూచి అనవసరంగా భయపడిపోయాడు!" అన్నది.

సీత మాటలు విన్న నేను ఆమె వేపు చూడలేకపోయాను. ఎవరికైతే ద్రోహం తలపెట్టానో వారే నన్ను రక్షింపవలసి రావటం—నా గదిలోకి పరుగెత్తుకు వెళ్ళి మంచంమీద కుమిలిపోతూ పడుకున్నాను. అవ్యక్తంగా ఎప్పుడు కన్నుమూశానో!

మళ్ళీ కళ్లు తెరిచేసరికి ప్రపంచంలోని రణగొణ ధ్వనులు నా చెవికి వినబడుతున్నాయి. కానీ మా యిల్లే నిశ్శబ్దంగా వుంది. పిల్లల చిరునవ్వులు వినిపించడంలేదు. సీత అందెల రవళి మోగడంలేదు. మా అమ్మ మౌనంగా గృహంలోని పని గబగబా చేసుకుంటోంది.

గబగబా ఆమెదగ్గరకు పరుగెత్తుకు వెళ్ళాను. ఇల్లంతా అలా నిద్రపోవటానికి కారణ మేమిటని అడిగాను.

మా అమ్మ కొద్దిసేపు జవాబీయకుండా వూరుకొని తరువాత నెమ్మదిగా అన్నది. "ఎవరో దూరపు చుట్టాలు, ఎక్కడో వున్నారట! చూసివస్తానని వెళ్ళింది పిల్లను తీసుకుని. నిన్ను మాత్రం రఘును జాగ్రత్తగా చూస్తుండమంది!"

వర్షంలేని పిడుగు మీదపడింది. మరుమాటాడకుండా వెళ్ళిపోయాను. మా అమ్మ వేపు చూడలేక.

ఎలా అకస్మాత్తుగా నా జీవితంలోకి ప్రవేశించిందో అలా అకస్మాత్తుగానే వెళ్ళిపోయింది సీత, నన్ను మళ్లీ ఒంటరివాణ్ణి చేసి. కాని వెళ్లిపోయేటప్పుడు మాత్రం నా మెడలో గుదిబండను తగిల్చి మరీ వెళ్లింది!

విదియ చంద్రుడు. దూరాన అరుంధతి చక్కని చుక్క లాగ మెరిసింది.

వెన్నెలని పతికిన చకోరాక్షికి రాజేమో అనిపించిన అనుమానపు నీడలాగ దూరాయగా గోచరించాడు వచ్చినాయన. తేరిపారజూసేటప్పటికి ధృవుడై ముంగల నిలబడ్డాడు.

"వచ్చేవా విప్రవరా"-ప్రశ్నార్థకం తోపించని గొంతుతో నిస్సంకోచంగా అడిగిందామె.

అప్పుడతను నిరుత్తరంగా నవ్వేడు.

"ధూర్జటిలాగ తియ్యగా మాట్లాడడం నేర్చుకుందామని..." సహేతుకంగా మాటలు మిగిలేడు.

"హా! తెలిసెన్!" అంది—"పెద్దన పోకడలతో పేచీపడ్డావా?"

"అల పానిదాని అలక గజిబిజిచేస్తే, అల్లసాని వాని అల్లిక జిగిబిగిలో ఎన్ని వసంతాలని గడుస్తాయి?"

ఎన్నా?-మన్నా అన్న విన్యాసంలో అతని చుట్టూ కైవారం చేసేయి తామరి చేతులు. కాని ఆ శ్లేషంలో అర్ధరాత్రి చిత్తమైన అతనికి పిల్లబికిన జాలి ముంచెత్తుకువచ్చింది.

పెద్దనతో పేచీపడడానికంటే పెద్దలేగదా! అని విస్మయపడింది. ప్రథమ సమాగమంలో నే ప్రణయాన్ని పరాకాష్ట నందించలేదనిగదా, ప్రబంధ పరమేష్ఠిపై తన ప్రియుడికి చిన్న మాపు! అని చింతించింది. మళ్లీ పొద్దుపొడిచేటప్పటికి ప్రత్యామ్నాయ వాయువుల్ని ప్రవేశపెట్టిన వైనం జ్ఞాపకంచేసి పెద్దనయందలి తన పక్షపాతాన్ని ప్రదర్శిస్తూ వుంది.

"వసంతాలని వ్యర్థం చేసేటంత వెర్రివాడు కాడయ్యో!" అంది. "ఒకరోజు విలంబన చేసినా, అలంబనానికి హాని రానీయలేదుగదా! కొంచెం జాప్యం చేసేనంటే, మరి బుద్ధిజాడ్యం!"

"ఏ వేదంబు పఠించె లూత?"—నందవరీకుడి శ్రోత్రియం మీద నమ్మకంలేని ప్రశ్నని దూసి అడిగేడతడు. అల్లిక కైతలఖర్మమా అని, ధూర్జటి అనువాదం అతికిందని సంతోషించేడు.

"అయినా, కడకి కల్పించినవి కళ్లుమూసుకుపోయే క్రీడలేగదా!"

"ప్రేమ గుడ్డిదన్నమాట పాతకాలంనాటిదే!" అందామె, వాదానికి తలపడి. "కళ్లు తెరిచిచూస్తే చెదిరిన కలలు కోట్లు. కథలవిషయం కావాలంటే, కౌముదమానాన్ని స్మరించు!"

అంత అని ఇంకొంచెం కొనసిరింది: "పైగా వట్టి తెలియని సరసాలకంటె కళ్లు మూసుకున్న సరసాలే నయం. నఖానఖాగ్రములచే కౌగల్గించిన ధూర్జటి కాయానికేం తెలుస్తుంది సహపానఖ...సీసంలోని సౌఖ్యం?"

పేచీ మాని ప్రస్తుతమయిన పరిరంభంవైపు మరిల్చి డతడు తన దృష్టిని. స్ఫురితచుంబనంలో సంధి చేసుకుని నిరోష్ఠ్యంగా సరసోక్తులు గుసగుసలాడుకున్నారు ప్రియులు. కడకి కళాద్వయం తిప్పిన

ఔను - కాదన్న వాదానికి దిగదలుచుకోని శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తిగారు కొత్త "ముందు వెనకలు" మాత్రం చూసుకోండని, పెద్దనకి మూడు శతాబ్దాలకి ముందు మల్లికార్జునుడూ, అయిదుశతాబ్దాల అనంతరం ఆయన రాసిన పద్యాన్ని ఉటంకించి ఊరుకున్నారు. (మా. భారతి, మార్చి, పుట-60)

"ఔ"నన్నారు శ్రీశ్రీ, చమత్కారానికో, Proletarian Prejudices తోటో. విడెం, భోజనాల వరస అల్లా ఉంచి, అసలు కవితాపితామహుడు కోరిన వేవీ అక్కర్లేదన్నారు.

"అల్లసాని పెదనార్య
డడిగిన నిరుపహతి
స్థలేత్యాదు లనవసరం
సదా కృతిః ప్రభవతి."

సాంకేతికంగా పద్యాన్ని చదువుకున్నాక అంత సాహసంలేని నా స్వగతం గొణిగింది, పెద్దన అడిగినవన్నీ Bourgeois amenities మాత్రమే కాదని.

"స్థలం, విడెం సరే కాని
పదసజ్జులచే నధి
గతం కాని కృతికి శరణు
కాలోయం నిరవధిః!"

ఈ గందరగోళంలో ప్రబంధం నిబంధనలు చెప్పించుకోవడమే కుదరలేదింతకీ నాకు. కృతి చెయ్యబోతే, కోతి చేష్టయిందన్నట్లు పరిణమించిందీ రచన చివరికి. దీనికి శరణేమిటో? ఒప్పితప్పరయు రసజ్ఞులు, ఊహ తెలియుంగల పాఠకోత్తములూ మాత్రమే నిర్ణయించగలరు.

చంద్రుడు కన్నుగీటినట్లు తొంద్రి మొంద్రిగా చూస్తూంటే, సిగ్గుపడి ఎడబాటయ్యారు.

"వాతెర దొండపండయిందా?" చాటువిగా పరామర్శించిందామె.

ప్రమదితుడు పెదవి చప్పరించేడు. "కదళీ పే మించిం దీమాధురీమహిమ!"

"అయితే,

పంచద్రాక్ష పదాలు పాకాన వేసి,

వెండి వెండియు దెచ్చి విందు చేస్తావా?"

ఉవ్విళ్లూరుతూ అడిగింది.

"కవయామి!" అన్నాడు కాబోయే ధూర్జటి, ధీమాగా.

"మరి పెద్దన పోకడలకి వస్తేనా?" పక్షపాతం వదలలేక ప్రశ్నించింది.

"వయామి!" అన్నాడతడు చాటువు చెప్పినట్లు.

చివరకు మాట తనమీదుండుకోవడ మెందుకని, ముగించేడు:

"యామి!"

"...విధావనుకూలే?" మళ్ళీ రావడాన్ని గురించిన మాటందుకుందామె, అనగనగా ఓ అమ్మాయి సంగతి తెలుచుకుని.

షష్ఠీ-సప్తమి సంధినుంచి చాయంకల విన్నపాలై బయటబడ్డ వి (బు) ధుడి "ఉదంతం" అతనికీ జ్ఞాపకం వచ్చింది. విధిగా ఆమెకు ధైర్యం చెప్పవలసివచ్చింది, పునరేష్యామీతి...

"బ్రహ్మతెర మాటుందిలే!" అన్నాడాశాపూరితంగా. "కాగా, చంద్రుడు మనవాడే!"

ఆ మాటల అర్థం చిత్తగించమని, సెలవు తీసుకొని వెళ్ళిపోయాడతడు, చంద్రుడు తోడుగా. తనకు తోడుగా నిలబడ్డ జాబిల్లి తనకీ సుముఖుడే అని సంతోషించింది చంద్రవదన.

ఉపోఘాతం

కథను శేషరాత్రి నిద్రబుచ్చి కలం నింపుతున్నాడు కథకుడు. చంద్రుడు చెలియదగ్గరే ఉన్నాడా, వచ్చినాయనతో వెళ్లిపోయాడా? (రాముడంతటివాడు పిలిస్తే రాలేదు కాని కాముడి సహవర్తత ఇతిసేః! కళాకళల బుద్ధి!) అన్న జిజ్ఞాసలో ఉండగా ఖరీలుమనే విషయమొకటి ఛురికపోటు లాగ జ్ఞాపకంవచ్చింది.

"వెండి వెండియు లెచ్చి..."

ఆ మాటలలో అక్రమేడితాన్ని మించిన దోషం తోచింది. వాయికది లోహవ్యామోహమున్న అపోహలో ఆగ్రహంవచ్చింది.

లంచమడగని మంచితనంతో శ్రేష్ఠమైకతీనిగా ప్రకరణాలు గడుపుతానని తనకిచ్చిన మాటను లెక్క చెయ్యలేదు గనక! అని కించపడ్డాడు. అటువంటి మాట నిలదూస్తే, తన కథ కీ వాయిక ఉచితమైనది కాదని తోచింది. కథ కింతటితో స్వస్తి చెప్పేద్దామనుకున్నాడు.

"కథా, లే..."

కథ లేచి కళ్లు నలుముకుంది. సూర్యుడు చీకట్లని తూర్పారబట్టడం, నీలోత్పలం వర్ణాభిమానంతో ముఖం చిన్నబుచ్చుపోవడం వగైరా నిత్యకృత్యాలని పరిశీలనగా చూడడ మయ్యాక, పంకజంతో బాటు పకాలున ఆవులించింది.

"ఇతి..." ఖచ్చితంగా కథాంతగద్య మొదలు పెట్టేడు కథకుడు.

"ఆహా!" అని ఆవులింత ముగించింది కథ. "ఏం కథ?" అని ఎదురు తిరిగింది.

తన ఫిర్యాదు చెప్పతున్నాడు కథకుడు. "వెండి వెండియు దెచ్చి..." అనువదించేడు.

"నీది ఆకూక్తి రజతభ్రాంతి, అమాయకుడా!" అని మందలించింది కథ, "ఆమె ప్రయోగం అసమర్థనీయమయినా, దానిని మళ్లీ మళ్లీ అర్థం చూసుకో... మళ్లీ" అని హెచ్చరించింది.

"అర్థకుసి"గా సమాధానపడి ఊరుకున్నాడు కథకుడు.

ఉపాలంభం

గత రాత్రి విషయం గాలికబురులాగా ఎలా పాకిపోయిందో కాని, పేటపేటంతా ఇలా పాక్కుపోయిందంటే నమ్మండి. ఊరూ వాడా ఏకమై వారిద్దరి విషయమూ పెద్ద ఇదిగా గుసగుసలాడిపోసుకున్నారు.

లోకంనోరు మయ్యలేమని తెలిసిన నాయకుడు తన సంగతి నలుగురి నోళ్ళలోనూ ఓ నువ్వుగింజ నానినంతసేపు పడినా ఫరవాలేదనుకున్నాడు. కాని ప్రేయసి వాడమీద ఊరంత కోపంతో పెదవులకు

నేటు తెచ్చుకుంటుందేమోనని మాత్రం భయపడ్డాను. కాని వేళ బయలుదేరి నిత్యముత్తయిదువ గాజుల గలగలలోకి జేరాడు.

సాష్టాంగంగా నాయికను కౌగలించుకుని, వైశంపాయనుడిలాగ విషయాన్ని సవిస్తరంగా చెప్పేడు. పూసగ్రుచ్చినంత శ్రద్ధతో విని, ఆమె కోక పొడుగునా రెపరెప లాడిపోయింది.

"హుం! నాకంతా నీలాటిదేనయిపోయిం దన్న మాట!" అక్కసుగా మెటిక విరిచింది.

"కన్నెలంతా మనసంగతే కడవలతో తోడుకు పోతున్నారు," అని ముగించేశాడు.

"అనాఘ్రాతపుష్పాలు!" అని ముగ్ధలని చీదరించుకుంది. శ్యామ.

మాటమట్టుకు గంభీరంగా అనేసింది కాని అబల గుండె నిబ్బరం కుప్పగా కూలిపోయింది. కలకంఠి కళ్లు చెమ్మగిల్లేయి.

"లోకులు కాకులని తెలిసిన నెఱజాణవు..." స్తుతిలో సాంత్వనానికి పూనుకున్నాడలంకారికుడు.

కాకాసురుడూ, లోకులూ తెచ్చిన సీతాశోకాలని ఇక్ష్వాకుల నాటి ఇతిహాసంనుంచి ఎత్తిచూపిందామె.

"అవింకా కట్టికుడుపుతూనే ఉంటాయా మా స్త్రీజాతిని?" ధనుష్టంకారంలాగ ఎక్కి వెక్కి అడిగింది నారి.

"మనకి రామరాజ్యాల ప్రారబ్ధం తప్పింది," అని హామీ ఇచ్చేశాడు. "లోకాభిరామాయణంగా జనం చెప్పుకునే పుక్కిటిపురాణాలకి జడిసి అడవి గాచిన వెన్నెలలో విరహానికి గురికానక్కరలేదు!"

ఆమె హృదయాన్ని దిగులుకు తావులేనంత దగ్గరగా తనకు హత్తుకుని, అన్నాడు:

"పైగా, కాగల కార్యం గాంధర్వంగా నే తీర్చుకున్నాము కదూ!"

"ఓ!" అని ఒప్పుకుందామె. "సఖ ముఖాలా!"

మరోక బారెడు-ప్రొద్దెకు పేపు ఊనూ, పలుకూ ఆడి, ఆమెకోమాత్రపు గుండెదిటవు చేకూరేలాగానే సెలవు తీసుకుని వెళ్లి పోయా డతడు.

ఉపద్రష్ట

ఈకథకి కృతిపతిగా ఉండడాని కెవరు సమ్మతిస్తారో తెలియని కథకుడు నలుగురైదుగురు సంపాదకులకి సమానంగా సమన్వయించేటట్లు వస్త్వంతాలు రాసి కికురింపులో నిమగ్నుడయ్యాడు. అనాయత్త చిత్తతలో గత్ప్రకరణం గతి ననుసరించక, కథ ఏ కాడికొచ్చిందో తెలియని తికమకలలో పడ్డాడు.

కథని కంచువా కొంగున తనతప్పిదం తెలియనంత, గోప్యంగా ముడివేసి, అపరాహ్ణానికి నాయిక యింటికి జేరుకున్నాడు.

ఉ. కు. రి.

"కథే కిం తవ?" కుతూహలాన్నాండబట్టలేని నాయిక నోరు విప్పి అడిగింది.

"తల్లీ నిన్నుగురించి పుస్తకము చేయంబూనితిన్" అని యతి తప్పిన సరాగాలాపనలో కథకుని జవాబు.

"ఇంతవరకూ జరిగిన కథని అనహా - తనహా గ్రథితంచేస్తూనే వచ్చేను. కాని, ఓ చిన్న విషయం తేలకుండా ఉంది. అంతటి రసికుడు లోకానికి వెరచి..." పెద్దమనిషితనంగా, కీడెంచడానికి నోరురాక, అర్థోక్తిలో ఊరుకున్నాడు.

నిలువెత్తు తీవితో చిరునవ్వు వద్దంగా ఊపిందామె. నివృత్తంలో సందేహనివృత్తి చేసింది: "...రామరాజ్యాల ప్రారబ్ధం ... లోకాభిరామాయణం...అడవిగాచిన...గురికానక్కర లేదు."

"ఏమో అని భయపడ్డాను," అన్నాడు కథకుడు. "చివరికి విప్రలబ్ధ నాతవేమోనని భయపడ్డాను."

అతని భయాలకి పతాకహస్తాన్నడ్డేసిం దామె. ఒక భలాన్నీను: "విప్ర—లబ్ధ నేనండీ!" అని.

కళావతి మాటవిరుపు సొగసుకి గుండె నిండింది కథకుడి సహృదయత.

ఆమె అలవోకగా తలపంకించి అనుమంద్రంలో అంది: "మా స్థాయి అనురాగం మహాశయా!"

హామ్మయ్య-గా తల తడుముకున్నాడు మహాశయుడు.

ఉపాఖ్యానం

అతనిది ఆభాసలోని ఆశ. (పక్కఊరి పనుచు కుర్రాడి మాటలెండి-) ఈ కథసంగతి నామమాత్రంగా తెలుసుకుని ఇది ఇనుమారుమనువు చరిత్ర అనుకున్నాడు. ప్రత్యామ్నాయనాయకభూమికను తాను వహిద్దామనుకున్నాడు.

పొందివుందామని పొలిమేర దాటగానే కథకుని శకునం. పడుచుకుర్రాడు పరామర్శగా మాట జారేడు:

"మన కాలంలో మందుకైనా రసరాట్టు లేరండీ!"

"ఏం బాబూ?" చివుక్కుమన్న చిత్తాన్ని చిరునవ్వు వెనుకదాచి ప్రశ్నించేడు కథకుడు.

దండించి దరఖాస్తు పెట్టుకుందా మనుకున్నాడు కుర్రాడు.

"లేకపోతే అనుకరణకి అర్థం ఉండొద్దూ? అసలువా డోరమోమిడికే, నీపలువాణ్ణి నాచేతి చుబుకం పుణికించరాదూ? ఇంతటి ప్రఖ్యాతి కథకులు మీరే ఇలాగ..."

"ఉత్పాద్యం, నాయనా, నా కథ!"— మాటకు మాట తెగులుగా అడ్డువచ్చేడు కథకుడు. "ప్రబంధ వ్యామోహంతో పెట్టిన పేరు జూసి పొరబడకు."

* * *

తెల్లబోయి దిక్కులు మాశేడు దక్షిణుడు. పరకాయింపుల పరిమితిలో పైట చెంగేదో పిలిచిన వైనం కనబడగా, అందని అందాలకై జాచిన అర్రుల నుపసంహరించుకుని అటు దారితీసేడు.

వెనుకనుంచి వెన్ను పొడుగునా హెచ్చరించేడు. కథకుడు: "చోరవజేసి చెంత జేరుదా మనుకుంటున్నావేమో, భేకానుప్రాసంగా బొమ్మంటుంది సుమా!"

కొత్తలతుల్యం కవిత్వంపులో పెద్దవాని మాటలు పెడచెవిని వేసుకుపోయాడు పడుచుకుర్రాడు.

ఉ ప జీ వి

యథేచ్ఛగా అసలు ప్రియులు కలుసుకుంటున్నారు. గడిచేనెలలు చెలికి నిండుతూ వచ్చేయి.

"మోహానికి మొహంవాచిపోయేను," అన్నాడు మగరాయడు, మురిపెంగా.

"మా న్నాళ్లి ముచ్చటలు మినహాయింపులు కూడా లేనికాలం, మొహం మొత్తిం దంటావేమో అని భయపడ్డాను."

అంతర్వత్ని మృదుస్మరభిముఖాన్ని మరోసారి ముద్దుపెట్టుకుని అన్నాడతను, కాళిదాసు ప్రమాణంగా: "అధికమాసాలలో కలవొచ్చింది తృప్తికి."

మనసు కక్కరితి మెల్లనలేచి చేతుల గాంతుని జబ్బగా కౌగలించింది పాలికళ్ళ (ఎనిమిది నెలల) పడతి.

ఉ పాం త్యం

నాయికతోబాటు కథకి కూడా ఓపిక సన్నగిలుతోంది. ఒకనాటి ఉదయం ఎంతకీ లేవక, కనుపులో కాళ్లు పెట్టుకుని పడుక్కుంది. పైకనలేదు గాని ఆ కనుపులోనే మరో రెండుపాదాలు మెదిలేయి:

"ఈ నీళ్లు ఎంతదూరం వెళ్ళినా ఇంతే,
వ్యర్థం ఈ ప్రయాణం వెళ్లిపోదాం వెనక్కి."

ఆ మాటల అర్థంమీదే అలిగి, కథకుడు రాగానే ఖచ్చితంగా చెప్పేసింది. ఇంకొక్క ప్రకరణంకంటె ఎక్కువసాగ లేనని.

"ఇంకెంతో దూరం లేదులే," అని ఆయన కథని ఒళ్లు నిమిరి, వెంటబెట్టుకుని...

ఉ ప సం హా రం

...యకాయకి నిండుచూలాలి ఇంటికి జేరుకున్నాడు.

"నీకేమైనా కోరికలుంటే చెప్పు, తల్లీ, అవి తీర్చి మరీ గ్రంథం ముగిస్తాను," అని అడిగేడు, సాంప్రదాయికంగా.

మొహమాటపడుతూ ఇసిగిందామె: "నాకు మంచి పేరు సంపాదించాలని ఉందండీ!"

"అః! అన్నట్టు అడగ మరిచేను. నీ నిజనామం?"

చెమ్మగిలిన కళ్లు దించేసుకుని వైవర్ణ్యంతో అంది: "పసుపు వృత్తిలో పేరు మాసిపోయిందండీ. నేటికాలానికి మీరు సంస్కరించి ఓఇంటిదానిని చేసేరు. అందుకే ఈ ఈప్సితం...ఈడేర్చరూ?" ప్రాధేయపడింది.

"దానికేం తల్లీ!" అన్నాడాయన తండ్రిలాగ. ఓ క్షణం నిదానించి "నీ నిత్యయౌవనానికి తగినట్లు నిన్ను 'అమ్లాని' అంటాను," అన్నాడు.

కాలం మించిపోయిందమాయకుడా అన్నట్టు మందహసించేయి ఆమె చిలిపిచూపులు. మాసాంతకపుటం తిర్వత్ని ఇలా-తెలా వాడిపోయిన వర్ణంతినీ పరకాయించుకుంది.

పుత్రోదయం తర్వాతి పూబోడిని మనోజ్ఞంగా ఊహించుకుంది కథ. ప్రస్తుతపు వైవర్ణ్యంలో కూడా ఆమె చెక్కిళ్లెంత అందంగా ఉన్నాయి! అని విస్తుపోయింది.

కనుక, "నే నామె కపోలకల్పితాన్నయితే ఎంతసుందరంగా ఉండునో!" అని కథ కలలు కన్నదంటే, లోకం బుగ్గమీద వేలేసుకోనక్కరలేదు!

బద్దెన నీతులు

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

ఆంధ్రభాషాయోషకమూల్యాలంకార మొసఁగిన ఆంధ్ర నృపాలురయందుఁ జేరఁదగిన వారలలో బద్దెనృపాలుఁ డొకఁడు. ఈతఁ డాంధ్ర చోళుల సంతతికిఁ జెందిన యొక సామంతరాజై యును, తన పరిపాలనానుభవమును బురస్కరించుకొని, తన సాంకేతికగరిమఁ దోడుచేసికొని తోడిరాజులకే కాక భావినృపాల సంతతికిని అనువర్తనపాలనముల కాదర్శ ప్రాయమైన రాజనీతిని 'నీతిశాస్త్రముక్తావళి' యను నామమున విరచించియున్నాఁడు. ఈ గ్రంథమే 'బద్దెననీతులు' అను నామాంతరమునసైతము వ్యవహరింపఁబడుచున్నది. ఇందాదర్శప్రాయములగు రాజనీతులేకాక త్రికాలాబాధ్యములైన పరమసత్యములు సైతము విరాజిల్లుచున్నవి. ఈ గ్రంథ విమర్శనమునకు ముందు బద్దెనృపాలుని కాలమునుగూర్చి కొంత విచారింపవలసియున్నది.

బద్దెనకాలము - వివిధవాదములు

ఈ బద్దెనకాలమును గురించి రెండు మూఁడు వాదములు కలవు. అందు 'నీతిశాస్త్రముక్తావళి'ని పరిష్కరించి ప్రకటించిన శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు, ఆంధ్రకవుల చరిత్రమును విరచించిన కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగము పంతులుగారు, కళాప్రపూర్ణులు, సూర్యరాయాంధ్ర నిఘంటు సంపాదకులునై కీర్తిశేషులైన జయంతి రామయ్యపంతులుగారును దమతమ యభిప్రాయములను దెలిపియున్నారు. వీరి యాధారములను గ్రమముగాఁ బరిశీలించి యందలి యౌచిత్యమును పరిగణింతము.

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు పైగ్రంథమునకుఁ జేర్చిన తమ పీఠికలో ఈ క్రింది శాసనము నుదాహరించిరి.

"శాసనము—శ్రీ కృష్ణవేణీనదీతీర దక్షిణషట్సహస్రవిషయాధీశ్వర వీరమహేశ్వర కీర్తిసుధాకర గుణరత్నాకర వేంగిచాళుక్యమూలస్తంభ రిపుదళిత కుంభికుంభ బలయాంగనాగృహతోరణ సన్నసగంధవారణ నామాది ప్రశస్తిసహితం శ్రీ మహామండలేశ్వర బద్ద (ద్దె?) చోళవరేంద్రస్య..." (పాశ్చాత్య చాళుక్యుఁడగు భువనైకమల్లుని కాలమునాఁటి శాసనము)—

ఈ శాసనము ననుసరించి బద్దెన క్రీ. శ. 1070-వ సంవత్సరమున నుండెనవచ్చుననిరి. కాని, ఇది నమ్మఁదగినది కాదని శ్రీ కవిగారే రెండు ప్రమాణములఁ జూపిరి. అందు మొదటి దీశాసనము చెన్నపుర గ్రంథ భాండాగారమందలి చరిత్రములోనిది గాన విశ్వసింపఁ దగనిదియు, రెండవది పైశాసనమందలి బిరుదావళి గలవాఁడు సామంతరాజ మాత్రుఁడు కాఁజాలఁడనియును దీనిని త్రోసివేసిరి. ఈ ప్రకారము శ్రీ రామకృష్ణకవిగారు బద్దెన కాలము అనిశ్చయముగనే విడిచిరి.

పిమ్మట ఆంధ్రకవుల చరిత్రకారులగు వీరేశలింగముగారు అట్టి బిరుదులుగల సామంతరాజులుండు టాశ్చర్యము కాదనియు, పైకాలనిర్ణయమును గాదని బద్దెన 12-వ శతాబ్దమువాఁడని తెల్పిరి. ఇందులకు బద్దెనకృతమని రామకృష్ణకవిగారు 'నీతిశాస్త్రముక్తావళి' 30-వ పుటలో నుదాహరించిన ఈ క్రింది పద్యము నాధారముఁ జేసికొనిరి. ఆ పద్యమిది:

"పరువడి నాంధ్రభాషఁ గల
 బద్దెన నీతియు సంస్కృతంబులోఁ
బరఁగు ప్రతాపరుద్ర వర
 పాలునిచే రచియింపఁబడ్డ యా
నరవరు నీతిసారము వి
 నం జదువం గడు మంచి దందుఁ జె
ప్పరఁ గవి నీతిపద్ధతులు
 చేత వినోదము బాలబోధకున్."

పై పద్యమునఁ జెప్పఁబడిన (మొదటి) ప్రతాపరుద్రుఁడు 1140 మొదలుకొని 1186 వరకు రాజ్యపాలనము చేసినవాఁ డగుట చేత బద్దెన అతని

తరువాతివాఁడగుట పైపద్యమునుండి స్పష్టమగుట 1186-వ సంవత్సరమునకుఁ దరువాతివాఁడు కావలెను. కనుక 12-వ శతాబ్దివాఁడని వీరేశలింగము గారు తేల్చిరి.

వీరేశలింగముగారి వాదమసమంజసము, వక్రమును. ఈ పద్యమును జూచిన నిది బద్దెనకృతము గాదని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఏలన, పైపద్యము ఇది: "ఆంధ్రమునను బద్దెనీతియు, సంస్కృతమునఁగల ప్రతాపరుద్ర విరచిత నీతిసారమును వినఁ జనువ నుత్తమములైన వగుట బాలబోధకై వినోదముగాఁ గవి యందలి నీతుల ననుసరించి యీ నీతిపద్ధతులఁ జేసెను." ఇదివఱకే గ్రంథరూపముఁ దాల్చిన బద్దెన నీతి, నీతిసారముల ననుసరించి బాలబోధకై నీతిపద్ధతులఁ జేసెనని యీ పద్యము చెప్పుచుండఁగా, బద్దెన నీతిని జూచి మరల బద్దెన వ్రాయఁదలంచుట యసంబద్ధము కాదా? అందుచేనిది బద్దెనకృతము కానిదగుట శ్రీ రామకృష్ణ కవిగారీపద్యమును బద్దెనదని నీతిశాస్త్రముక్తావళిలోఁ జేర్చుట కాధారము మృగ్యము. దానిఁబాఱ మరయక దానిని తమ వాదమున కాధారముగా వీరేశలింగముగారు చేసికొనుటయుఁ జింత్యమే. ఇంతేకాక, పూర్వాపర సందర్భముల ననుసరించినను బద్దెన నీతిని మొదట పేర్కొనుటయు, నీతిసారమును పిమ్మటఁ బేర్కొనుటయు బద్దెన ప్రతాపరుద్రునికిఁ బూర్వుఁడనుటకే యీ పద్యము తోడ్పడును కాని తరువాతివాఁడయి యుండెననెడి యీ పద్యము వీరేశలింగముగారికెట్లు స్పష్టముగాఁ గానవచ్చెనో తెలియకున్నది. మఱియుఁ బై పద్యాంతమున 'బాలబోధకున్' అని యుండుటచే, 'రాజనీతి శాస్త్రము' బాలురకుఁ గాఁజాలదు కదా! అంతియ కాక "అందిలో నీతిసారమను గ్రంథమున బద్దెన పూర్వకవిగా స్తుతింపఁబడె"నని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు నీతిశాస్త్రముక్తావళీ పీఠికలో వ్రాసియున్నారు. అందుచే పై పద్యము నీతిశాస్త్రముక్తావళి, నీతిసారము రెండింటి భాగములు గల సంకలితగ్రంథమునకే యన్వయించుట కుపయోగించును గాక దీనిపైఁ గావించిన వీరేశలింగముగారి యూహలు నిరాధారములే యగును. అందుచే బద్దెన కాలనిర్ణయమునకు మఱియొక ప్రబలాధారము చూపవలసియున్నది.

ఇఁక మూఁడవవారగు శ్రీ జయంతి రామయ్య పంతులుగారు బద్దెన కాలనిర్ణయమును దెలుపు రెండు శాసనములను సంపాదించి ప్రకటించిరి. ఈ రెండును కృష్ణాజిల్లాలోని గన్నవరము తాలూకాయందలి కొం (డొ? నాయుని) వరగ్రామ బ్రహ్మేశ్వరస్వామ్యాలయమునందలివి. వీనిలోని మొదటి శాసనము పూర్ణముగా లభించినది. మిగిలినది శిథిలమైనది. ఇది "శాసనము-స్వస్తి సమస్తప్రశస్తి సహితం శ్రీ మన్మహామండలేశ్వర వీరనారాయణ చోడబద్దిగ దేవరాజులు శకవర్షంబులు ౧౧౮౩ గు నేఁటి కర్కాటక సంక్రాంతినాఁడు..."

ఈ శాసనమునఁ జెప్పిన శాలివాహనశకము 1183కు 78 కలుపఁగా 1261 క్రీ. శ. అగుచున్నది. మఱియు రెండవ శాసన మిట్లున్నది.

"శాసనము,—

శ్రీనాథనాభినీరేజ సంభూతః బ్రహ్మణః పురా,
జాతా విశ్వగుణాఢ్యేన లక్ష్మ్యా రాజపరంపరా,
తస్యాం బద్దిగభూపో౽భూ ద్వీరనారాయణాంకితం,
చోడకోరయ (భూపో) స్యపుత్రో భూదనన్యనందనః.
శ్రీ శాకాబ్దే పురాష్ట
దశ శశిగణితే కర్కసంక్రాంతి కాలే
స్వప్రాదా ద్దీప మిష్ట
ప్రద మనవరతం చోడబద్దిక్షితీశః,
శ్రీమద్బ్రహ్మేశ్వరాయా
శశి రవి విశదం గోంక వాంకస్య, (లే?) తే
షడ్డీహార్థం చ వేళేటి
జనపదమహీ వింశతిద్రోణసంఖ్యాం."

అని పూర్తిగానున్న శాసనమువలనకూడ క్రీ.శ. 1261-వ సంవత్సరమని తేలుచున్నది. క్రీ. శ. 1261 ప్రాంతమున కాకతీయ రాజ్యమును రుద్రమదేవి పరిపాలించుచుండెను. కనుక బద్దెనయనువాఁ డామెకు సామంతుఁడై కృష్ణాతీరమం దొక చిన్న రాజ్యమును బాలించుచు నుండియుండెనని శ్రీ జయంతి రామయ్యపంతులుగారు నిర్ణయించిరి.

ఈ నిర్ణయమును బరిశీలించినను సంశయాంశములు లేకపోలేదు. బద్దెన నామధేయులనేకులు కానవచ్చుచున్నారు. శాసనమున నున్నంతమాత్రమున నే బద్దెనయో నిర్ణయించుట కాధారములు మృగ్యములే. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారిచ్చిన చెన్నపురి భాండాగార శాసనమునను బద్దెన నామధేయము కలదు. అతఁడు 1070 ప్రాంతము వాఁడుగా గన్పట్టుచున్నాఁడు.

...స్తుత గ్రంథ మేబద్దెన వ్రాసినదియు, దెలియదు. ...జియు, నీతిశాస్త్రముక్తావళి యందలి గద్య నను ...ంచి—

"గద్య. ఇది శ్రీ లక్ష్మీవల్లభ శ్రీపాద పద్మారాధక ...కులాప్తకుల పవిత్ర నన్నన గంధవారణ రాజరాజ ...నోటాంక బద్దెనాఖ్య ప్రణీతంబైన రాజనీతి ప్రకారం ...న్నది సర్వము సంపూర్ణము."

పై నన్నెనగంధవారణేత్యాది బిరుదములఁ గాంచి ...రిశీలించినను, చెన్నపురి భాండాగార శాసనమున ...తము "నన్నెన గంధవారణ నామాది ప్రశస్తి సహితం" ...ని యున్నది. ఇది పై పెమ్మ రామయ్య పంతులు ...గారు సంపాదించిన శాసనములందే కానవచ్చుటలేదు. ...అంతేకాక, విక్రమార్క చరిత్రమునఁ జేర్కొనఁబడిన ...న్నయగంధ వారణుఁ డొకఁడు కలఁడు. ఈతనికి ...సిద్ధనమంత్రి మంత్రి. ఈతని మనుమఁడైన సిద్ధనకే విక్ర...మార్క చరిత్రము కృతిగా నీయఁబడినది.

...విక్రమార్క చరిత్రమునఁ గల పద్యమిది:

"వనరుహనాభు కుద్ధవుఁడు
    వజ్రికి జీవుఁడు వత్సనాథునీ
ఘనునకు యౌగంధరుండు దితి
    సూతికి దైత్యగురుండు విక్రమా
ర్కునకును భట్టి రీతి నధి
    కుండగు నన్నయగంధవారణం
బునకుఁ బ్రధానుఁడై నుతులఁ
    బొందెను సిద్ధనమంత్రి యిద్ధరన్."

దీని విషయమున వీరేశలింగము పంతులు గారిట్లు వ్రాసియున్నారు:

"1156-వ సంవత్సరము మొదలుకొని 1163-వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసిన వెలనాఁటి చోడుఁ డనఁబడెడు రాజేంద్ర చోడునిచే నగ్రహారాదికమును బడసిన నారన సోమయాజికి మనుమఁడగుటచే సిద్ధనమంత్రి 1240-50 సంవత్సర ప్రాంతముల నుండియుండవలెను. అప్పుడు సిద్ధనమంత్రి ప్రభువైన నన్నయ గంధవారణుఁడును ఇంచుమించుగా ఆకాలమునందే యుండును. ఈ కాలము బద్దెనృపాలుని శాసనకాలముతో దాదాపుగా సరిపోవును. కాఁబట్టి యీ నన్నయగంధవారణుఁడే బద్దెనృపతియేమో!"

ఈ యూహ సమంజసముగానే కానవచ్చున్నది. మఱియు రామయ్యపంతులు గారి నిర్ణయమునకుఁ దోడగుచున్నది.

కాని, పైనిర్ణయము నంగీకరించుటకుఁ బూర్వోదాహృతమైన:—

"పరువడి నాంధ్రభాషఁ గల
    బద్దెన నీతియు సంస్కృతంబులోఁ
బరఁగ ప్రతాపరుద్ర నర
    పాలునిచే రచియింపఁబడ్డ యా
నరవరు నీతిసారము..."

అను పద్యము ననుసరించి బద్దెన ప్రతాపరుద్రునకుఁ బూర్వుఁడే యని తోఁచుచున్నది. అనఁగా 1140 మొదలు 1186 వఱకుఁ బ్రతాపరుద్రుఁడు పాలించి యుండుటచే బద్దె 1140 కి పూర్వుఁ డనవలెను. ఈ యూహ 1070 ప్రాంతమువాఁ డన్న చెన్నపురి శాసనమునకు రమారమి సరిపోవుచున్నది. పైఁగా, ప్రతాపరుద్రుఁడే నీతిసారమునఁ బూర్వకవిగా బద్దెనను స్తుతించెనని కవిగారు వ్రాసియున్నారు.

ఇంతకుఁ దేలినదేమన! పై రెండు నిర్ణయములకును బ్రతిబంధకములు పై రీతిఁ గానవచ్చుచుండుటచేతను, నేవాద మంగీకరించుటకును బ్రబలాధారములు లభింపకపోవుటచేతను బద్దెన కాలనిర్ణయము ఇంకను బరిశోధనీయాంశమైయే యున్నది.

బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి రచించుటకుఁ బూర్వము సుమతి శతకము రచించిన ట్లీక్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడని రామకృష్ణ కవిగారును, దాని నంగీకరించి వీరేశలింగము పంతులు గారును చేర్కొనియున్నారు.

"శ్రీవిభుఁడ గర్వితారి
క్ష్మావరదళనోపలబ్ధ జయలక్ష్మీ సం
భావితుఁడ సుమతి శతకము
గావించిన ప్రోడఁ గావ్యకమలాసనుఁడన్."

ఈ పద్యము నీతిశాస్త్ర ముక్తావళి వ్రాఁత ప్రతుల నెచ్చటను గానరాలేదనియుఁ, గాన నంత విశ్వసనీయము గాదనియు ప్రకటపఱచియున్నారు.

పైపద్యము సుమతి శతకమే ముందు వ్రాసినట్లు, "పరువడి నాంధ్రభాషఁగల బద్దెననీతి.." యను పద్యమున నీతిశాస్త్రముక్తావళియే ముందు విరచించినట్లును బద్దెనయే చెప్పుకొన్నాడని యుదాహరించిన శ్రీ వీరేశ

లింగము గారి యూహ పరస్పర వైరుధ్యమున కాలవాలమైనది. కాక, దీనివలనఁ గూడ సుమతి శతకము బద్దెనకృతము కాదనియు వారని తరువాత కవిచేత నే విరచింపఁబడిన దనియుఁ దేలుచున్నది. అందువలన బద్దెన నీతిశాస్త్రముక్తావళి యను గ్రంథ మొక్కఁడానినే రచించియున్నాఁడనుటయే సత్యము.

గ్రంథ ప్రాశస్త్యము

సారస్వతమున బద్దెన నీతిశాస్త్ర ముక్తావళికిఁ గల స్థానము ఇందలి పద్యముల ననేకులు లాక్షణికు లుదాహరించి యుండుటవల్లను, భాషామాధుర్యమునను, భావవైశిష్ట్యమునందును ఆంధ్రమునఁగల రాజనీతి గ్రంథముల నుత్తమమైనదిగా నెన్నబడుటవలనను విదిత మగుచున్నది. ప్రతాపరుద్రునిచే విరచింపఁబడిన నీతిసారమను గ్రంథమున బద్దెన పూర్వసుకవులలో నొకఁడుగా స్తుతింపఁబడినాఁడు. మడికి సింగన తన సకల నీతిసమ్మతములో ననేకములగు నీతని పద్యము లుదాహరించియున్నాఁడు. శ్రీనరచ్ఛందమునను, కవి సంజీవనియందును, రత్నాకరమునందును, ప్రబంధరాజ శ్రీ వేంకటేశ్వర విజయవిలాస మను నద్భుతగ్రంథమును విరచించిన వేంకటకవి లక్షణశిరోమణియందును బద్దెన నీతిశాస్త్రముక్తావళి యందలిపద్యముల నుదాహరించి యున్నారు.

ఆంధ్రమునఁగల రాజనీతిగ్రంథములలో క్షేమేంద్రుని ముద్రామాత్యము, ప్రతాపరుద్రుని నీతిసారము, భోజరాజవిభూషణమను నీతిభూషణము, చారుచర్య, ప్రాచీనకామందకము, ప్రాచీన పంచతంత్రి, శివదేవయ్య పురుషార్థసారము, ఆరాధ్యదేవుని స్మరతత్త్వసారము, మడికి సింగన నీతి కావ్యావళి మున్నగునవి ప్రసిద్ధములు. పైవానిలోఁ గొన్ని గ్రంథములు ప్రస్తుతము లభింపకపోయినను మడికి సింగన విరచించిన సకలనీతిసమ్మతమున నుదాహరింపఁ బడియుండుటచే, తత్పరిశీలమున వానియందలి పద్యములకన్న బద్దెన పద్యముల ప్రౌఢత్వము, మాధుర్యము విశదమౌను. నీతిశాస్త్ర ముక్తావళియం దీ పోలికపద్యము లీయఁబడి యుండుటచే వాని నిట నుదాహరించుట చర్వితచర్వణమే యగును.

నీతిశాస్త్రముక్తావళి యందలి విషయ మారంభ పద్యముననే వివరింపఁబడియున్నది:

"రాజనీతియు నప్రదాజలక్షణమును
మంత్రిమార్గంబు దుర్మంత్రివిధము,
నధికారవిధియుఁ గార్యవిచారము నుపాయ
గతియును రాజ్యరక్షాక్రమంబు
ఇల నరాజకవృత్తి హితసేవకస్థితి
దుస్సేవకక్రియ దుష్టరాజ
సేవాబలము దానశీలతామహిమ వి
వేక సంగతియును లోకనీతి
పద్ధతులు............"

పై విషయములపైఁ జెప్పిన పద్యములను దిక్ప్రదర్శనమాత్రముగా నుదాహరించి యందలి యౌచిత్యము నరయుదము.

రాజనీతులలో:

"న్యాయము ప్రజ పెక్కువకును
బ్రాయము ప్రజకల్మి సిరి కుపాయం బగుటన్
న్యాయమె భండారము నర
నాయకులకు............"

న్యాయపరిపాలనావశ్యకముఁ ప్రధానముగాఁ జెప్పఁబడినది.

"ఆప్తు లెఱింగిన నాప్తుల
యాప్తు లెఱుంగుదురు తత్తదాప్త శ్రేణి
ప్రాప్తమగుచుండుఁ గావున
నాప్తపరంపర లమంత్ర మననిం బతికిన్."

అను రాజ్యతంత్రరహస్యగోపనావశ్యకమును:

"నయమునఁ గాని భూమిప్రజ
నమ్మరు నమ్మఁగాని యర్థసం
చయమును తంత్రవృద్ధియును
జాలదు, చాలఁగాని శత్రులన్
బయి దని యోర్వరాదు, ప్రతి
పక్షమడంగినఁ గాని భూమి య
క్షయముగ నేలరాదు......"

అను చోటను—

"సతికన్న నబల వసుమతి
సత్పతి లేకున్నఁ జెడు సత్యము ధాత్రీ
పతిలేని నాఁడు సద్య
చ్యుతి వసుమతికి......"

అను చోటను—

"మంచిలవు చేసిన పతి కాకు." అను చోటను రాజునకును, ప్రజలకును గల యవినాభావసంబంధము చక్కఁగాఁ దెల్పఁబడినది.

మఱియు దానశీలతో లోకనీతి పద్ధతులందలి త్రికాలాబాధ్యములగు పరమసత్యము లద్భుతముగా నీ గ్రంథమున వివరింపఁబడినవి.

"దానగుణంబ యొన్నఁగఁ బ్ర
  ధానగుణం బది మున్ను గల్గినన్
గాని విశేషమై పురుష
  కారము నిల్వదు లోభి నాఁగఁ జ
న్నని యశంబు పత్తియు వ
  హిష్ణుతయుం విభవంబు విద్యయుం
మానము బీరముఁ వృథయ
  మానిసికిన్......"

"ఎత్తిన కాలఁ గాని సిరి
  కెన్నఁడు నిల్చిన కాల నిల్వఁగాఁ
జిత్తము లేదు కావ సిరి
  చెందిన నాఁడె పరోపకారముల్
హత్తి కడంగి సేయఁ డెడ
  దైవఁ బనంపడి వేఁడుకొందరున్
చిత్తమె కాని యిత్తమను
  చిత్తము పుట్టునె యెట్టివారికిన్?"

అను పద్యము లద్భుతములు, అనుపమానములు.

ఈతని కవిత్వమున నెన్నుట కొక్క పొల్లు మాటైన నంటకపోవుటే కాక.

"పాషాణముత్తెపుసరుల్ పోహళించిన లీలఁ
  దనులోన దొరయు శబ్దములఁ గూర్చి."

యన్న సూరనాచార్యులవారి వానుడికిఁ దీటైన యీతని పద్యములుండును. సమస్తమును విధివశమన్న విషయ మెంత చక్కఁగాఁ జెప్పెనో చూడుఁడు:

"అగుటయుఁ గామియును విధివశ
మగు టెఱుఁగక తనవశంబె యని డెందములో
వగచెడు మూఢుఁ గనుంగొని
నగఁడె విధాతృండు..."

"కాని యది కాద యరయ్యెడు
దాని కవశ్యంబు నన్యథాభావ మిలన్
గా నేర దింత యెఱుంగని
మానిసి చింతాసముద్రమగ్నుఁడు కాఁడే."

"కరిసన మొపి చేసినను
  కర్షుఁడు గొల్చిన హీనమాడినన్
దిరిసిన ధాత్రి రోసి పర
  దేశము పోయిన విద్యకల్గినన్
సిరి తన పూర్వజన్మమునఁ
  జేసిన యంతయ కాక కల్గునే
పొరలిన బ్రేలఁ బద్దఁ దిల
  పోఁతలు పోసిన వెచ్చమార్చినన్?"

ఈతని పద్యముల కూర్పు, అల్లిక బిగిబిగి, ధారాశుద్ధియు నత్యుత్తమములు. తిక్కనపుఁ బూర్వమే యిట్టి కవితాపాటవము బద్దెనృపాలుని నోట వెలువడుట యత్యంత మోదసంధాయకము.


"నరణియ తల్లి తన్ గనిన
  తల్లియ వేల్పు గుణంబు మేని కా
భరణము బుద్ధి రూపు కుల
  భామయ సంపద బొంక చేఁ పో
దరుఁ డిలఁ బ్రాపు దంపమియు
  ధర్మువు క్రోధము పాతకంబు మ
త్సరము వినాశహేతువు వి
  చారమె సారము..."

ఈ విధముగనే గ్రంథమంతయు నత్యంత శ్లాఘాపాత్రముగా వెలయుచున్నది.

ఇట్టి యుత్తమగ్రంథమునకు రెండు మూఁడు విధముల ప్రతులుండుటయు నందు పాఠభేదము లధికముగా నుండుటయు, ఒక ప్రతియందు మూఁడాశ్వాసములుగా విభాగింపఁబడి యుండలి పద్యములుండుటయు మొదలగు విషయములు కానవచ్చుచుండుటచే నీ యుద్గ్రంథమును తిరిగి పరిష్కరణముగా సంపాదించి ప్రకటించుట యత్యావశ్యకముగా నున్నది. ఏ తిక్కప్రతి కర్తయగు బద్దెనృపాలుని కాలమును గూర్చ సద్విమర్శకులు పరిశోధించి యాధారసహితము, వామోదదాయకమునగు నిర్ణయము గావింపవలసియున్నది.



భారత సింహళ జపాన్ మహాబోధి సంఘములు కలసి సార్‌నాథ్‌లో
నిర్మించిన 'మూలగంధ కుటీ విహారం'



సార్నాథ్‌లోని 'మూలగంధ కుటీ విహారం లోపలిభాగం. జపాన్ చిత్రకారుడొకరు బౌద్ధగాథలకు సంబంధించిన అనేక కుడ్య చిత్రాలను చిత్రించి విహారాంతర్భాగాన్ని శోభామయం చేశారు. అచ్చెరువు గొల్పుతున్న ఈ కళా వైభవం ప్రాచ్య పాశ్చాత్య యాత్రికుల ననేక మందిని ఆకర్షించి ఆనందపరుస్తున్నది.

శ్రవ్య నాటిక:

మేఘ మల్హార్

శ్రీమతి మానికొండ సరోజినీదేవి

పాత్రలు

ప్రద్యుమ్నుడు సరస్వతీదేవి
సూరదాసు సునంద
పూర్ణవర్ధనుడు

* * ప్రాతఃకాలాన్ని సూచించే సంగీతం క్రమేపీ తగ్గిపోతూ వుంటుంది.

పూర్ణవర్ధనుడు: (ఉచ్చైస్స్వరంతో)
ఏ ధర్మహేతు ప్రభవా
తే సమ్ హేతుమ్ తథాగతః
తే సచ్ యో నిరోధో
ఏవంవదీ మహాసమనో.

[విరామం]

ప్రద్యుమ్నుడు: (అడుగుల చప్పుడు-రొప్పుతో) స్వామీ!

పూర్ణ: ఎవరూ? ప్రద్యుమ్నా!

ప్రద్యు: అవును స్వామీ!

పూర్ణ: (కంగారుగా) అలా రొప్పుతున్నావేం. తెలతెలవారకముందే లేచొచ్చినట్టున్నావ్. యేం జరిగింది?

ప్రద్యు: రాత్రంతా నిద్రపట్టలేదు స్వామీ!

పూర్ణ: ఎందుకని?

ప్రద్యు: ఎందుకనో మరి. యేవో విషయాలు నన్ను భయపెడుతున్నాయి. మనస్సంతా అందోళనగా వుంది. ఎప్పుడు తెల్లవారుతుందా జరిగిందంతా యెప్పుడు చెబుదామా అని ఆదుర్దా యెక్కువైంది. రాత్రంతా నిద్ర లేదు.

పూర్ణ: ఏమిటది నాయనా అది. అంతా విచిత్రంగా వుందే!

ప్రద్యు: మనవిచేసుకొంటాను.

* * *

[జనుల సందడి—కోలాహలధ్వనులు—నాగస్వర చిహ్నాలు - గావుకేకలు-పొలికేకలు].

ప్రద్యు: (తనలో) ఈ మాసంలో జరుగుతూండే సంక్రాంతి వుత్సవాలకు తప్పకుండా వస్తానన్నాడే! యేమి చెప్పను! యింకా వచ్చినట్టులేదు. మూడురోజుల్నుంచి యేకధాటిగా వెతుకుతున్నా. జనం మూగిన చోటల్లా అన్వేషిస్తున్నా! కళ్లల్లో జ్యోతులు వేసుకొని చూసినా ఆయనమాత్రం కానరాలేదే! — (నెమ్మదిగా)

[నాగస్వరం ఊదుతున్న ధ్వని]

ఎవరది! ఆ పాములాటవంక తదేకదృష్టితో చూస్తున్నాడు. మనిషంతా అచ్చంగా అతడిలాగే వున్నాడు. నిజంగా... సూరదాసే అతడు — సూరదాసే...

[క్షణం విరామం]

నమస్కారం సూరదాసుగారూ!

సూరదాసు: 'దీర్ఘాయురస్తు' నాయనా! అన్నట్టు నన్నేగదూ యిందాకట్నుంచీ నువ్వు వెతుకుతోంది?

ప్రద్యు: (సంతోషంతో) ఎలా తెలుసుకోగలిగారు స్వామీ! చెప్పకుండానే.

సూర: (క్షీణ్నగా నవ్వి) అదా నీ అనుమానం. నేను అవంతీపుర గాయకుణ్ని. అసలు విన్నావే నెరుగుదువు. ఇదివరలో మీ నాన్నగారూ నేను మంచి స్నేహితులం. మీ వూరేదైనా పనివుండి వెళ్లడం జరిగితే తప్పకుండా మీ

నాన్నగార్ని కలుసుకొని, పల్కరించి, మరీ వచ్చేవాణ్ణిసుమా!

ప్రద్యు : అలాగా స్వామీ! మరి నన్నెప్పుడూ చూడలేదా!

సూర : అదేమిటి నాయనా! నిన్ను చూడకపోవడమే. అప్పట్లో నువ్వు చాలా చిన్నవాడివి. తప్పటడుగులు వేసుకుంటూ గుమ్మాలు దాటుతూండేవాడివి. చాలా ముద్దొస్తూండేవాడివి కూడా.

ప్రద్యు : అయితే మీరు ప్రస్తుతం ఎక్కడుంటున్నారు?

సూర : ఇక్కడికి దక్షిణంవైపుగా ఒక నది వుంది తెలుసుగదూ!

ప్రద్యు : ఆఁ...వుందండీ!

సూర : దాని వొడ్డునే శిథిలమైన దేవాలయం ఒకటి వుంది.

ప్రద్యు : ఆఁ... ఆఁ...

సూర : దాన్నెప్పుడైనా చూశావా నాయనా!

ప్రద్యు : చూడకేం స్వామీ! చాలాసార్లు చూసొచ్చాను. కొన్నాళ్లుగా ఒక సన్యాసి బస చేస్తూండేవాడు కూడా.

సూర : ఆ...! యిప్పటికీ ఆ మహానుభావుడు అక్కడే వుంటున్నాడు. నీ కెప్పుడయినా తీరిక వుండి—వీలు చిక్కితే అక్కడికొచ్చి నన్ను కలుసుకో! మరిచిపోకుసుమా!

ప్రద్యు : అలాగే స్వామీ! తప్పకుండా వచ్చి దర్శించుకొంటాను.

సూర : ఇదిగో! అన్నట్టు...నీ పేరేమిటీ?

ప్రద్యు : ప్రద్యుమ్నుడండీ!

సూర : ఇంతా తెలుసుకొని అసలైంది అడగటం మరిచా!

ప్రద్యు : ఏమిటది స్వామీ?

సూర : మరేం లేదూ! ప్రస్తుతం నీ బసెక్కడ?

ప్రద్యు : ఇక్కడికు దగ్గర్లో ఒక బౌద్ధ విహారం వుంది. తెలుసుగదండీ? అదే. అక్కడే ఇప్పటికి మూడు సంవత్సరాలబట్టీ చదువుకొంటున్నాను.

సూర : మంచిది నాయనా! బాగా చదువుకో! మరి... తప్పకుండా వస్తావ్ గదూ! ఒకసారి.

ప్రద్యు : స్వామీ! ఇంకా ఇక్కడ ఎన్నాళ్లుంటారు?

సూర : ఈలోపుగా నన్ను కలుసుకొంటావ్ గా! మళ్ళీ అప్పుడు చెబుతాలే! ఏమనుకోకు—వస్తా మరి...

* * *

ప్రద్యు : ఇలా మాట్లాడుకొన్నాం గురుదేవా! మొదటి వాడు పరిచయమైనప్పుడు ఆ సూరదాసు గారున్నా — నేనున్నా!

పూర్ణ : ఆయన చెప్పిన ప్రకారం తర్వాత ఎప్పుడైనా కలుసుకొంటానికి వెళ్ళావా?

ప్రద్యు : వెళ్ళకేం స్వామీ!

పూర్ణ : ఏ వేళప్పుడు వెళ్ళావ్.—

ప్రద్యు : ఇంకా సాయంత్రం ముదిరిపోలేదప్పటికి.

పూర్ణ : ఒంటరిగా నేనా?

ప్రద్యు : ఒంటరిగా నే బయలుదేరి వెళ్లాను స్వామీ!

పూర్ణ : మధ్యలో యెవరూ తోడుగా కనిపించలేదా?

ప్రద్యు : ఆ ప్రాంతంలోకి వెళ్తూండేటప్పటికి యెదురుగా ఒక పర్వతం కనిపించింది. దాని కిరువైపులా కాలిదార్లున్నవి. పగలల్లా పని చేసి, గృహోన్ముఖులైన పల్లె జనమంతా వరుసగా ఆ దారివెంట బయలుదేరారు.

పూర్ణ : ఎవరినంకా పరీక్షగా చూడలేదుగదా!

ప్రద్యు : (దీనంగా) అబద్ధం చెప్పి మిమ్మల్ని మోసం చేయలేను స్వామీ! ఆత్మవంచన చేసుకొంటూ మీ ముఖంవంక చూసి మాట్లాడలేను...

పూర్ణ : నాకు తెలుసు ప్రద్యుమ్నా! నువ్వు చంచల స్వభావివని, నీలో ఉన్మాదం, కుతూహలం యిటువంటి పరిస్థితుల్లో ఉప్పొంగిపోయి వుంటాయని, నే ననుకొంటూనే వున్నా! తప్పకుండా నువ్వు ప్రతిభావంతుడవై తీరుతావనికూడా ఆశిస్తున్నా... కాని...

ప్రద్యు : క్షమించండి స్వామీ! సునందకోసం ఆ వెళ్లే పల్లెజనంలో వెతికాను. మీ రన్నట్లుగా మారిపోయిన విషయంకూడా వాస్త

వమే! ఆమెను చూస్తుంటే యెందుకో అలా అయిపోతున్నా!

పూర్ణ : అయితే ఆ వాడు సూరదాసుని కలుసుకో లేదా!

ప్రద్యు : సునందతో కాసేపు మాట్లాడి వెడదామను కొన్నా! కాని పొద్దు వాలిపోతోంది. చీకటి; వెన్నెలవెల్లురింటబోతోందని గ్రహించాను.

పూర్ణ : సునందతో మాట్లాడటం యింతకీ కుదర్లేదా? ఆ రోజు.

ప్రద్యు : అదే మనవి చేసుకుంటూ స్వామీ!

*   *   *   *

[నవ్వుల ధ్వని]

ప్రద్యు : ఎవరూ! నువ్వా! ఎప్పుడొచ్చావ్?... అబ్బ!...నీ కోసం యెంత వెతికానని... (నవ్వుతున్న ధ్వని) యేమిటా పిచ్చి నవ్వు!...కొత్తదా మకో రేపటికి... అదిగో మొదలెట్టావ్ కొంటెపనులూ!... సునందా! యింకా చంటిపిల్లలాగా యేమిటీ అల్లరిచేష్టలు...

సునంద : (నవ్వాపుకొంటూ) పాపం! చాలా అలసి పోయారు కదూ!

ప్రద్యు : దేనికీ?

సునంద : కోపానికి.

ప్రద్యు : కోపం?-ఎవరికీ?

సునంద : మీకే!

ప్రద్యు : అబ్బే! నాకేం కోపం. అయినా యెందుకు? యిప్పుడు.

సునంద : ఇంతలోకే యెంత మారతారండీ! యిప్పుడేగా కసురుకొన్నారు పైపంచ లాగితే.

ప్రద్యు : అలా లాగడం కొంటెపని కాదూ!

సునంద : అంతమాత్రానికే కోపంరావాలా! మీరెన్ని సార్లు నా పమిటచెంగు లాగి నన్ను కవ్వించారు!—గుర్తులేదా! అసలు మీ మగాళ్ళకి ఆడవాళ్ళంటే అతి చులకనలెండి. మీరే మైనా చెయ్యొచ్చుగాని, మేంచేస్తే యిట్టే బయటపడతారు. సహనమనేది వుంటేగా అసలు.

ప్రద్యు : (లాలనగా) పోన్లే సునందా! ఒక్క వ యిలా చూడు.

సునంద : సిగ్గులేకపోతే సరి.

ప్రద్యు : అంతకోపం దేనికి సునందా! యేదీ ఒక సారి యిలా నావంక చూసి నవ్వవూ! సునందవుగా! ఏది! నీకోసం యెంత వెతుక్కుంటూ వచ్చానో తెలుసా!

సునంద : నిజంగా! నాకోసమా!—లేక పాములవా కోసమా!

ప్రద్యు : నీకోసమే!

సునంద : పైమాటేగాని, నాకోసం యెందుకొస్తార ఆ పాములవాడికోసం వచ్చివుంటార ఇంతలో నే కనబడ్డానని నీకోసమే అంట న్నారు. అంతేనా!

ప్రద్యు : ఎంత మాటకారి వైపోయావ్?

సునంద : (హేళనగా) అలాగా!

ప్రద్యు : నిజం సునందా! ముమ్మాటికి నమ్ము. ఎప ట్నుంచో వెతుకుతున్నాను. ఇప్పుడు వెతుకున్నా.

సునంద : బాగుంది ఎదురుగా—వుండగా నే

[ఇంతలో అడుగుల చప్పుడు]

ప్రద్యు : సునందా! యెవరో యిటే వస్తున్నారు...

సునంద : ఎవరూ!

ప్రద్యు : కాలి అందెలు మ్రోగుతున్నయి—గాజుల కూడా కదిలిన శబ్దం వినిపిస్తోంది.

సునంద : అయితే నే వెళ్ళిరానా! మళ్ళా కలు కొంటాన్లే ప్రద్యుమ్నా!

ప్రద్యు : (తనలో) ఏమిటో యీ రహస్య ప్రణ సమావేశాలు. పండువెన్నెల్లో — నిం శారద రాత్రుల్లో—హృదయం విప్పి సున దతో కాసేపు కులాసాగా మాట్లాడు మనుకొంటే యేవో అవాంతరాలు తట పడుతూంటాయి. విహారంలో గురుదేవు త్రిపిటకమునుగురించి లేపకిగితే యే చెప్పాలి. నిజంగా నేను చంచలాత్ముడి లేకపోతే నా యీ మనస్సు కాసే జ్యోత్స్నాపూరితమైన ప్రకృతివైపూ, వ

కాసేపు ప్రణయానందదాయినియైన సునంద వైపు వినిటిది?

[ఇంతలో పాతుంకాలపు హారతి గంటల చప్పుడు వినిపించి క్రమేపీ తగ్గిపోతూ వుంటుంది.]

అదిగో! పరిమిత దేవాలయంలో హారతి గంటలు మ్రోగుతున్నయ్. యెంతసేపని యిట్లా వుండను—ఆశ నిరాశ అయింది. దారిన బడితే వెన్నుదిగా వెళ్ళొచ్చు. (నడక చప్పుడు)

[మనిషి కదలిన చప్పుడు]

ప్రద్యు : ఎవ రా మనిషి?

[క్షణం విరామం నవ్వు శబ్దం]

ప్రద్యు : ఎవరూ! సునందా!

సునంద : ఊ...!

ప్రద్యు : సునందా! యేమిటీ చెట్టుచాటున చీకట్లో దాగుడుమూత లాడుతున్నావ్.

సునంద : కనుక్కోవాలి మరి...

(క్షణం విరామం)

ప్రద్యు : అబ్బ! యేమిటో!

సునంద : చెప్పుకోవాలి మరి...

ప్రద్యు : ఇవాళ అగ్నిపరీక్షలు మరీ యెక్కువైనయ్యే! అదేమిటో నువ్వే చెబుదూ!

సునంద : ఇంతేనా మరి!...ఆలోచించి చెప్పండి చూద్దాం.

ప్రద్యు : నాకెట్లా తెలుస్తుంది యేమిటో అది.

సునంద : ఓడిపోయారా?

ప్రద్యు : ఓడిపోయినట్లే—అదీ గాక ఆడదాని ముందు పందెంలో గెలిచినవా డెవర్లే!

సునంద : అది బాగానే వుంది గాని, యింతకీ మీరు దారివెంట పోతున్నారా! లేకపోతే నన్ను వెతుకుతున్నారా! అదీ గాకపోతే పాముల వాడికోసమా!

ప్రద్యు : అబ్బే! నేనసలు వెతకడం లేదు. పైగా నువ్వే వెతుక్కుంటూ వున్నావ్—వేళా కోళ మాడుతున్నావ్.

సునంద : నే నవ్వకపోతే యేమయ్యేవారూ?

ప్రద్యు : నే చూడకపోతే నువ్వేమయ్యేదానివి? యిటువంటివి చూస్తుంటేనే నాకు మహా కోపం వచ్చేది.

సునంద : తప్పుచేసి యింకా కోపం దేనికి? ఆరోజున యేం చెప్పారో గుర్తుకు తెచ్చుకోండి! తెలుస్తుంది.

ప్రద్యు : లేకేం, బాగానే వుంది. నీ విషయం అసలు వేరు. అయినా నువ్వు భాగ్యవంతుడి కూతురివి. ఇంతకీ నువ్వు చెప్పే విషయం యేమిటో తెలపం లేదు.

సునంద : యెత్తిపొడుపుమాటలు చాలుగాని, అబద్ధ మాడబోకండి—ఆడపిల్లలు వుసుతారు. ఆ మాటేమిటో మీరే ఆలోచించి గుర్తుకు తెచ్చుకోండి. అంతవరకూ నే నెక్కడికీ పోను...సరేనా...

ప్రద్యు : (క్షణమాగి) ఆ...అదా! గుర్తొచ్చిందిలే. మురళీ గానమేనా!

సునంద : ఇంకా బాగా ఆలోచించండి. ఆ రాత్రి రెండుఝాములకే దేవాలయంలోకి వచ్చి కూర్చుంటానని కూడా మాటిచ్చారు... మరి...వచ్చారుగదూ!

ప్రద్యు : వచ్చాగా! సునందా!

సునంద : చెప్పిన వేళకి,

ప్రద్యు : సరిగ్గా ఆ వేళకి రాలేకపోవచ్చు. తరువాత వచ్చినమాట వాస్తవం. యింతకీ నన్ను చూశావా! సునందా!

సునంద : మీకోసం వచ్చినప్పుడు-నమ్మి మన సిచ్చుకొన్నప్పుడు-చూడకుండా యెలా వుంటా!

ప్రద్యు : (నవ్వుతూ) సరే సునందా! చూసినదానివి యెందుకు పిలవలేదూ?

సునంద : అప్పుడు నా పరిస్థితి చూసివుంటే, మీకు తెలిసేది. ఒక్కతెనే వున్నానా! రెండు ఝాములప్పుడు ఒంటరిగానే వచ్చాను. ఆలయమంతా వెతికాను...మీ రెక్కడా కనిపించలా చాలాసేపు దిగాలుపడివున్నా. ఇంతలో మా వూరిజనమంతా వచ్చారు. అప్పుడెలా పిల్వను-చెప్పండి.

ప్రద్యు : చివరకు నన్నే ఓడించావ్ సునందా! సరేనా! తప్పుకూడా నిజంగా నాపల్లే వుంది.

సునంద : కానీపు అలాగే అంటూంటారు—మీ పోటీవాళ్లంతా. అయినా మీ లాంటి పాములవాళ్లని యెవరూ నమ్మర్రి?

ప్రద్యు : ఇం కెవరుంటారు నీ పోటీవాళ్లే. అయినా అడగటం మరిచా. సునందా! నువ్వు యీ మధ్య మాటిమాటికి నన్ను పాములవాడంటున్నావ్, యేమిటే అసలు రహస్యం?

సునంద : అదేమిటో మీకే తెలియాలి.

ప్రద్యు : నిజంగా నాకేం తెలియదు.

సునంద : తెలిసి అడగటం తెలివనిపించుకోదు.

ప్రద్యు : (క్షణమాగి) ఓ......అదా......ఆ రోజు సంక్రాంతి వేడుకల్లో నేను, పాములవాడు పాముల్ని ఆడిస్తూంటే చూస్తూ నిలబడ్డందుకేనా యీ వేళాకోళం? సునందా! యథార్థంగా ఆ దృశ్యంమీద కుతూహలం వుండికాదు నిలబడింది.

సునంద : మరి దేనికి?

ప్రద్యు : ఆ వేళ అవంతీపురంనుంచి ప్రఖ్యాత మురళీ వాద్యగాడు సింగారదాసనే ఆయన రావలసి వుంది. ఒకవేళ వచ్చివున్నాడేమోనని ఆ గుంపులో వెతుకుతున్నా.

సునంద : ఎందు కాయన?

ప్రద్యు : ఎందు కేమిటి సునందా! ఆయనవద్ద మురళీ గానం నేర్చుకోవాలనే అభిలాష నాకుందని నీకు లోగడ ఒకసారి చెప్పలా! మరిచి పోయావా?

సునంద : ఇంతకీ పాపం! కష్టపడి వెతికినందుకు కనిపించారా?

ప్రద్యు : 'వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్లు' ఆయనంతట ఆయనే కనిపించి, పరామర్శించారు కూడానూ.

సునంద : ఆయన యిప్పుడెక్కడున్నారు?

ప్రద్యు : నదివొడ్డునవున్న దేవాలయంలో వుంటున్నానని చెప్పారు. అన్నట్టు మీ నాన్నగారు ఎక్కడా కనిపించలేదేం ఈమధ్య?

సునంద : యీ సందట్లో ఆయ నెందుకు జ్ఞాపకమొచ్చాడు?

ప్రద్యు : ఆ...! యేంలేదు! ఇదివరకు నా దగ్గరకొ నప్పట్నుంచీ వెతికా—వెతికా వంటూం డావిది. కాని.... ఈ రోజు ఆ మాటేమీ కుండా యింతసేపూ, నాతో కాలం బుచ్చుతూంటే ఆశ్చర్యం వేసి "యేమా" అడుగుతున్నా!

సునంద : మూడునాలుగురోజులక్రితం మహారాజు ఆహ నంపంపితే కౌశాంబి వెళ్లారు. ఇంకా రాలేద

ప్రద్యు : (పక్కున నవ్వి) అందుకనా! ఇంత ధైర్యం

సునంద : మీకేం తెలుసు. ఎన్ని కష్టాల్ని తప్పించుకొ ఈ అడివిలో చీకటిలోకూడా లెఖ్ఖచేయ కుండా మీ దగ్గరికి వస్తున్నానో!

ప్రద్యు : సునందా! నిజంగా నువ్వన్నట్లు తెలియని పిలవటం అనేదే ధ్యేయంగా పెట్టుకొన వాడికి యెదుటివ్యక్తి అగచాట్లు యెల తెలుస్తయి. ఎందుకంటే నీలాగ నేను కష్ట పడటం లేదుగా! (మృదువుగా) సునందా నువ్వు నా ప్రేయసివి—నా ఆరాధ్యదేవివి నా ఆనందాల సునందవు

సునంద : అబ్బ! ఎంత కంఠం బిగ్గరగా పాడుకుతారు

ప్రద్యు : ఏం?

సునంద : ఏమేమిటి! పూజకోండి. హారతి వే కావొచ్చింది జనమంతా యిటే వస్తారు.

ప్రద్యు : గుర్తొచ్చింది. ఈసారి మీ నాన్న రాగా తప్పకుండా చెప్పేస్తాను.

సునంద : (చిరుకోపంతో) చెప్పకోండి. భయమన కొన్నారా! ఏం.

ప్రద్యు : అటువంటిదేమీ లేదని నాకు తెలుసుగా!

సునంద : ఆయనగారికి తెలియకపోతేగా!

ప్రద్యు : మన విషయమేనా!

సునంద : అబ్బ! యిది కాదూ!

ప్రద్యు : మరేదంటావ్?

సునంద : హారతి యిచ్చేదాకా దేవాలయంలో వుంటానన్న సంగతి.

ప్రద్యు : అయితే కానీపు యెప్పుడైనా అలస్యమైతే మీ నాన్న పూరుకొంటానన్నమాట. చాల అదృష్టవంతురాలివి. అన్నట్టు చెప్పనులే.. సునందా!

సునంద : ఫరవా లేదు చెప్పిచూడండీ!
ప్రద్యు : నిజంగా చెబుతాననుకొన్నావా!
సునంద : మీ విషయం నాకు తెలియకపోతేగా! భయపడటానికి.
ప్రద్యు : మరి...మురళి...వినిపించనా!
సునంద : ఇదివరకల్లా అడిగి వినిపిస్తున్నారా!
ప్రద్యు : పోనీ, యిప్పుడడిగి వినిపిస్తున్నా ననుకో రాదూ!
సునంద : అయితే....కాస్త....దగ్గిరగా రానీయండి నన్ను...
[మురళీగానం మాచాయగా మేఘమల్హార్ రాగాన్ని గుర్తుచేస్తుంది. రెండు నిముషాలనంతరం క్రమంగా తగ్గుతూంటుంది.]
సునంద : (నెమ్మదిగా) ఇవాళెందుకో వొళ్ళు మరిచిపోయాను ప్రద్యుమ్నా!
ప్రద్యు : అప్పుడప్పుడు నీ కలవాటేగా! అది.
సునంద : ఆనందించడంకూడా అలవాటేనా!
ప్రద్యు : కాదుమరీ! అన్నట్టు చాలా పొద్దు పోయింది.
సునంద : అవును! నీ వొడిలో తల పెట్టి—పడుకొంటే హృదయం ఎందుకో హాయిగా వుంటుంది. తూచలేని స్వర్గభోగాల అనుభూతి అంతా నాలో పొర్లుతూంటుంది. ఎంతసేపయినా అలాగే వుండాలనిపిస్తుంది...
ప్రద్యు : సునందా!
సునంద : ప్రద్యుమ్నా! చాలాదూరం వెళ్ళాలిగదూ!
ప్రద్యు : అవును. నే వెంట వస్తానులే కొంతదూరం దాకా! పద...

[విరామం]

పూర్ణ : ఇంతకీ, ఆ వేళ సూరదాసుని కలుసుకోలేదన్న మాట.
ప్రద్యు : కలుసుకోకేం స్వామీ! తెల్లవారు ఝామునే బయలుదేరి వెళ్ళాను. గుడిలో విగ్రహం లేదు. గుడి గోడలన్నీ పెద్ద పెద్ద పగుళ్ళిచ్చి వున్నాయి. వాటిమధ్యనుంచి యేవో మొక్కలు - తీగలు అల్లిబిల్లిగా మొలిచి, అల్లుకొనివున్నాయి. చుట్టూ ఏవో గ్రామాలున్నట్లు మినుకుమినుకుమంటూ దీపాలుకూడా కనిపించాయి.
పూర్ణ : సూరదాసు కనిపించలా! అప్పుడు.
ప్రద్యు : కనిపించారు గురుదేవా!
పూర్ణ : ఏమన్నారు?
ప్రద్యు : చాలా ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ-

[విరామం]

సూర : ఇదేనా రావడం! నాయనా!
ప్రద్యు : అవును స్వామీ!
సూర : చాలా సంతోషం... లోపలంతా చీకటిగా వుంది...పద......అలా వెలుగులోకి వెళ్ళి కాసేపు విశ్రాంతిగా కూర్చొని మాట్లాడుకొందాం.
ప్రద్యు : అలాగే స్వామీ!
సూర : (ఆలోచనగా — తనలో) జరుగుతుంది... తప్పకుండా జరుగుతుంది...నీవల్లనే జరిగి తీరుతుంది...యీ విషయం నాకు బాగా తెలుసు...నా పరీక్ష ఫలిస్తుంది. జరిగితీరుతుంది...
ప్రద్యు : (నెమ్మదిగా) స్వామీ! ఏమిటో పలవిస్తున్నట్టున్నారు.
సూర : ఆ...! యేమీ లేదు...యేదో విషయం జ్ఞాపకానికి వచ్చింది...అనుకొంటున్నా!

* * * *

పూర్ణ : ఇంకా యేమైనా అన్నాడా సూరదాసు?
ప్రద్యు : ఆయనగారి భీకరస్వరూపాన్ని చూడంగానే నా కెందుకో భయం వేసింది. ముందుగా నాకు నేనై మాట్లాడ్డానికి వెనుకంజవేసాను. ఆయనలో వున్న ఆకర్షణేదో నన్ను ఆతనికి దగ్గరగా చేర్చింది.
పూర్ణ : మరి, పలకరించగల్గావా!
ప్రద్యు : ఎలాగో ధైర్యం చేసి యిలా అనగల్గాను.

[విరామం]

ప్రద్యు : స్వామీ! నమస్కారం.
సూర : దీర్ఘాయురస్తు నాయనా! అనుకొంటూనే వున్నా! నువ్వీపాటికి వస్తూంటావని. మరేమీ అనుకోకు. నీకేమైనా మీ నాన్నగారిలాగా సంగీతశాస్త్రంలో ప్రవేశముందా?
ప్రద్యు : సంగీతం నేర్చుకోవాలనే అభిలాషయితే వుందిగాని, స్వామీ! సాధన సక్రమంగా జరగడం లేదు.

నార : గాత్రమేనా!

ప్రద్యు : కాదు స్వామీ!

నార : మరెందులో...

ప్రద్యు : కొద్దిగా మురళివాయించడంలో నే అభ్యాసం చేసాను.

నార : అది సహజమే! మీ తండ్రిగార్ని మెరుగని వారంటూ రెవ్వరూ లేరు యీ చుట్టుపట్ల. అనేకమంది మహారాజులనుంచి ఆహ్వానాలు వస్తూండేవి.

ప్రద్యు : చిత్తం.

నార : మరైతే నువ్వు యేయే రాగాలు ఆలాపించగలవు?

ప్రద్యు : వాటికి సంబంధించిన వివరాలేమీ నాకంత బాగా తెలియవు. రోజో వుబుసుపోకకు అప్పుడప్పుడు వూదుకొంటూ ముచ్చటపడుతుంటాను.

నార : అలాగా! అయితే! నువ్వెప్పుడన్నా "మేఘమల్హార్" అనే రాగం పేరు విన్నావా!

ప్రద్యు : ఎక్కడో విన్నట్లే జ్ఞాపకం - స్వామీ!

నార : మరి దాన్ని...తరువాత...తరువాత సాధన చేయలేకపోయావా?

ప్రద్యు : మొదట్లో కొన్నాళ్ళు, అంటే గుర్తున్నంత కాలం రోజూ వూరంతా సద్దుమణిగిన తర్వాత, పొద్దుపోయేదాకా కాసేపు, తెల్లవారుఝామునే లేచి కాసేపు సాధన చేసాను.

నార : తప్పకుండా అటువంటప్పుడు ఆ రాగం అవటం సులువుగానే వుంటుందే!

ప్రద్యు : వాస్తవంగా మీ రన్నట్లే వుండాలి, మరి కాని...

నార : ఏమయ్యేది (ఆదుర్దాగా)

ప్రద్యు : ఏమయ్యేదో నాకే తెలియదు. తీరా అవరోహణలోకి వచ్చేటప్పటికి మరొక రాగంలోకి దిగేది.

నార : అయినా! నువ్వు మురళిమీద మేఘమల్హార్ బాగా ఆలాపించగలవని విన్నానే!

ప్రద్యు : పెద్దలూ—గురుతుల్యులు. మీరంతగా వినాలని కుతూహలపడుతూంటే, వినిపించకుండా ఎలా వుంటాను స్వామీ!

నార : నిజంగా వినాలనేవుంది ప్రద్యుమ్నా! ఎటువంటి అభ్యాసం చేసావో విందామని ఆదుర్దాగా కూడా వున్నమాట కాదనలేను. ఏదీ...ఒక్కసారి...అను...

[మురళిపై మేఘమల్హార్ రాగాలాపన శ్రుతిబద్ధంగా మూడునిముషాలుండి ... క్రమేపీ తగ్గిపోతూ వుంటుంది.]

నార : (ఆనందాతిరేకంతో) ప్రద్యుమ్నా! ధన్యుడనోయ్. నీ మురళీ మధురాలాపన నన్ను ఉన్మత్తునిగా చేసింది. నిదురపోతున్న మూగప్రకృతిని చీల్చుకొంటూ-నిశ్చింతగా-నిర్మలంగా-నిండు తారల కొలువులో-నెలబాలుని సమ్మోహనచంద్రికల ఛాయల్లో-నీలి నీడల్లో జాలిగొలిపే పూలబాలల పాన్పులపై పూయాలలో-జొంపాలలో-నీలి మేలిముసుగు కప్పుకొని, కరాళ భీకర వికటాట్టహాసం చేస్తున్న కాళరాత్రిని కాలదన్ని-సర్వవేళలా యీ భూమిపై ప్రవహించే నీ మురళీగానసుధారసధార నన్ను పునీతుణ్ణి చేసింది. అయినా యిది నా స్తోత్రంగాని, ఇంద్రదమనుడి కుమారుడవు యిది ఒక పెద్దపని గాదు. ముందుగానే నాకీ విషయం తెలుసు-జరిగి తీరుతుందని.

ప్రద్యు : ఏమని ఈమాపణ చెప్పుకోవాలో అర్థం కాకుండా వుంది స్వామీ!

నార : దేనికంత ప్రయత్నం!

ప్రద్యు : వచ్చీరాని విద్య మీవంటి సర్వజ్ఞులముందు ప్రదర్శించినందుకు.

నార : అలా అనకు నాయనా! 'సాధన' విద్యకు మెరుగు పెడుతుంది. నీ రాగాలాపన విన్న తరువాత నీకొక రహస్యం చెబుదామని బుద్ధి పుడుతోంది. ఈ విషయం చెప్పాలని, నీ కోసం చాలా నాళ్లు వెతికానుకూడా.

ప్రద్యు : చిత్తం.

నార : ప్రద్యుమ్నా! మరి ఆ రహస్యాన్ని నువ్వెక్కడా వెలిబుచ్చకూడదు-ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియనివ్వకూడదు. అలాగని వాగ్దానం చెయ్యి.

ప్రద్యు : ప్రకృతిసాక్షిగా.

[క్షణం విరామం]

నారద : ప్రద్యుమ్నా! ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నావ్. భయపడుతున్నావా! అపాయం కలిగించే విషయం యేమీ కాదు. అటువంటిదయ్యేటట్లయితే స్వయంగా నేను చెప్పనే చెప్పను-తెలుసా!

ప్రద్యు : (తలవూగి) ఆత్మసాక్షిగా ... అలాగే స్వామీ!

నారద : అయితే విను :

[నేపథ్యంలో మేఘమల్హార్ రాగాలాపన సాగవగా]

ఆ శిథిలాలయం చూశావుగా. దానిలో యింతకుముందు, ఎంతోకాలంనుంచి సరస్వతీదేవి విగ్రహం వుంది. ప్రఖ్యాత సంగీత విద్వాంసులంతా అప్పట్లో తమ తమ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఆ దేవిదగ్గరకు పోయి, మనస్ఫూర్తిగా ఆరాధించి, తమ గానకళాకౌశలాన్ని ప్రదర్శించేవారు. అటుపిమ్మట తోచినవిధంగా సంగీతాన్ని పలుచోట్ల వినిపించుతూ జీవితాన్ని గడిపేవారు. ఎవరైతే నిష్కల్మషంగా నిర్మల మనస్కులై ఆషాఢ పూర్ణిమనాడు శ్రావణ పూర్ణిమనాడు ఆ దేవిముందు మేఘమల్హార్ రాగాన్ని ఆలాపనచేస్తారో, వారికి దేవి ప్రత్యక్షమై కోరిన వరములిచ్చేది.

ప్రద్యు : ఇప్పుడుకూడానా స్వామీ!

నారద : ఈ విషయం యిప్పుడెవ్వరికీ తెలియదు. నియమిత సమయంలో 'పరిశుద్ధమైన హృదయంతో ప్రార్థనచేస్తూ ఆరాధిస్తేగాని, ఆ గానానికి సిద్ధి లభించదు. అదీగాక సంగీత శాస్త్రంలో అతనికి తెలియనిదంటూ వుండదు. ఇది ఇలావుండగా మరొక నియమం వుంది.

ప్రద్యు : స్వామీ! యేమిటది?

నారద : ఆరాధనచేసే వ్యక్తి అవివాహితుడై వుండాలి; ఇంతకూ చెప్పేదేమంటే, వచ్చే పూర్ణిమనాటి రాత్రి మనమిద్దరం ఆ దేవి సాన్నిధ్యంలో వుండాలి. నువ్వు నీ మురళీ గానవిన్యాసాన్ని మేఘమల్హార్‌లో చూపించాలి. ఏమంటావ్?

ప్రద్యు : ఇది అనుకొన్నంత సామాన్యవిషయమా స్వామీ! ఏమో! నాకు నమ్మకం లేదు.

నారద : ఏం...భయమేస్తోందా? పోనీ...యిష్టంగా లేదా? మురళీగానవిశారదుడవని జగద్విఖ్యాతిని పొందదలచలేదా? మీ తండ్రి పేరు చిరస్థాయిగా - చిరస్మరణీయంగా వుండటం - నీ కభిమతంగాదా?

ప్రద్యు : అందేం కాదు స్వామీ!

నారద : మరింకేది?

ప్రద్యు : "ఇదెలా సంభవం" - అని ఆలోచిస్తున్నా! అంతే!

నారద : ఆ విషయంలో నువ్వేం భయపడకు - దిగులు పడకు. నిశ్చింతగా వుండు. నిజం దానికదే బయటపడుతుంది. భావ వ్యక్తిని పరీక్షిస్తుంది. నిలబడాలి. కళోపాసన చేయడమంటే, కర్మబద్ధంగా - కాలానుగుణ్యంగా ప్రవర్తించాలి. సంగీతంకూడా మోక్షసాధనకు ఒక మార్గమే. దానికి నాందీ ప్రస్తావన పల్కు. నువ్వు సరేనంటే పూజకు ప్రయత్నాలు సలుపుతాను. తేల్చి చెప్పమరి... అనుమానంతో ఆత్మవంచన చేసుకోవద్దు. అది లలితకళలకు తీరని కళంకం...ఏమంటావ్ మరి?...

ప్రద్యు : సరే....సిద్ధంచేయండి...వస్తాను.

నారద : ఇంకా యేమన్నా సందేహంగా వుందా!

ప్రద్యు : లేదు స్వామీ! సంతోషంగానే వుంది.

నారద : అంతవరకూ రాకుండా వుండేవ్. ప్రద్యుమ్నా! అప్పుడప్పుడు వస్తూ పోతూ వుండు. పూజకు సిద్ధంకావటంతోనే తెలియజేస్తా. నువ్వుకూడా కొన్ని పనులు చేయాలి.

ప్రద్యు : ఏమిటవి? స్వామీ!

నారద : అవేవో తర్వాత చెప్తాలే! ప్రద్యుమ్నా!

ప్రద్యు : చిత్తం...మరి సెలవా!

నారద : మంచిది నాయనా! జాగ్రత్తగా వెళ్ళిరా!

ప్రద్యు : చిత్తం...అలాగే...

* * *

[నేపథ్యంలో]

[ఆషాఢ పౌర్ణమినాటి రాత్రి; ఆకాశమంతా కారుమేఘాలతో క్రమ్ముకొని వుంది; మధ్య

మధ్య ఉరుములు — మెరుపులు. అంధకారంలో అవని అలసినట్లుంది. ప్రద్యుమ్నుడు, సూరదాసు చెప్పిన ప్రకారం నదిఒడ్డుకు వెంటనడిచాడు. భద్రావతీ నది నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. కెరటాలపైనుంచి చల్లనిగాలివచ్చి అవనినంతటినీ వూపుతోంది. సూరదాసు ప్రద్యుమ్నుని వంక చూస్తూ—]

సూర : ప్రద్యుమ్నా! చెప్పినప్రకారం రాగలిగేవంటేనే, నీలో యెంతటి భక్తి వుందో నేను గ్రహించాను.

ప్రద్యు : చిత్తం...స్వామీ!

సూర : మరి...పూజకు వేళ అతిక్రమిస్తోంది. స్నానంచేసి శుచిగా బట్టలు మార్చుకో. ఈలోపు పూజాప్రయత్నాలన్నీ సరిచూసి వస్తాను.

[నీటిలో గల గల ధ్వని]

ప్రద్యు : (తనలో.......కంపించే స్వరంతో) ఏమిటిదంతా! తాంత్రికపూజ సంరంభంలాగా వుంది. మునుపు ఒకసారి తాంత్రికపద్ధతులగురించి మా విహారంలో యోగాచార్య పద్మసంభవుల వారి భిక్షుక శిష్యుడు చెప్పగా విన్నాను... చాలా భయం వేసింది. ఆమాదిరిగానే వుంది. యీ సూరదాసుగారి పూజాతతంగమంతా! చూస్తుంటే...

[ఇంతలో అడుగుల చప్పుడు]

సూర : అయిందా స్నానం ప్రద్యుమ్నా! నేనుసిద్ధంగానే వున్నా ... నీకోసమే ... యెదురు చూస్తున్నా! త్వరగారావాలి ప్రద్యుమ్నా!

ప్రద్యు : అలాగే స్వామీ! ... అయిపోయింది ... వస్తున్నా!

సూర : (తనలో) జరుగుతుంది...జరిగితీరుతుంది...

ప్రద్యు : స్వామీ!...

సూర : (ఉలిక్కిపడి) ఆ...వచ్చావా!...పద...వెళదాం...

[ఉరుముల చప్పుడు...గాలి రొద...కీచురాళ్ళ ధ్వని...నది హోరు...]

ప్రద్యు : స్వామీ! ఏమిటవి...చూడ్డానికి భయంకరంగా వున్నాయ్?

సూర : ప్రద్యుమ్నా! ఎందుకలా భయపడిపోతున్నావ్. అవి ... పూలదండలు... దేవికి సమర్పించడానికి తెచ్చాను.

ప్రద్యు : (తెల్లబోతూ—ఆశ్చర్యంగా) ఎంతఎర్రగా వున్నాయి రక్తం పూసినట్లు...జపా పుష్పాల్లాగా!

సూర : అవునవును...కొత్తవాళ్లకు భయం కలిగించేలాగున్నాయికదూ!

ప్రద్యు : అందుకేగా స్వామీ! అడిగింది.

సూర : ఏం భయంలేదు ప్రద్యుమ్నా! చూడు ... నేను మెళ్లోకూడా వేసుకొంటున్నా మరి... అందంగా లేవూ...!

ప్రద్యు : భయంగావున్నా, మీలాంటివారిటువంటివి వేసుకొంటే, నిజంగా ఎంతో అందంగా వున్నారు. అలా జుట్టు విరియబోసుకొని దీపాన్ని వెలిగించేటప్పుడు ఆ కాంతులు మీమీదపడి, మీ శరీరానికి మరింత వన్నె తెచ్చాయి.

సూర : ప్రద్యుమ్నా! ఎంత చక్కగా వర్ణించావోయ్. మరి ... పూజ చేస్తున్నా ... నే చెప్పేవరకు మురళి ఆలాపన చెయ్యకు.

ప్రద్యు : అలాగే స్వామీ!

[విరామం]

[చిరుగంటల చప్పుడు — కొబ్బరికాయ కొట్టిన చప్పుడు]

సూర : నాపని పూర్తయింది. యిక నీపని ప్రారంభించు. కాని జాగ్రత్తసుమా! నీ కార్యనిర్వహణంమీదే అంతిమ ఫలితం ఆధారపడి వుంది......

ప్రద్యు : స్వామీ! ప్రారంభిస్తున్నా!

[మేఘమల్హార్ రాగం శ్రావ్యంగా—అయిదు నిముషాలు వుండి క్రమంగా తగ్గుస్థాయిలోకి వస్తూంటుంది.]

[నేపథ్యంలో]

"ఆ సమయంలో గాలిలేదు. ప్రకృతి నిశ్శబ్దంగావుంది. భద్రావతీనదిమాత్రం మెల్లగానే వుంది. చిన్న చిన్న కెరటాలు మంద స్వరాల్ని తియ్యగా ఆనందాతిరేకంతో

ఆలపించుకున్నాయి. గుడిముందు చీకటి విడిపోయింది.

ఉ॥ శారద నీరదేందుఘన
సారపటీర మరాళ మల్లికా,
హార తుషార ఫేన రజతా
చల కాశ ఫణీశ కుంద మం,
దార సుధాపయోధి సిత
తామర సామరవాహినీ శుభా,
కారత నొప్పు నిన్ను మదిగానక
యెన్నడు గల్గు భారతీ! (భాగవతమ్)

ప్రద్యు : (తివలో-పారవశ్యంగా) ఎవరూ! పౌర్ణమి నాటి వెన్నెల్లో ఈ అపురూపసుందరి. జఘనాంతవరకూ పొడుగాటి నల్లని వెంట్రుకల తలకట్టు భూమిమీద వసంత సౌందర్యం వెల్లివిరుస్తున్నట్లుగా వుండే ఎర్రకలువల్లాంటి పాదాలు-లలిత కళోపాసకుల హృదయాల్లో సౌందర్యతృష్ణను మంగళమయుక్తం చేసే వీణియ ఝుంకారం...సత్యాన్ని సృష్టించే సర్వశోభిత దాయిని...సరస్వతీదేవి కూ! ... నమస్సులమ్మా!!...

[విరామం]

నూర : ప్రద్యుమ్నా!...

ప్రద్యు : (ఉలిక్కిపడి....కళ్ళు నులుపుకొంటూ) ఆ... యేం...స్వామీ!

నూర : చూశావుగా!

ప్రద్యు : ఇదంతా స్వప్నమా! నిజమా!...... యేమిటి...స్వామీ!

నూర : (నవ్వుతూ చిన్నగా) అదృష్టవంతుడివి. ఆనందించగల్గుతున్నావ్. సర్వవిద్యలకీ సమర్పించే సౌందర్యమూర్తిని—సరస్వతిని దర్శించుకోగల్గావ్! ధన్యుడివైనావు...... నీ జీవితం చరితార్థమైంది.

ప్రద్యు : మీ దయవల్ల నేగా స్వామీ!

నూర : నాదేముంది ఇందులో! ఎప్పుడూ నీ శ్రేయోభిలాషి నే! ఆనందం అనుభవించడానికి కూడా పూర్వజన్మసంస్కారం వుండాలి. అందరికీ అనుకొన్నంత అందుబాటులో వుండదు.

ప్రద్యు : ఇంకా మీ పని పూర్తి కాలేదనుకుంటా!

నూర : ఏం...వెళతావా?

ప్రద్యు : ఇప్పటికే చాలాపొద్దు పోయినట్లుంది...... చీకటికూడా దట్టంగా వుంది.

నూర : పేరుకి పౌర్ణమే గాని, చూపుకి అమావాస్య లాగా వుంది ప్రద్యుమ్నా! ఇంకా నా పని కాలేదు. నువ్వు వెళ్లాలనుకుంటే బయలుదేరు. అక్కడిదాకా పంపుతాను. ఇంతకీ నా మాటలోని నిజం బాగా తెలిసిందిగా.

ప్రద్యు : పెద్దల వాక్యాలు నిష్ఫలమెలా అవుతాయి స్వామీ! మరి సెలవా!...

[విరామం]

పూర్ణ : అప్పటికి ఎంత పొద్దుపోయిందో గుర్తుందా!

ప్రద్యు : సరిగ్గా తెలియదు గురుదేవా! నేను బయలుదేరే టప్పటికి చంద్రుణ్ని మేఘాలు ఆవరించి ఉన్నాయి మెరుపులు—ఆగి ఆగి మెరుస్తున్నాయ్ వాతావరణమంతా గ్రహణం పట్టినట్లుగా ఉంది.

పూర్ణ : ఒక్కడివే ఎలా రాగలిగావు అంత చీకట్లో?

ప్రద్యు : బిక్కు బిక్కుమంటూ ఒక్కణ్ణే బయలుదేరాను. ఆలయపు ఆవరణ చాలా పెద్దది. దాన్ని దాటిరావడానికే చాలా శ్రమపడ్డాను. తరువాతి ప్రదేశమంతా అడివే. పొద, కొబరాల వృక్షాలతో ఒత్తుగా వ్యాపించి వుంది. అలాగే దారి వెతుక్కుంటూ వస్తూంటేగా...

పూర్ణ : మళ్ళా ఏం జరిగిందేమిటి?

ప్రద్యు : ఒకవైపునుంచి హఠాత్తుగా వెలుగువస్తోంది.

పూర్ణ : వెలుగా!

ప్రద్యు : అవును స్వామీ! సూర్యోదయపు కాంతి కిరణంలాగా వుంది. చెట్లచాటునుంచి ప్రసరిస్తోంది. కాసేపటికి అది ఆవిధంగా లేదు. కొంచెం ముందుకి వెళ్లాను. ఒక రావిచెట్టు కనిపించింది. దానిక్రింద ఒక సుందరి నిలబడివుంది. నవ వసంత ఋతువుని తోడుక్కున్న విరికన్నెలాగుంది. నాకు భయం వేసింది. కళ్ళు నులుపుకొని ఆశ్చర్యంగా చూశాను. కాసేపటివరకు నోట మాట రాలేదు. ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం మెదలసాగింది. ఈ కాళరాత్రిలో—యీ కీకారణ్యంలో ఒంటరిగా ఎందుకు. తిరుగు

తోంగో వాడు తోచలేదు. చాలాసేపు అలాగే నిలబడి పిచ్చివాడిలాగా చూశాను.

పూర్ణ : "ఒక సుందరి"!— చీకట్లో!......తిరుగాడుతూ!...కనిపించిందా!...చెట్టుక్రింద!...ఒంటరిగా...! నిజంగానా ప్రద్యుమ్నా!

ప్రద్యు : నిజంగా నే స్వామీ!......ఈ కళ్ళతో నే చూశాను. దగ్గరగా వెళ్ళికూడా చూశా. దీన వదనయై వుంది. మిణుగురు పురుగుల కాంతి ఆమె దేహంమీదనుంచి వస్తోంది. సరోజ నేత్రాలు ఎర్రబడి వున్నాయి. తెల్లకనుగుడ్డు మీద ఎర్రజీరలు కంది యేదో బాధనూ— జాలి గాథనూ వ్యక్తం చేస్తున్నాయి. ఆ అరణ్యంలోనుంచి బయటపడటానికి దారి వెదుకుతున్నట్లుగా తోచింది......ఎంతోసేపో అలాగే వున్నా....

పూర్ణ : (ఆత్రుతగా) తరువాత—

ప్రద్యు : ఎక్కువసేపు అలావున్నా ప్రయోజనం లేకపోయింది. నా కేదో భయం వేయనారంభించింది. జరిగిందంతా పుంఖానుపుంఖంగా గుర్తుకు రాసాగింది. మనశ్శాంతి లేకుండా పోయింది. ఆ చంద్రుని క్షీణకాంతిలో అప్పటికప్పుడే బయలుదేరి వడివడిగా విహారానికి చేరుకొన్నా!

పూర్ణ : ఇంకా అప్పటికి తెల్లవారలేదా?

ప్రద్యు : అప్పటికే ఇంకా రెండున్నర ఘడియల కాలం వుంది. తిన్నగా వచ్చి, వికలమైన హృదయంతో పడుకొన్నా. కలత నిద్రలో పగిలిన ఆలోచనలతో స్వప్నం వచ్చింది...

పూర్ణ : స్వప్నమా! తెల్లవారుఝాము ఘడియల్లో...ఏమని...?

ప్రద్యు : "భద్రావతీ నదీతీరాన ఒక లావణ్యవతియైన స్త్రీ, వచ్చినదారి మర్చిపోయి ఎంతో బాధపడుతూ వుంది. ఆమె బాధనే వ్యక్తం చేస్తూ భద్రావతీనది దీనంగా ప్రవహిస్తోంది. ఆ ప్రవాహపు నురుగు ఆమె శరీరకాంతిని మరుగుపరుస్తోంది. చీకటిలో—తెలిపోని ఆలోచనలతో—తీరని బాధతో—మారిన హృదయంతో—విసిగివేసారిన ఆశలతో—విచారంతో తడిసిపోయిన కోమల వదనంతో—పారాడి చెరిగి—నురకలు పడుతూన్న అరుణ చరణాలతో ఒడ్డ
తిరిగాడుతోంది—నీటి కెరటాలు వ
ఆమె పాదాల్ని ముద్దెట్టుకొంటున్నాయి
చిరుచేపలు తమ రెక్కలతో ఆమె పా
లకు అంటుకొన్న తడిని తుడుస్తున్నాయి
కొన్ని విసురుతున్నాయి. అసహాయతతో
వల్ల కుమిలి కుమిలి దుఃఖిస్తోంది. ఇంతల
ఒక భయంకరమైన సొరచేప, తన భీక
దంతాల్ని చూపిస్తూ వికటాట్టహాస
చేసింది. ఆమె కంపితురాలైంది. ఉలిక్కి
పడింది, వణికిపోయింది. బెదిరింది. హృదయ
మరింత చెదిరిపోయింది. ఆ నవ్వు సరి
మూరదాకు నవ్వులాగే వుంది. ఆ
మాత్రం కలలో పడ్డ హరిణ శాబకంలా
జాలిగా — దీనంగా — బాధగా—వి
రంగా—చూస్తోంది...తరువాత విహారవా
కల ఘంటికలచప్పుడుకు కల కరిగిపోయిం
లేచిచూసేసరికి సూర్యోదయం కావొస్తోం
ఉషోదయం మధ్య దశలో వుంది.

* * *

పూర్ణ : (నిట్టూర్చుతూ) ఎంతపని చేశా
ప్రద్యుమ్నా! ముందే యీ విషయాలన్నీ నా
కెందుకు చెప్పలేకపోయావ్ అంత తీ
లేకుండా పోయిందా!

ప్రద్యు : ఆయనే చెప్పొద్దన్నారు గురుదేవా! అ
గాకుండా వాగ్దానంకూడా చేశాను.

పూర్ణ : (ఆలోచనగా) అర్థమైంది అసలు విషయ
అయితే యిప్పుడు యెందుకు చెప్పదా
కొచ్చావ్?

ప్రద్యు : (దీనంగా) క్షమించండి స్వామీ!
తప్పుని మన్నించండి గురుదేవా! ఇప్పటి
గాని తెలుసుకోలేకపోయాను — ఒ
హృదయానికి కష్టం కల్గించినట్లుగా.

పూర్ణ : (బాధగా) ప్రద్యుమ్నా! ఇటువంటి సంఘ
టన ఒకటి త్వరలోనే జరుగుతుందని నా
తెలుసు. పద్మసంభవుడు, అతని శిష్యు
దేశాటనంచేస్తూ యీ మతాన్ని వాకిస
చేయాలని ప్రయత్నిస్తున్నారు. కాని...

ప్రద్యు : అది సత్యమేనా గురుదేవా!

పూర్ణ : సుమూర్తికి సత్యమే! ఇప్పుడు నీకుతూహలమంతా ఆ బాల్యతలోనే సర్వనాశనం అయినట్టుగా కనిపిస్తోంది...నిజంగా అయిందికూడా! ప్రద్యుమ్నా! ఎంతపాపానికి వొడిగట్టుకున్నావ్...చివరకు—

ప్రద్యు : (గాద్గదికంగా) నే చేసింది అక్షరాలా పాపమేనా!

పూర్ణ : నీ మురళిపై సాగి లీనమైన మేఘమల్హార్ రాగాలాపన తన్మయత్వం—దుదకు సరస్వతీదేవిని ఖైదు చేయటంలో వినియోగించబడింది... తెలుసా!

ప్రద్యు : (ఏడుస్తూ...వణుకుతూన్న కంఠంతో) గురుదేవా! ... అయితే ... నా పాపానికి పరిహారం...లేదా!...ఈ జన్మలో నా జీవితం వ్యథలపాలేనా!...నా సంగీతమంతా నిష్ప్రయోజనమైందేనా!...నా మురళి సునందకిక వినిపించదా!...నా కంఠమంతా విషపూరితమేనా!...నా రాగాలాపనంతా అనురాగ పరాగాలకు దూరమేనా!...స్వామీ!...

పూర్ణ : (ఓదారుస్తూ) ప్రద్యుమ్నా! విచారపడి ఇప్పుడేంలాభం? ఇటువంటి కార్యాలు చేయకుండా తప్పించడానికే యే శిష్యుణ్ణీ నేను విహారందాటి బయటికి పోనివ్వకపోవటం. అయినా ఇప్పుడని యేంలాభం వుంది. నువ్వు నిజంగా అమాయకుడివి ఇందులో నీ తప్పు కూడా పెద్దగా లేదు. సంగీత ప్రియుడిన నే దృష్టితో సూరదాసుని చేరావు. అతను నువ్వనుకొన్న నిజమైన సూరదాసు కానే కాడు...ఆ సంగతి తెలుసా!...

ప్రద్యు : అతను సూరదాసు కాడూ! (ఆశ్చర్యంతో) అవంతీపురంకూడా కాదా!...

పూర్ణ : ఏదీ కాదు...!

ప్రద్యు : మరెవరతను?

పూర్ణ : (ఆలోచనగా) అతడు ఒక ప్రసిద్ధ కాపాలికుడు.... పేరు గుణాఢ్యుడు. తన ప్రయోజనంకోసం నీకు మారుపేరు చెప్పి, ఫలితం నీవల్ల పొందగల్గాడు.

ప్రద్యు : (వింతగా) మారుపేరా! వింతగా ఉందే! ఇంతకీ అతని సంగతేమిటి గురుదేవా!

పూర్ణ : ఇంకా నీకా కథ తెలియదనుకొంటా. నీవు చూసిన గుడి సరస్వతీదేవిది. పూర్వకాలంలో అది హిందువులకు ప్రసిద్ధ తీర్థభూమి. ఇప్పటికి రెండు సంవత్సరాల క్రిందట, ఆదేవాలయం చాలా వుచ్చస్థితిలో వుండేది. దాన్లో సూరదాసనే యువ గాయకుడు నివసిస్తూ, మేఘమల్హార్ రాగాలాపన చేసి సరస్వతీదేవిని ఆరాధించి వరాలు పొందాడు. అతని వెంట వుండి, ఆ దృశ్యం చూసిన ఈ గుణాఢ్యుడనే కాపాలికుడ్ని ఆ దేవి యేం కావాలో కోరుకొమ్మంది. గుణాఢ్యుడు ఆమె రూపానికి ముగ్ధుడై "దేవీ! సర్వకాల సర్వావస్థలయందు నా దగ్గరే వుండిపోవాలమ్మా" అని కోరాడు.

ప్రద్యు : శాశ్వతంగానేనా స్వామీ!

పూర్ణ : అవును ప్రద్యుమ్నా! కాని, సరస్వతి ఒక విషయం చెప్పింది ఈ సందర్భంలో. "నన్ను శాశ్వతంగా తన బంధంలో వుంచుకోవటం అంటే సామాన్యమైన పని గాదు. దేన్లోనైనా ప్రావీణ్యత వుండాలి" అంది.

ప్రద్యు : స్వామీ! యే కళలోనైనా ఆమె చెప్పినట్లు ప్రతిభ కాని—ప్రావీణ్యం గాని—వుందా!

పూర్ణ : ఎందులోనూ కావలసింది లేకపోవటంవల్లనే, దేవి అంతర్ధానానంతరం ఈ విధంగా క్రోధం వహించాడు. మంత్ర తంత్రాలతో దేవిని తన కైవసం చేసుకోవాలనే మంత్రోపదేశం పొందాడు. ఆ విషయం ఈ చుట్టుప్రక్కల వున్న గ్రామాల్లో పెద్దలకు తెలియుందిగాను. తరువాత తరువాత మంత్రోపదేశం చేసిన గురువువద్ద ఈ గుణాఢ్యుని దుర్బుద్ధి బైటపడింది. గురువు తరిమివేశాడు—అవమానం గుణాఢ్యుణ్ణి నిలువెల్లా దహించుకుపోసాగింది. హృదయంలో క్రోధం ఉరకలు వేయసాగింది. పట్టుదల, కళ్లల్లో—చూపులో—మాటలో—బల మెక్కిపోతోంది. చివరకు "సిగ్గుతో ఈ దేశంవిడిచి ఎటో పోయాడు" అనుకున్నాం. కాని, ప్రస్తుతం జరిగిన సంఘటనబట్టి గుణాఢ్యుడు తన ప్రతిజ్ఞని, పట్టుదలని, క్రోధాన్ని, కసిని సఫలీకృతం చేసుకొన్నాడని తెలుస్తోంది...

ప్రద్యుమ్నా! కడకు ఎంత పని జరిగిందో చూశావా!...

ప్రద్యు : (దీనంగా - జాలిగా - పశ్చాత్తాపంగా) ... స్వామీ...యిక నా తప్పుకి యే జన్మలోనూ క్షమాపణ చెప్పుకోవడం సాధ్యం కాదా!

[విరామం]

[కాళరాత్రిని సూచించే కీచురాళ్ల ధ్వనులు- అడవి జంతువుల వికృతఘోషలు —క్రూర సరీసృపాల బుస బుసలు—యీదురు గాలి విసురులు—అప్పుడప్పుడు చెట్లు రాచుకొంటున్న శబ్దం ...]

సుజా : (తనలో...భీతిగా) ఏమి టీభయంకర శబ్దాలు—!...ఎక్కడనుంచి వస్తున్నయి!.. కాళరాత్రి వికిలిగా నవ్వుతోందే!... నన్ను చూసేనా!...ప్రళయం ముంచుకొని రావడం లేదుగదా!...ప్రకృతి నా మీద పగబట్టి కాటు వేయదల్చిందా!......లేక పోతే యేమిటి యిదంతా!...మాటి మాటికీ వికృతఘోషల్లో యీ అడివి నన్నెందుకు భయపెడుతోంది.........! ఏమిటది!... కదుల్తోంది......వేనిలోసనైనా పాకుతూ వుంది......బుస కొడుతోంది......నన్ను చూసేనా!...నాగుపాము కాదుగదా!... ఎటు పోను......అంతా చీకటిమయం..... నమ్మినభూమి నా పాదాలక్రింద తొలుస్తోంది...! యీదురుగాలి నన్నెందుకో కసిరికొడుతోంది......దానికి నా మీద యెందుకంత విసుగు కల్గింది...! యేమిటా దద్దరిల్లిన శబ్దం...! శబ్దంరూపంగా మారిందేమిటి! నా వైపుకే వస్తోందే!...ఎవరి దా రూపం...! పోల్చుకోలేకపోతున్నానే!... వికటాట్టహాసం చేస్తోందే!......చలదిక్తుండై చూస్తున్నాడే!......అగ్నికణాలు రాల్చుతున్నాడే!......మీదమీదకు పెద్ద పెద్ద అంగలతో వస్తున్నాడు...! కొనగోళ్లతో నా మెడను నులిమివేయడానికి చేతులు సాచిగిస్తున్నాడు......గుండెమీద రగిలిన కుంపటి సెగల్ని వెదజల్లుతోంది...! మొగమంతా జ్వలితజ్వాలగా వుందే!... యేం చేయను...! ఎట్లా తప్పుకోను...! యెటు పోను!.....దారేది.....! యెలాగ పోవాలి......! ఎటు పోవాలి......ఎట్లా పోను.......!......

మగొంతు: (కర్కశంగా—భయంకరంగా-) ఎలాగూ పోలేవు!...ఎక్కడికీ పోలేవు...! నీకు వేరొకచోట తల దాచుకొనేందుకు తావు లేదు...! నీవు చేసిన ఘోర పాపానికి బాధ్యుడివి నువ్వే! అది పరిపక్వమై నిన్ను సర్వనాశనం చేస్తుంది......యీ జన్మలో తప్పుకోదల్చినా మరో జన్మంటూ వుంటే తప్పక అనుభవించుతావ్. అవివేకివి. అందరాని అర్హతను ఆవేశంతో—క్రోధంతో—ఆశతో—పట్టుదలతో - అహంకారంతో—ఆక్రమించుకొన్నావ్......! అశ్లీలపరిచావ్...! అవమానపరిచావ్...! విపరీత బుద్ధులను విద్రోహచర్యల్ని — విద్వేష హృదయాలను-విశ్వసబాహ్యులను అథోగతికి లాక్కు పోవడానికి విలయం ఆవిర్భవించుతుంది. అప్పుడు నువ్వు అథఃపతివవు గాక తప్పదు...నీ పాపానికి ప్రాయశ్చిత్తమంటూ లేదు...యీ - జన్మకు - జీవితానికి— ఆత్మకు - క్షమాపణ లేదు...ఏ జీవి నీమీద జాలిచూపదు...దయను పంచివ్వదు. సానుభూతిని కనబర్చదు...యిక నీకు యేవిధంగానూ దారిలేదు...ఎలాగూ పోలేవు. ఎక్కడికీ పోలేవు...సుజాతా!...

సుజా : (దీనంగా) అయ్యో! ఇక నాగతేమిటి...! యేమిటీ వింతమాటలు...! యెవరూ... అనేది!...ఎక్కణ్ణుంచి వచ్చేది!... నా మీద యెందుకంత పగ - కసి, విరోధం...! నన్నెందు కిట్లా బెదిరిస్తారు...అనవసరంగా యెందుకలా అదరగొడ్తారు...నా అభిమానాన్ని చిత్రవధ యెవరూ చేసేది...! చెరగని అక్షరాలు నా గుండెమీద యెవరూ చెక్కింది?!...అయ్యో! నన్నెందు కిలా వంచిస్తారు-ఎవరూ అనేది యీమాటలు?...

[నేపథ్యంలో]

సుజాతా! యిటువంటి భయంకర స్వప్నాలకు - ఆలాపనలకు - ఆలోచనలకు - అపోహలకు - అవమానాలకు తాళుకోక తప్పదు.

నువ్వు చేసిన యీపాపపంకిలమైన - క్షుద్రమైన - హీనమైన - మ్లానమైన - పనికి - పాపానికి-విముక్తి లేని శిక్ష-ఆత్మసంక్షోభం! ఆజన్మాంతం అనుభవించక తప్పదు. అనంతమైన - అగాధమైన పరాభవం తప్పదు... తప్పదు...విద్య నభ్యసించింది వికారచేష్టలకు-వికృత కృత్యాలకు కాదు, స్వప్రయోజనానికి. క్రోధం వహించి కన్నూ మిన్నూ కానకుండా - స్వలాభంకోసం - స్వప్రయోజనంకోసం - కైవసం చేసుకొని కామితార్థం పొందాలని కలలు గన్నావే—! కలలు కన్నావే—! కాని కలకాలం కలుగబోయే- కమ్మని మోక్షానికి - ఆనందానికి - ఐహిక సుఖాలకి కారకుడివి కాలేకపోయావ్. కలవరిస్తున్నా యిప్పుడు — గతజలసేతుబంధనం వల్ల ఉపయోగం ఏమిటి! నువ్వు చేసిన యీపనివల్ల లోకంలో యెంత మార్పువచ్చి, హాహాకారాలు చెలరేగి. కోలాహల ధ్వనులు మిన్నుముట్టి - గగ్గోలు దిక్కులు పిక్కటిల్లేలాగ ఉవ్వెత్తుగాలేచి - అజ్ఞానాంధకారంలో అలమటిస్తున్నారో ఒక్కసారైనా అవలోకించావా! కనీసం అనుకోగల్గావా!...అటు చూడు...

* * *

ప్రద్యు : (ఆత్రుతగా) సునందా! వచ్చావా!

సునంద : ఏమిటా తొందర...వస్తున్నాగా...

ప్రద్యు : త్వరగా రావాలి...మరి...వెళ్ళాలి.

సునంద : అప్పుడే...యేమిటా తొందరపని...పూరికే ఆత్రుతపడతారు.

ప్రద్యు : సునందా! యిలా దగ్గరగా రా...మాట...

సునంద : ఒక్కమాటేనా!

ప్రద్యు : రద్దూ! ఆలస్యం అమృతం విషం అన్నారు. యిలా రా...దగ్గరికి...

సునంద : యేమిటామాట?

ప్రద్యు : చెప్పేదాకా పూరుకోలేవు...

సునంద : అయితే చెప్పకోండి.

ప్రద్యు : ఇలా రమ్మంటే అలా దూరంగా కూర్చుంటావేం?

సునంద : దగ్గరకే వచ్చాగా!

ప్రద్యు : దగ్గరికీ అంటే వొళ్ళో కన్నమాట ... యెప్పుడూ క్రొత్తేనా!

సునంద : తొందరగా పోయేవారికి యింకా సరసాలెందుకు? సయ్యాటలెందుకు?

ప్రద్యు : సునందా! త్వరగా పని వున్నా, మరిగి పోతుంటే మమకారాన్ని - యెలా త్రోసి రాజన గలుగుతాను. నీ కోసం నా శరీరం మన్మథాకృతి దాల్చి, నీ చిరునవ్వు కోసం నా కళ్లు ఆకర్ణాంతాలుగా విచ్చుకుంటున్నయ్. నీ అనురాగ పరాగాలకోసం నా మనసు వికసించి నీ మనసులో లయించి పోవడానికి తహతహలాడుతుంది...సునందా! నాకు నేను వ్యక్తీకరించుకోలేను- నీ మనస్సే దానికి సాక్షి. నా మురళిపై నీ కంఠస్వరాలే మృదుమధురమై పల్కుతయి - నా మురళీ రాగ సమ్మేళనంలో నీ యౌవనలావణ్యం రంగరించుకొనిపోయి వలపు వాసనలను-తలపుల, తియ్యందనాల్ని అందిస్తుంది ... నీ కడగంటి చూడ్కుల్లో నవరసభావ బంధురమైన కావ్యగానం సెలయేరై - విరితావుల విహారంలోనుంచి - కలకలమంటూ - కాకలీ స్వరాలలో కమ్మగా పాడుతూ - వుయ్యాలలూగుతూ - సాగిపోతుంది ... సాగి సాగి పోతుంది....సునందా!

సునంద : ప్రద్యుమ్నా! మనసుల్లో మన్మథావస్థలు మాటు మణుగుతయ్యా చెప్పు...!

ప్రద్యు : కనులలో కామప్రేరేపణలు కరుగుతయ్యా చెప్పు సునందా!

సునంద : ప్రద్యుమ్నా! యీ గాఢనిశాధ్వాంతంలో- నీ పురుషహృదయత్వం నా జీవితానికి తొలి వలపురేఖను చవిచూపింది... ఆనందరసైక సాగరంలో హాయిగా వున్నట్లుగా వుంది కదూ!

ప్రద్యు : ఇలా ఎంతకాలం వుండగలం సునందా!

సునంద : ప్రద్యుమ్నా! యెంతకాలమైనా వుండగల్గుతాం...

ప్రద్యు : మనసు చెరిగితే–!

సునంద : కోరిక కొక్కిరాయిలాగా కదిలితే–

ప్రద్యు : ఊహలన్నీ అపోహలే...అనుకొన్నవన్నీ అబద్ధాలే!...అనుభవించినదంతా - అవమాన పూరితమే! — చివరికి అంతా నాటకమే! మిగిలేది కూడా మిథ్యే!...

సునంద : ప్రద్యుమ్నా! ఇంతలోనే ఇంత వేదాంత మెందుకొచ్చింది...ఏమిటీ వైరాగ్య మూర్తి వలా మాటలన్నా!

ప్రద్యు : మనసులో కదిలే మాటను అణగార్చుకొన్నా మన్య మన్య దాని చిహ్నాలు బయలుపడు తూనే ఉన్నాయి.

సునంద : ప్రద్యుమ్నా! ఏమిటాకదిలే మాట...... చెప్పవ్...? దాచుకొని యెందుకలా కలవర పడటం—నా దగ్గరకూడా, ఇంకా దాపరిక మేనా! చెప్పవ్...ప్రద్యుమ్నా?

ప్రద్యు : (విచారంగా—విసుగ్తతో) చెప్పలేను సునందా...నిన్ను చూస్తూ చూస్తూ మోసం చెయ్యలేను...నా మూలంగా నిన్ను బాధ పెట్టినవాణ్ణవుతాను........చెప్పలేకపోతు న్నాను సునందా!...హృదయాన్ని చిక్క బట్టలేను...వెనకా.

సునంద : ప్రద్యుమ్నా! యేమిటది. నన్నిలా యేడ్పిం చకపోతే, ఆ చేతుల్తోనే యిక్కడే కసి తీరా చంపరాదూ! నీ మనస్సాక్షిగా నా మనస్సుని నాశనం చెయ్యరాదు...నీ చేతి వేళ్లతోనే నా హృదయాన్ని పిసికి పార వెయ్యరాదూ! నీ కొనగోళ్లతోనే నా శరీ రాన్ని చిత్రవధ చేయరాదూ! యెందుకిలా చూస్తూ చూస్తూ యేడ్పిస్తావ్ ప్రద్యుమ్నా!

ప్రద్యు : సునందా! చాలు. (నిట్టూర్పుతూ) ఇక చాలు.

సునంద : నేను బ్రతికెందుకు? నీ రూపంలేని నాకీ జీవిత మెందుకు? నీ పిలుపు పల్కించలేని నా హృదయమిదెందుకు? ఎవరికోసం ఇంకా! ప్రద్యుమ్నా! చెప్పవ్...హృదయ మిచ్చావంటివే! వలపు వీచికల్లో తూగాడా వంటివే! తియ్యని తలపులలో తేలిపోయా వంటివే! యిందుకేనా! చెప్పవా! ప్రద్యుమ్నా!

ప్రద్యు : (బరువుగా నిట్టూర్పుతూ) యేమనుకోకు సునందా! "నేను...విహారం...దాటి... కొన్నాళ్లు...దేశాటనం... చేయడానికి... వెడుతున్నా!"...అంతే...

సునంద : (విచారంగా) కొన్నాళ్లంటే—

ప్రద్యు : (ఆలోచనగా) కొన్నాళ్ళంటే......త్వర లోనే...తప్పకుండా రాగలను......విమను కోకు...సునందా...! వెడుతున్నా.

సునంద : (దీనంగా) ప్రద్యుమ్నా! నిన్ను యిన్నా ళ్లుగా చూసి మురిసిన యీకళ్ళు—నీ ప్రేమ పాశాలలో చిక్కుకున్న ఈ హృదయం— నిన్ను తలచకుండా ఎలా వుంటయి! యీ శరీరం నిన్ను వదలి యెలా వుండగల్గుతుంది ప్రద్యుమ్నా!

ప్రద్యు : (కొంచెం ధైర్యంగా) సునందా! నువ్వే అలా అంటే యెలా! ఫరవాలేదు...త్వర లోనే వస్తా...కంగారుపడకు...యేదీ ఇలా చూడు...సునందా! ఒక్కసారి...యేదీ... నవ్వు...

సునంద : (బాధగా) కుసుమించిన హృదయానికి— కనిదీరా గాటుపడింతరువాత యింకెలా నవ్వొస్తుంది.

ప్రద్యు : నీ కడసారి నవ్వే నా కార్యనిర్వహణకు సాఫల్యం కూరుస్తుంది సునందా! యేదీ... ఒక్కసారి...సంతోషంగా...

సునంద : సంతోషం నాకిక గగనపుష్పంలాంటిది... యింకెలా సాధ్యం.

ప్రద్యు : సునందా! బాధను పదేపదే నెమరువేయకు. లోతుగా పోయినకొద్దీ అన్నీ అఘాతకల్ప నలే...ఎడబాటు... జీవితాల్లో కూరుకు పోయిన ప్రేమను బలపరుస్తుంది. నామాట విను సునందా! బాధల గాథాలహరిలో మున కలు వేయకు...తప్పకుండా వస్తాగా... నాకు మాత్రం లేదూ బాధ? నిన్ను విడిచి వుండగలనో, లేదో, నీకు తెలియదా! నాది మాత్రం హృదయం కాదూ!...ఏది...

[నవ్వు—క్షణం విరామం]

మరి వెళ్ళిరానా! జాగ్రత్త...త్వరలో రాగలను ... సునందా! ... వెళ్ళొస్తా... సునందా!...

సునంద : (నిట్టూర్పుతూ) ప్రద్యుమ్నా!...

[నేపథ్యంలో]

[శుణాధ్యునికి చిత్రవిచిత్రమైన ఘట్టాల కనిపించసాగాయి-వాటిని చూస్తూ బెంబేల పడుతున్నాడు.]

ణా : (ఆశ్చర్యంతో-తడబాటుతో) ఎవరతను?... తదేకదృష్టితో అలా చూస్తున్నాడేమిటి! దేని వంక...ఏం కావాలో...?

[నేపథ్యంలో]

అతడే!... నీడలలో పడిన ప్రద్యుమ్నుడు ...నీకోసమే వెతుకుతూ బయలుదేరాడు.... రాజాజ్ఞ ననుసరించి మిహిరగుప్తుడనే శిల్పి బుద్ధవిగ్రహం తయారుచేయడంలో నిమగ్నుడై, ఒక సంవత్సరం అష్టకష్టాలకు వోర్చి, ఉదకు వికృతంగా-పోలిక లేకుండా తయారు చేశాడు. దాన్నే దీనంగా-బాధగా పరిశీలిస్తున్నాడు. కారణం యెవరో తెలుసా?

* * *

ణా : (మరింత ఆశ్చర్యంతో) ఇదేమిటి...వ్రాస్తూ వ్రాస్తూ ఆగిపోయాడు...! చిరాకెత్తిపోయాడేం...! యేమిటీ వెదుకుతున్నాడు! దేనికోసం...?

[నేపథ్యంలో]

విను...అతనెవరో తెలుసా! విఖ్యాత దార్శనిక పండితుడు యమునాచార్యులు. మీమాంస శాస్త్రానికి వ్యాఖ్యానం వ్రాస్తూండగా జ్ఞానం మందగించింది. వ్యాఖ్యకు బదులు మతి చలించి పాణిని సుబంతప్రకరణం అధ్యయనం చేస్తున్నాడు. కారణం యిప్పటికైనా యేమిటో తెలుస్తోందా!...

* * *

గుణా : (కలవరపాటుతో) ఎవరీయన!...ఆ శిలాఫలకంమీద ఏమిటా పిచ్చిగీతలు - వెర్రి వ్రాతలు...ముద్ద ముద్దగా రంగులు...!

[నేపథ్యంలో]

సరిగ్గా చూడు గుణాఢ్యా! కనబడుతోంది అదే బౌద్ధ విహారం. చిత్రకళా సిద్ధహస్తులు వసువ్రతులవారాయన. గీసేది "బుద్ధుడు—సుజాత" అనే చిత్రాన్ని. పూర్తిరూపం యెలా తెప్పించాలో తెలియక తికమకలు పడి విరక్తి చెందాడు...దానికీ ముఖ్య కారణం గమనించావా!

గుణా : (కంగారుతో) ఏమిటో... తెలియటం లేదు. ...యివన్నీ కలగోలుగా చెప్పుతూంటే నాకేమో భయంగా వుంది......నామతి పోతోంది...నా హృదయమంతా అవమానాగ్నిజ్వాలల్లో దహించుకునిపోతోంది.

మగగొంతు: గుణాఢ్యా! అలాగే వుంటుం, తప్పుచేసినప్పుడు తనకు తానే తపనబడుతూ వుండటం సహజం. అది ఆత్మవంచనకు సాక్షి.

* * * *

[నేపథ్యంలో]

గుణాఢ్యునికోసం ప్రద్యుమ్నుడు కాంచీ, ఉత్తర కోసల, అవంతి, మగధ, తక్షశిల, మొదలగు దేశాలలో—అనేక పట్టణాలలో—గ్రామాలలో అన్వేషిస్తూ చివరకు ఊరు విల్వ అనే గ్రామానికి వెలుపల వున్న ఒక పెద్ద చెట్టు క్రిందకు చేరుకున్నాడు. అప్పటికి సాయంకాలం కావొచ్చింది. ఆ గ్రామానికి చుట్టు వరిపొలాలు. బంగారు రంగుతో పంట మెరుస్తోంది. సమీపంలో కలువ పూలతోనూ — తామర పూలతోనూ నిండిన జలాశయం వుంది. అందులో అడవి హంసలు తిరుగాడుతున్నాయి. ఆ చెట్టు గ్రామానికి-అడవికి సరిహద్దు. చుట్టూ చిన్న చిన్న పర్వతాల వరుస. వాటిమీదనుంచి గలగలమంటూ ప్రవహించే ఒక సెలయేరు ప్రద్యుమ్నుడు యీ రమణీయ ప్రకృతిని కలయ చూస్తూండగా ఒక సుందర లావణ్య సుకుమార రమాలలామ చంకన కడవనిడుకొని, యెదురుగా వున్న పర్వతాన్నుంచి దిగి వస్తోంది. చూశాడు ప్రద్యుమ్నుడు—అతని కళ్ళల్లో ఆమె సౌందర్యం మెరిసిపోతోంది. అనుమానం తీరిపోయింది. హృదయం అనేక భావాలతో కల్లోలమైంది. ఆమె దిగి జలాశయందగ్గరకే వస్తోంది. ఆనాడు భద్రావతీ నదీ తీరాన ఒంటరిగా కనిపించిన దేవి సరస్వతిలాగే వుంది. అభావమే నిశ్చయం చేసుకొన్నాడు. ఎన్నో యిటువంటి సాయంకాలాలు యీ నిశ్చయానికి కారణభూతాలైనయి...యీ చెట్టుదగ్గర వుంటున్న కాలంలోనే......... భావంలో భామా హృది కనిపించ సాగింది. ప్రద్యుమ్నుడుకి. ఒకనాడు...!

[సాయంకాలాన్ని సూచించే సంగీతపు ధ్వని—పక్షులు రెక్కలు కొట్టుకొంటున్న శబ్దం—అడుగులు—నీరు కదిలిన చప్పుడు—రొప్పు...మన్న మన్న వూపిరి బిగపట్టి వది లిన శబ్దం—ఆయాసం...]

సరస్వతీదేవి : (రొప్పుతో) నాకు ఆ పూవు కోసి స్తావా! అందటం లేదు.

ప్రద్యు : అలాగే... (అడుగుల చప్పుడు) (నీళ్లు కది లిన చప్పుడు.)

సరస్వ : ఇందాకణ్నుంచీ అవస్థపడుతున్నా దాని కోసం..అందినట్లే అంది చేజారిపోతోంది.. చూస్తూనే వున్నావుగా!—

ప్రద్యు : ఆ...ఆ...! చూస్తూనేవున్నా! ఇదిగో... అందుకోండి....

సరస్వ : ఎంత మంచివాడివి...అడగంగానే సాయం చేశావు...మా యింటికి వెళదాం వస్తావా!...

ప్రద్యు : రావడానికేం ... వస్తాను ... మరి ... ఒక సహాయం చేస్తారా?

సరస్వ : తప్పకుండా చేస్తా! యేమిటది?... చెప్పు.!

ప్రద్యు : మరేం లేదూ! ఆకలవుతోంది...అంతే!...

సరస్వ : ఆకలవుతోందా! ఆ సంగతి ముందెందుకు చెప్పలేదు!...బయటికి రా యిక... కోసిన పూలు చాలు..నిన్ను అనవసరంగా కోరానే సాయం...రా బయటికి...

ప్రద్యు : ఫరవాలేదు...కోసిశాగా!..యిదిగో! యీ కాసిని కూడా అందుకోండి.

[అడుగుల చప్పుడు]

సరస్వ : నువ్వెవరివో నాకు తెలియదుగాని, ఒకటడు గుతా చెప్తావా?

ప్రద్యు : అడగండి!...అలాగే!

సరస్వ : నువ్వు రోజూ ఆ చెట్టుక్రింద ఎలాగో కూర్చుంటావ్ గదూ.

ప్రద్యు : తమరుకూడా యిక్కడికి నీటికి వస్తూంటారు గదూ!

సరస్వ : రాబట్టే చూశాను... చూడబట్టేగా అడి గాను...

ప్రద్యు : అడిగారు కాబట్టే చెప్పానుగదండీ! అయితే మీ యిల్లెక్కడ?

సరస్వ : మా యిల్లా! కనబడుతోందే పర్వతం..దాని మీద ... ఆకలవుతోందనంటున్నావ్ గా... నా వెంటరా...తింటానికేమైనా పెడ్తాను.

[నడుస్తున్న శబ్దం]

ప్రద్యు : క్షమించండి! తమరు ఒంటరిగానే వుంట న్నారా!

సరస్వ : (విచారంగా) లేదు ... ఒక సన్యాసి నన్నిక్కడకు తీసుకొచ్చాడు...

ప్రద్యు : ఏం చేస్తూంటాడు? ఆయన.

సరస్వ : ఏమో! నాకు తెలియదు. తరచు గామాన్ర(?) వస్తూ — పోతూ వుంటాడు ... అన్నట్లు ఆకలవుతోందన్నావ్ గా..విప్పపూపానీయం యివ్వనా! త్రాగతావా!...

[త్రాగిన చప్పుడు...]

ఎలా వుంది?

ప్రద్యు : ఎలాగేమిటి? అమృతంలాగా వుంది. యిటు వంటిది యింతవరకు నా జన్మలో రుచి చూడలేదు.

సరస్వ : అంత బాగుందా! నిజంగానా!

ప్రద్యు : నిజమే నమ్మా! (ఆలోచనగా) ఆచార్య పూర్ణవర్ధనులవారు చెప్పిందీ- నేను చూసిందీ అక్షరాలా నిజం. యీమె తప్పకుండా సర్వవిద్యాసముచ్చయపాత్రి సరస్వతే! యింతకు ముందెక్కడుందో!...

సరస్వ : ఏమిటీ అలా ఆలోచిస్తూ—నీలో నువ్వేదో గొణుక్కుంటున్నావ్!

ప్రద్యు : అబ్బే! ఏమీలేదండీ! వూరికే...యేదో!... గుర్తొచ్చి!

సరస్వ : యేమీ లేకపోతే యెందు కనుకొంటావు?

ప్రద్యు : ఆ....! యేదో చిన్న సందేహం! వస్తే...

సరస్వ : ఏమిటది! నాకు చెప్పకూడదా!

ప్రద్యు : మరేం లేదూ... "ఇంతకు ముందెక్కడుండే వారోనని."

సరస్వ : అదా! సందేహం...నాకంత బాగా గుర్తు లేదు...(కొంచెం ఆగి) ఆ...గుర్తొచ్చింది... విదిశమార్గంలో...ఒక జీర్ణదేవాలయంలో... వుండేదాన్ని. అక్కణ్ణుంచే యీ సన్యాసి నన్ను తీసికొచ్చాడు. అప్పట్నించే ఇక్కడ.

ప్రద్యు : (కొంచెం ఆగి) సరే ... మరి వెళ్లొస్తాను ... పొద్దు కూకిపోయింది... సెలవిస్తారా!

సరస్వ : (గాద్గదికంతో — జాలిగా) వెడతావా!... వెళ్లొద్దు...! నువ్వు వెడితే నాకేం తోచదు...

యీ రాత్రి యిక్కడే వుండిపోవాలి... కలువరేకుల పాయసం వండి పెడతా! కమ్మగా వుంటుంది! తెల్లారింతరువాత పిలయితే వెళ్ళువుగాని... నా మాట విను... వుండిపో...!

[విరామం]

(ఒకటి — రెండు నిముషాల అనంతరం)

ప్రద్యు : దేవీ! యీ కీకారణ్యంలో రాత్రిపూట ఒంటరిగా వుంటూంటే భయంగా లేదూ!

సరస్వ : బాగా భయం వేస్తోంది! యేం చేయను! అందుకేగా పొద్దుకూకడంతోనే కుటీరం తలుపులు మూస్తాను... కాని... నిద్ర కేది పట్టదు....

ప్రద్యు : (ఆదుర్దాగా) మరి మేలుకొనే వుంటారా తెల్లవార్లూ!

సరస్వ : ఏం చేస్తాను!

ప్రద్యు : వెన్నెల రోజుల్లోనో!

సరస్వ : నాకు చీకటి — వెన్నెల రెండూ ఒకటే — అందం, ఆనందం గురించి నాకేమీ తెలియను.

ప్రద్యు : దేవీ! యీ రోజు వెన్నెలేగా! అలా ఆరు బయట కూర్చుందామా!

దేవి : వెన్నెలను ఆరుబయట కూర్చోవాలా!

ప్రద్యు : చల్లగా — హాయిగా వుంటుందికదూ! అందుకని...

దేవి : సరే... వెదురుచాప యిదుగో... వస్తున్నా పద...

ప్రద్యు : (ఆలోచనగా) ఎంత విద్రోహకరమైన పని జరిగింది...ఎంతటి మంత్రశక్తి అయినా అంత విస్మృతి కలుగజేస్తుందని కలలో కూడా అనుకోలేదే!......

* * *

[రెండు నిముషాలు వేకువను సూచిస్తూ మురళీగానం]

దేవి : తెల్లవారింది...అల్లదుగో సూర్యోదయం కూడా అయింది...అడవి హంసలు యెలా తటాకం దగ్గరకు చేరుకొంటున్నాయో చూడు...

ప్రద్యు : అవును దేవీ! మరి నే వెళ్ళిరానా!

దేవి : ఏం! అప్పుడే వెళ్ళకపోతే!

ప్రద్యు : వెళ్ళాలి దేవీ! కొంచెం పనుంది!

దేవి : అయితే సన్యాసి వచ్చింతరువాత ఒకసారి రా...

ప్రద్యు : అలాగే...దేవి...వస్తా...

* * *

[పదిహేను రోజులనంతరం దూరంనుండి దేవి కంఠంలో నుంచి సావేరిరాగం — రెండు నిముషాలు]

ప్రద్యు : ఇప్పటికి పదిహేనురోజుల్నించీ చూస్తున్నా! దేవి ఒంటరిగా కూర్చొని యేదో పాడుకొంటూ వుంటోంది యేదో వ్యక్తం గాని భావం అందులో పాతుకొనివుంది. ఆమె గొంతులో తాండవించే నాదం, నా హృదయాన్ని గిలిగింతలు పెట్టి, యే లోకాలకో తీసుకొనిపోతోంది......ఆహా!... యేమా సంగీతసుధారసం...అందులోని భావశబలత జీవుల్ని సమ్మోహింపచేస్తోంది.

[ఇంతలో నీరు కదిలిన చప్పుడు — హంసల రెక్కలు తపతపమంటున్న ధ్వనులు - మువ్వ మువ్వ — చిలుకల పలుకులు —]

ప్రద్యు : (ఉలిక్కిపడి ఆశ్చర్యంతో) ఆ...! యేమది! ఈ వేళప్పుడు స్నానంచేసేది?

[మళ్ళీ నీళ్ళ చప్పుడు]

గుణాఢ్యుడా! ... అతగాడేనా! నిజంగానా!...ఆ...! అతడే.. గుణాఢ్యుడే! ఇక్కడెందుకొచ్చాడు...! యీ గట్టు మీద సామానుకూడా అతనిదే! ఇదివరకటి బట్టలే...పాతరంగు యింకా వెలిసిపోలా! గుణాఢ్యుడికే...!...ముమ్మాటికీ ఆ కావాలితడే!

[క్షణం విరామం.]

గుణా : (తెల్లబోతూ ఆశ్చర్యంగా) నీవా!...... ఇక్కడికెలా రాగలిగావు...

ప్రద్యు : (మంద్రస్థాయిలో) మీకు తెలియదా! నిజంగా యెలాగొచ్చానో తెలియకుండా వుందా!

గుణా : (బాధగా) ప్రద్యుమ్నా! అర్థమైంది!... ఇంకా నన్ను నువ్వుకూడా అవమానపరచదల్చావా! నిన్ను మోసంచేసి నీపై వలపన్ని నీ హృదయాన్ని వంచనచేసి నీ సంగీతాన్ని నాశనం చేసినందులకు యిప్పుడు తీరని దుఃఖాన్ని అనుభవిస్తున్నా!

ప్రద్యు : (క్రోధంతో) "బాధ"- వ్యక్తిని పరిశీలిస్తుందని చెప్పారుగా! చేసినపాపం చెప్పకుంటే పోతుందా! ఎవరికర్మకు వారే బాధ్యులు. మీకు యిలాంటివన్నీ తెలియనివి కావుగా!

గుణా : ప్రద్యుమ్నా! ఎవరితో చెప్పుకొన్నా ఏమీ లేదు...నిద్రలో భయంకరస్వప్నాలు వచ్చి "నువ్వు చేసినపని మంచిదిగాదు – "దానికి శిక్ష అనంతనరకం" అని యెవరో చెప్తున్నారు. అలా చెప్పేవాళ్ళకు ఇదమిత్థమైన రూపాల్లేవు.

ప్రద్యు : (జాలిగా) గుణాఢ్యా! అసలు ఇలా ఎందుకు చేశావు...?

గుణా : (దీనంగా) నా పాపం పండటానికే నేమో! మరి. వశీకరణమంత్రంద్వారా మనిషిని బద్ధునిగా చేయగల్నగాని, ఆకర్షించుకోలేను. నాకసలు సంగీతం రాదు. నేను నువ్వనుకొన్న సూరదాసునూ కాదు. దేవి సరస్వతిని బంధించి, సర్వవిద్యల్నూ నాకిచ్చేటట్లుగా చేసుకోవాలని వాంఛ నాకుండేది. ఆ వాంఛ ఒకసారి పరాభవించబడింది. అప్పట్నుంచీ నాలో దేవిమీద క్రోధం ఏర్పడింది. దాన్ని నీ మేఘమల్హార్ రాగంవల్ల తీర్చుకోగలిగాను. నామంత్రానికి ఎంతటి శక్తివుందో ఒకసారి పరీక్షించా దీనివల్లనే. కాని యిలా చేసినందుకు నాకు బాధలు పెరగసాగాయి.

ప్రద్యు : అయితే ఇప్పుడు నీ అభిప్రాయమేమిటి?

గుణా : ఈ బాధల్ని యెలా తెగతెంపులు చేసుకోవాలో కొన్నాళ్ళవరకూ తెలియలేదు. నా గురువుగారితో మొర పెట్టుకున్నాను. ఆయన పూర్వపు మంత్రాన్ని నాశనంచేసి, యథాస్వరూపాన్నిచ్చే శక్తిని ప్రసాదించారు. ఈ శక్తిని ప్రయోగించేముందు ఈ కమండలములోని జలం దేవి పాదాలమీద చల్లేటట్లయితే బంధవిముక్తి కలుగుతుంది... కాని, నీళ్లు చల్లినవాడికి ఆపద సంభవిస్తుందని చెప్పారు. దానికి జంకుతున్నా! ప్రద్యుమ్నా!

ప్రద్యు : అందుకని దేవిని బందీగానే ఉంచదల్చారా?

గుణా : ప్రద్యుమ్నా! చూస్తూ చూస్తూ చేతులారా ఈ ఆపదకు బలికమ్మంటారా! ఈ పాపానికి అనుకొన్న వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవటము సాధ్యమేనా!—

ప్రద్యు : నీకు ధైర్యం లేదనిపిస్తోంది ... యేమిటా ఆపద?

గుణా : పసివాడివి ... ఎందుకు ఆహుతవుతావు ... కమ్మని జీవితం—యీ దేవికోసం బలిగా ఇచ్చుకోకు. అనుభవించవలసిన సుఖాలు లోకంలో ఎన్నో వున్నాయి. ఎందుకలా త్వరపడిపోతావ్! ప్రద్యుమ్నా! నా మాట విను...

ప్రద్యు : గుణాఢ్యా! ఏమిటా ఆపద...!

గుణా : చెప్పాల్సిందేనా!—తప్పదా?

ప్రద్యు : తప్పించుకోడానికి యెందుకు ప్రయత్నించాలి...అది పిరికివాడికి లక్షణం.

గుణా : అయితే సరే!...నీరు చల్లినవాడు శిలారూపంలోకి మారిపోతాడు. అందుకే దేవిని బంధించివుంచాను. కొంచెం సుఖంగానైనా యీ లోకంలో కొద్దికాలం వుందామని. కోపం తెచ్చుకోకు..కొంచెం బాగా ఆలోచించు...పసివాడవు...పదేపదే చెప్తున్నానని విసుక్కోకు...ప్రద్యుమ్నా!

ప్రద్యు : (ఆలోచనగా) ఈ విషయంలో యేమాలోచించినా నిష్ప్రయోజనమే! ఎవరూ నీళ్లు చల్లకపోతే, దేవి ఎలా విముక్తురాలవుతుంది? లోకంలో శాశ్వతంగా విద్య లేకుండా పోవాల్సిందేనా? ఆమెకు ఆత్మవిస్మృతి కలగటం లోకోపకారంగాదా! మీ స్వార్థానికని లోకాన్ని—సర్వకళల్ని— మంటగలుపుతారా! విరక్తురాల్ని చేసి మానవకోటిని మానవత్వాన్ని మటుమాయం చేస్తారా! బదులుతీర్చికోసం, నావంటి సామాన్యుడు ప్రాణాలర్పించడం ఒక పెద్ద లెక్కలోనిది కాదు... నేను నా దేవిని విముక్తురాలిగా చేయాలనే యిక్కడికి యెన్నో దేశాలు తిరుగుతూ వెతుక్కుంటూ వచ్చాను.

గుణా : అయితే—యీ పనికి అంగీకరిస్తున్నావా!

ప్రద్యు : ముమ్మాటికీ. గుణాఢ్యా! మానవుని జీవితం తుచ్ఛమైంది. స్వార్థపూరితమైంది. పద్మాల్లాంటి ఆమె పాదాలలో చిన్నముల్లు గుచ్చుకొన్నదంటే తీయడానికి, అవసరమైతే నా ప్రాణాల్ని కూడా త్యాగం చేస్తాను... పదండి....ఆ కమండలం ఇలాగివ్వండి... చల్లి నా తల్లిని విడిపించుకొంటాను.

గుణా : బాగా ఆలోచించుకొన్నావా! ప్రద్యుమ్నా!

ప్రద్యు : సావధానంగా ఆలోచించే, యీ పనికి ముందడుగు వేస్తున్నా! నాకు సుఖాలపై మమకారం లేదు...నా తల్లిని హృదయంలోనే స్థాపించుకొని ప్రేమపూరితమైన జీవితాన్ని ఆనందంగా గడుపుకొంటా... నడవండి...

గుణా : ప్రద్యుమ్నా! దీర్ఘంగా ఆలోచించుకో మరొక్కసారి! తరువాత నిన్ను రక్షించే శక్తి మరి దేనికీ లేదు.

ప్రద్యు : నాకు లేనిదాన్ని మీకు దేనికి—మీకు మళ్లే ప్రవర్తించాలనే ఆశయంకలవాణ్ని కాదు. ఆ ఆశే నాకుంటే, నా ఆనందాల నందనం దను విడిచి, నా కంటికి రెప్పలాగుండే మాతృదేవిని వదులుకొని, ఇక్కడికి కొందు కొస్తాను. నాకు పిరికితనంతో మారిపొయ్యే కంటే. నాటివల్ల లోకం నశించిపోతోంది— సర్వశోభలూ సమసిపోతాయి — పదండి... ఆలస్యం యిక అనవసరం...

[విరామం]

దేవి : (ఆత్రుతతో) రా ... రా... నిన్ను కూర్చె ఆలోచిస్తున్నా! ఆరోజునన గా పోయి మళ్లా యీరోజు కానవిపించటం! నీకు ఆ రోజున సరిగ్గా భోజనం పెట్టలేదని కోపంవచ్చిందా! నిజంగా నా కెంతో చిన్నతనం వేసింది!

ప్రద్యు : స్వామీ! (మెల్లగా) యేదా మంత్రజల కమండలం...ఇలా యివ్వండి!

గుణా : (కంగారుగా) నిజంగా యీపని చేయడా నికి సిద్ధపడుతున్నావా!

ప్రద్యు : ప్రతిసారీ నా నిశ్చయాన్ని మీకు చెప్పి వొప్పించలేను. ముందా జల మిలాఇవ్వండి!

గుణా : అయితే...ఇదిగో కమండలం...దేవి, నీటి కోసం బయలుదేరినట్లుంది ... వెళ్ళనీ ... వచ్చేటప్పుడు యెదురుగా వెళ్లి పాదాలపై అభిషేకించు (తడబాటుతో) ప్రద్యుమ్నా! యిక నే వెళుతున్నా!...సెలవా!

ప్రద్యు : దేనికి? ఎక్కడికి స్వామీ!

గుణా : ప్రద్యుమ్నా! (దీనంగా) నీ ఋణం తీర్చు కోలేను. నేను నిజంగా పిరికివాణ్ణే... యెటవన్నా పోతాను...నన్ను వెళ్లనియ్యి... దేవి జీవితప్రకరణంలో నీ పేరు చిరస్థా యిగా చెప్పుకొనేటట్లు లిఖించబడుతుంది.. నే వెళుతున్నా ప్రద్యుమ్నా ... వెడు తున్నా...వెడుతున్నా...

[విరామం]

ప్రద్యు : (ఆలోచనగా) ఇరవై సంవత్సరాలక్రితం యీ నీలాకాశంక్రిందనే జన్మించాను. మా అమ్మ కాశీలో యింట్లో కిటికీ దగ్గరగా కూర్చొని ప్రవాసియై పోయి, నాకోసం యెదురుతెన్నులు చూస్తూ, యెప్పుడొస్తానో అనుకొంటూ తహతహలాడుతూ వుంటుంది. ఆమెను యింకెలా చూడగల్గుతాను...సునంద యేం చేస్తోందో...

[అడుగుల చప్పుడు...]

దేవి : (నవ్వుతూ) యిక్కడే నిలబడున్నావే! ఆ సన్యాసి యేడీ!

ప్రద్యు : దేవీ! అతగా డెక్కడికో వెళ్ళిపోయాడు.

దేవి : (దీనంగా) ఇక రాడా! మరి.

ప్రద్యు : మాట ఎలాగో స్ఫురించాయి. రాడేమో కూడా!

దేవి : (ఆశ్చర్యంగా) ఏమిటిది...నా పాదాలకు నమస్కరిస్తున్నావ్.

ప్రద్యు : (ప్రార్థనపూర్వకంగా) దేవీ! మీ పాదధూళి తీసుకొని నమస్కారం చేస్తున్నాను. ఎంతటి అపకారం చేశానో నీకు తెలియదమ్మా! దానికి తగిన శిక్ష యీ నాడు అనుభవించబో తున్నా. అందుకని యేమాత్రం విచారించడం లేదు. కాని, నాకు స్మృతి తప్పిపోయేంత వరకు విశ్వసౌందర్యవిద్యావతిని బంధవిముక్త రాలినిగా చేసే భాగ్యం లభించినందుకు హృదయపూర్వకంగా సంతోషిస్తున్నా!

దేవి : (ఆశ్చర్యంగా) ఏమి టిపని!

ప్రద్యు : (జాలిగా) దేవీ! యింతకుముం దెక్కడ వుండేదానివో జ్ఞాపకం తెచ్చుకోవమ్మా!

దేవి : (కంగారుతో) ఎందుకూ. !విశిశమార్గంలో... [నీళ్ళు చల్లినట్లు శబ్దం...తుఫాను గాలిహోరు ...నదీతరంగాల శబ్దం... మేఘాల్లో మెరు పులు—ఉరుములు చూచాయగా మేఘ మల్హార్ రాగాలాపన - ఉన్నతమైపోతూన్న గాలి విసురులు—జేగంటల ధ్వనాలు.]

[నేపథ్యంలో]

ఉ॥ అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ
శారదచంద్రచంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుట
భూషణ రత్నదీపికా
చుంబిత దిగ్విభాగశ్రుతి సూక్తి
వివిక్త నిజ ప్రభావ భా
వాంబరవీథి విశ్రుత విహారిణి నన్
కృపజూడు భారతీ! (భాగవతమ్)

[నేపథ్యంలో]

అపూర్వ సౌందర్యమూర్తి దేవి సరస్వతి సర్వాలంకారభూషితయై ప్రద్యుమ్నుని మ్ముందు ప్రత్యక్షమైంది. ఆమె దేహంనుండి సుప్రకాశ దీధితులు ప్రసరింపసాగాయి. వీణాపాణియై, గానామృతాన్ని సర్వలోకా లకు విందుచేస్తోంది. కనులలో సంతోషం కళలకు వన్నె తెస్తోంది. హృదయంలోని

ఆనందం సహృదయాలకు ప్రమోదాన్ని కూర్చుతోంది. చిరునవ్వు తొణికిసలాడి, ప్రద్యుమ్నుణ్ని సుమనస్సులో దీవించింది.. వెంటనే కౌశిలో మిద్దెపైన కూర్చున్న తల్లి గుండెలో రక్తం చల్లబడింది. రెండు కళ్ళూ అశ్రుపూరితాలయినయి...

*　　　*　　　*

[కాలం కొంత గడిచినతర్వాత—
దూరాన్నుంచి- మందమందంగా వినబడుతూ వచ్చే మేఘమల్హార్ రాగాలాపనాస్రవంతిని గుర్తుపట్టి...]

సునంద : (ఆశ్చర్యంగా-ఆనందంగా) ఎవరిదా వేణు గీతి...నూతనంగా వచ్చి నా ప్రద్యుమ్నుణ్ని గుర్తు చేస్తోంది...! నన్ను రమ్మనమని పిలుస్తున్నాడా! నన్ను మరిచాననుకున్నా సుమా!..అదిగో! యింకా బాగా వినబడుతోంది...! నన్నే....పిలుస్తున్నాడు...ఆ రాగం నాకిష్టమైందని అతనికి తెలుసు....! అందుకే రమ్మంటున్నాడు...ఎటు వెళ్లాలి.

[అడుగుల చప్పుడు]

పూర్ణ : (మృదువుగా) సునందా!

సునంద : (ఉలిక్కిపడి)...ఆ....యేం...స్వామీ!

పూర్ణ : (కరుణాత్మకంగా) ఎవరికోసం పండువెన్నెల రాత్రులలో యింకా నీ విరహవేదన... దేనికీ! యీవూహా కల్పనలు...!

సునంద : (బేలగా) అదేమిటి స్వామీ! నా ప్రద్యుమ్నునికోసమే! ఇప్పుడే అతను నన్ను రమ్మని మురళికూడా వాయించాడు....ఆ మురళిపై ఊయలలూగే మేఘమల్హార్ రాగములో అతని హృదయం నన్ను మరిమరీ పిల్చింది...యెటు వెళ్లాలో- ఎలా వెళ్లాలో దిక్కుతోచటం లేదు.

పూర్ణ : (జాలిగా) సునందా! యిక నీకా అదృష్టం దూరమైంది. నీ మనస్సులో వున్న మనోహరుడు కాలవశాన మారిపోయాడు. అతడు ఆ కీకారణ్యంలో పర్వతశిఖరంమీద వెదురు పొదలమధ్య అర్ధనగ్న శిలామూర్తియై వున్నాడు. నిస్తబ్ధపు నిశీథిలో ఆ వెదురు కొమ్మలు అతని హృదయంమీద కప్పుకొని గాలికి వూగిసలాడుతూ నీ ప్రద్యుమ్నుణ్ణి జ్ఞప్తికి తెచ్చేందుకు మేఘమల్హార్ రాగాన్ని ఆలాపిస్తున్నయి. అతని చెట్ల ఆకులతో అతని ముఖం కప్పుకొనిపోయింది......దేవి బంధవిముక్తురాలైంది. దివ్యతేజోవిరాజమానంగా సాక్షాత్కరించి, సరస్వతి దీవించింది...సునందా యింకా దేనికీ యీ విరహదీక్ష....

సునంద : (గాద్గదికంగా) స్వామీ! ఆ వెదురు వనం యెక్కడ?..... యెటువైపు ఆ శిలా విగ్రహం?...యెంతదూరం వుంటుంది...? ఎలా వెళ్ళాలి?...చెప్పరూ...(దీనంగా) నా ప్రియుణ్ణి యెడబాసి యెలా వుండగలను...అతని మధుర మురళీగానంలో మేఘమల్హార్ రాగాలాపనా స్రవంతిలో నాకు పారవశ్యం లేదా!...స్వామీ! ప్రద్యుమ్నుణ్ణి మరిచిపోలేను...అతడు మరుపుకిరాని మన్మథుడు......యిక నా బ్రతుకు — ఎవరికోసం వేచివుండనూ! స్వామీ! కడసారి చూపులకైనా కొరగాకుండాపోయానా!...

పూర్ణ : సునందా! విచారపడి యేమిటి లాభం? అతడు లోకోత్తరపురుషుడైనవాడు... మేఘమల్హార్ రాగప్రశంసలో అతనికి చరితార్థత కల్గింది. సరస్వతీదేవిమాహాత్మ్యప్రకరణంలో ప్రద్యుమ్నుని పేరు సువర్ణాక్షరాల్లో వ్రాయబడుతుంది...యీ నిరర్థకపు ఊహా కల్పనలు — స్వప్నాలు శాశ్వతం కావు. యిలా చూడు సునందా! అతడెవరో తెలుసుగా!...కరుణాస్వరూపుడు...బోధిసత్వుడు...అతనివద్ద జీవులకి శాంతి — దయ — జాలి — సానుభూతి — అహింస లభిస్తయి. పద......ఒక్కసారి దర్శించుకో!...... హృదయంలో రేగిన అశాంతి తగ్గిపోతుంది.! పద......

సునంద : (దీనంగా) స్వామీ!......

[శరణత్రయాన్ని ఉచ్చరిస్తూ బౌద్ధ భిక్షువులు — జేగంటల ధ్వానాలు — మేఘమల్హార్ రాగాలాపనాసూచనలు క్రమేపీ హెచ్చి — తగ్గుతూంటాయి.]

---

* విభూతిభూషణబంద్యోపాధ్యాయ రచన ఆధారంగా

కవి: కావ్యము

శ్రీ హన్మనగుత్తి రాధాకృష్ణశర్మ

జగత్సృష్టి యందు సుందరములు, సుందరతరములు, వికృతములునగు వస్తువు లెన్నియో గలవు. ప్రతిమానవుఁడును వానిఁ గాంచుచున్నాఁడు. కాని, కవియొక్క దృష్టి వేరు. సామాన్యుని దృష్టి వేరు. ఒక ప్రవాహమును చూచి సామాన్యుఁడు "నీరు వేగముగ ప్రవహించుచున్న" దని చెప్పును. కవిమాత్ర మద్యది పరమేశ్వరుని దయారసప్రవాహ మనును. ఒక తీగ సామాన్యుని చూపున కది తీగమాత్రమే యగును. కవి దృష్టి కెం దన్నను! అది సుందరమైన వనితయొక్క శరీరముగను, దానిపువ్వులు అందములగు నేత్రములుగా నగుపించును. కావున లోకమునందెల్లరును చూచు సామాన్య వస్తువులే కవియొక్క ప్రతిభావిశేషమున నాతనికి, విలక్షణముగ గోచరించును. కవి తన హృదయమునకుఁ దోచు నొకవిషయమును పలువిధములుగ మాటిమాటికి చిత్రణచేసికొని తద్విషయమును కావ్యరూపముగ వెలువరించును. ఏదైన నొకదృశ్యమును కవి చూచినంతనే చిత్రింపఁజాలఁడు. కాని వాల్మీకి ఋషికి మాత్రము క్రౌంచద్వంద్వ వియోగదృశ్యమును గాంచినంతనే:

"మానిషాద ప్రతిష్ఠాం త్వ
మగమశ్శాశ్వతీస్సమాః।
యత్క్రౌంచమిథునా దేక
మవధీః కామమోహితమ్"

అని శ్లోకరూపమున వెలువడినది. వాల్మీకి ప్రతిభావంతుఁడు, అంతర్ముఖుఁడును గావున క్రౌంచద్వంద్వ వియోగమును చిత్రించుకొనుటకు దానియందు లీనుఁడైపోవుట కంత శీఘ్రముగ వీలు గలిగినది. ఆరూఢుఁడగు యోగి తనకుఁ గావలసినక్షణమందే బాహ్యప్రపంచమును మఱచి సమాధిఁ బొంది, బ్రహ్మానందము ననుభవించునట్లు, మహాకవియు తలఁచుకొన్న క్షణమునందే విషయములో లీనుఁడై కావ్యరచన మొనర్పఁగలఁడు. అపుడాతఁడు పొంగివచ్చు తన కవనవేగము నాపుకొనఁజాలఁడు. అతనికి భావ మెట్లు చెప్పిన యట్లు నడచును. మహర్షి వాల్మీకి యట్టివాఁడు గనుక క్రౌంచద్వంద్వ వియోగమును గాంచినంతనే, ఆ విషయముగ శ్లోకరచన మొనర్పఁగలిగెను.

ప్రతిభావంతుఁడగు కవి, ఎట్టివస్తువును గ్రహించినను సుందరముగ చేయును. వస్తువునందలి గౌరవము ననుసరించియే కావ్య గౌరవ మేర్పడును. వస్తువునందలి యొక్క ప్రశస్త్యమువలన గదా! "ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే" యను ఖ్యాతి భవభూతి రచనకుఁ గల్గినది. ఒకవేళ వస్తువు లోకోత్తరము గాకపోయినను, కవి తన కృత్యమును చక్కగా నిర్వహించును. అచేతనములకుఁ జేతనత్వమును గల్పించును. చెత్తకుప్పలును, బంగరుబొమ్మలగు పడుచులును, కవియొక్క కావ్యమునందు సమానముగ సుందరమూర్తులుగనే భాసింతురు. నవ్యకవులు సుందర వస్తువులను గూర్చియే కవి వ్రాయవలె నందురు. సుందరమైన దెప్పుడును సుందరమే! సుందరము గాని దానిని సుందరముగఁ జేయుటయందే కవియొక్క ప్రత్యేకశక్తి గలదు. "తృణేऽపి కార్యం భవ తీశ్వరాణాం" అన్నట్లు కవి స్వీకరింపఁదగని వస్తువు సృష్టియందు లేదు. కవిత్వ మొక్క కళ గావున, కళ ప్రకృతి కనుకరణమే యగుటవలన, కళయొక్క ప్రయోజన మానందమే!

అనుకరణ మానందమును గొలుపును. (Imitation begets pleasure) అన్నట్లు లోకమునందువలెగాక కావ్యమునందలి, యసుందరవస్తువులవలనను, ఆనందమే కల్గును. ఈ క్రింది దశరూపక శ్లోకమును గనుఁడు:

"రమ్యం జుగుప్సిత ముదార మథాపి నీచం
ఉగ్రం ప్రసాదిగహనం వికృతంచ వస్తు
యద్వాప్యవస్తు కవిభావకభావ్యమానం
తన్నాస్తి యన్నరసభావ ముపైతి లోకే"

పై శ్లోకము ననుసరించి కవి సుందరముగు వస్తువులనుగూర్చియే వ్రాయవలెననుట యనుచితము. ఆంగ్లమునందుగూడ నిట్టి యభిప్రాయమే గలదు.

"Poetry turns all things to loveliness" It exalts the beauty of that which is most beautiful and it adds beauty to that which is deformed—SHELLY.

[కావ్య మెల్లవస్తువులను సుందరముగ మార్చును. అది సుందరములగు వస్తువులను సుందరతమములుగ జేయును. వికృతములను సుందరములుగ జేయును.]

ప్రథమమున "కవి ర్మనీషీ పరిభూః స్వయంభూః" అని కవిశబ్దము పరమాత్మపరముగ వైదికమంత్రములందు గానవచ్చుచున్నది. క్రమముగ నా పదము పరమాత్మయొక్క సాక్షాత్కారమును బొందిన "ఋషి" పరముగ వ్యవహారమునకు వచ్చినది. సాక్షాద్ద్రష్టలగు వైదిక ఋషులు కవులు. వారికావ్యము లుపనిషత్తులు. ఆద్యులగు వైదిక కవులును, లౌకికులగు వాల్మీకివ్యాసాదులు ఋషులగుటచేతను, దివ్యచక్షువులతో వారు లోకరహస్య మెఱింగినవారగుటచేతను, లోకోత్తరవర్ణనాత్మకముగ వారి కబ్బములు భాసిల్లుటచేతను, "నా నృషిః కురుతే కావ్యమ్", "కవయః క్రాంతదర్శినః" అను లోకోక్తులు గలిగినవి. కనుకనే అప్పకవి:

క॥ ఇమ్మహిని మునులచే విల
సెమ్మను కావ్యములు "నా నృషిః కురుతే కా
వ్యమ్మను వచనార్థంబుల్
సమ్మతిఁ గలివేళ సుకవిజనులే మానల్"

అని వచించెను. కాని కేవలము ఋషి కావ్యరచన మొనర్పలేఁడు. "హేమచంద్రుఁడు" "భట్టతౌతుని" శ్లోకముల మూఁడింటి నీ విషయమున సంగ్రహించెను:

"నానృషిః కవి రిత్యుక్త మృషిశ్చ కిలదర్శనాత్
విచిత్రభావ ధర్మాంశ తత్త్వ ప్రఖ్యాచ దర్శనమ్
సతత్త్వదర్శనాదేవ శాస్త్రేషు పఠితః కవిః
దర్శనా ద్వర్ణనా చ్చాథ రూఢా లోకే కవిశ్రుతిః
తథా హి దర్శనే స్వచ్ఛే నిత్యేప్యాదికవేర్మునేః
నోదితా కవితా లోకే యావజ్జాతా న వర్ణనా"

ఋషిగానివాఁడు కవిగాడని చెప్పఁబడెను. ఋషి యనగా ద్రష్ట. దర్శన మన విచిత్రమైన వస్తువులయొక్క ధర్మాంశముల నెఱుఁగుట. దీనికే ప్రతిభ యని పేరు. అట్టి తత్త్వదర్శనము గలవానినే శాస్త్రములు కవి యని పేర్కొనుచున్నవి. లోకమున దర్శనము, వర్ణనము నీ రెంటిఁటివలన "కవి" యని ప్రసిద్ధి వహించును. వాల్మీకి మొదట ద్రష్టయైనను వర్ణన సేయునంతకుఁ గవిగాఁ బరిగణింపఁ బడఁడయ్యెను. కావున దీనివలన కవి ద్రష్టయైనను వర్ణనానిపుణుఁడు గావలయునని తెలియుచున్నది. ఈ యభిప్రాయము "భామహుఁ" డిట్లు తెలిపెను.

"ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా
తదనుప్రాణనా జీవే ద్వర్ణనా నిపుణః కవిః"

(నవనవోన్మేషశాలిని యగు ప్రజ్ఞ "ప్రతిభ" యనఁబడును. తదాశ్రితుఁడై వర్ణనము సేయువాఁడు కవి)

ఆనందవర్ధనుఁడు:

"అపారే కావ్యసంసారే కవి రేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే
శృంగారీచేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్
స ఏవ వీతరాగశ్చేత్ నీరసం జాత మేవ తత్
భావా నచేతనా నపి చేతనవ చ్చేతనా నచేతనవత్
వ్యవహారయతి యథేష్టం సుకవిః కావ్యే స్వతంత్రతయా"

[అపారమైన కావ్యప్రపంచమునకుఁ గవియే బ్రహ్మ. అనఁగా సృష్టికర్త. అతఁడు తన యిచ్ఛానుసారముగ లోకమును మార్చును. శృంగారియైన లోకమును శృంగారమయము నొనర్చును. విరాగియైన నీరసవంతముగఁ జేయును. అచేతనములను చేతనములుగను, చేతనముల నచేతనములుగను స్వతంత్రుఁడుగాఁ గవి కబ్బమున వర్తించునని కవినిఁగూర్చి తెలిపెను.]

కావున వీరి వాక్యముల ననుసరించి కవి "ప్రతిభావంతుఁడగు కావ్యప్రపంచమును సృజించు బ్రహ్మ" యని తేలినది. కవి ప్రతిభావంతుఁడైననే లోకమును రసమయముఁగాఁగాని, నీరసమయముఁగాఁగాని చేయఁ గల డిట్టి. కనుకనే ("కావ్యంతు జాతుజాయేత కస్యచిత్ప్రతిభావతః") ఒకానొక ప్రతిభావంతునివలననే యట్టికావ్య ముదయించుననునార్యోక్తి గల్గినది. కవి యనఁగా క్రాంతదర్శియై, ప్రతిభావంతుఁడై, వర్ణనాదినిపుణుఁడై యుండవలయును.

"కావ్యమీమాంస"యందీ క్రిందివిధముగ కవులు విభాగింపఁబడియున్నారు. 1 శాస్త్రకవి, 2 కావ్యకవి, 3 ఉభయకవి, వారిలో నుత్తరోత్తరుఁడు

ష్టుఁడు. ఉభయకవి నే "విద్వత్కవి" యందురు. విద్వత్కవయః కవయః కేవల కవయస్తు కేవలం వయః" అనఁగా ప్రతిభావ్యుత్పత్తులు రెండునుఁ గల డే విద్వత్కవి. అట్టివాఁడే లోకోత్తరవర్ణనా పుణుఁడు.

కావ్యమన నేమి?

పై విషయమునుగూర్చి చెప్పుటకు ముందుగ కావ్య" మను దానినిగూర్చి సంస్కృతాలంకారి ల నిర్వచనముల నుటంకింతును.

"శబ్దార్థౌ సహితౌ కావ్యమ్"అని భామహుఁడు.

"గుణాలంకార యుక్తార్థౌ కావ్య" మని మనుఁడు.

"అదోషౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" ని మమ్మటుఁడు,

"నిర్దోషం గుణాలంకార రసవత్ వాక్యమ్ కావ్య"మని భోజుఁడు.

"గుణాలంకార రీతి రసోపేతః సాధు శబ్దార్థ సందర్భః కావ్య" మని వాగ్భటుఁడును.

"నిర్దోషం గుణాలంకారరీతివృత్తిమ ద్వాక్యం కావ్య" మని పీయూషవర్షుఁడు.

"రసాదిమ ద్వాక్యం కావ్య" మని శౌద్ధోదని యను నాలంకారికుఁడు.

"వాక్యంరసాత్మకం కావ్య"మని విశ్వనాథుఁడు.

"ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ కావ్య"మనిదండి.

"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య"మని జగన్నాథుఁడు.

ఇంకను మఱికొందఱు. "కవనీయం కావ్య" మని లోచనకారుఁడును, "కవయతీతి కవిః తస్యకర్మ కావ్య"మ్మని విద్యాధరుఁడును, "కాతిశబ్దాయ తే విమ్ము శతి రసభావా న్నితి కవిః, తస్య కర్మ కావ్య "మ్మని భట్టగోపాలుఁడును, "లోకోత్తరవర్ణనానిపుణ కవి కర్మ కావ్య" మని మమ్మటాచార్యుఁడును జెప్పియుండిరి.

ఈ పైఁ జెప్పబడిన నిర్వచనములం దంతటను కవి కర్మ ప్రధానముగఁ జెప్పఁబడియున్నను నింగుఁ గవి లక్షణ మిమిడియే యున్నది. వీనిలోని "లోకోత్తర వర్ణనానిపుణకవికర్మ కావ్య"మ్మనుదానినిఁబట్టి లోకోత్తరవర్ణనానిపుణుఁడే కవియని,వానియొక్క "కర్మ"యే "కావ్య"మని తేలినది. లోకోత్తరవర్ణనానైపుణి యను నది ప్రతిభాలభ్యము. ప్రతిభ దేవతానుగ్రహ సంపాద్యము. దేవతానుగ్రహము తపస్సంపాద్యము. తపస్సు ఋషికర్మ. గనుక నే "నానృషిః కురుతే కావ్యమ్" "కవయః క్రాంతిదర్శినః" యను లోకోక్తులు గల్గినవి.

పై విధముగ ఋషియయినవానియొక్క కర్మయే కావ్యమై లోకమునం దధికమయిన ప్రచార మొందు నని తెలియుచున్నది. అట్టి కవిత్వము రాకున్న నూఱ కుండవలె నే గాని కుకవి మాత్రము కాఁగూడదు.

"నాకవిత్వ మధర్మాయ, మృత్తయే దండనాయ చ
కుకవిత్వం పున స్సాక్షా న్మృతి మాహు ర్మనీషిణః.

[కవి గాకుండిన నెట్టి యధర్మము, లేక పాపము సంభవింపదు. కవి గానియెడల మనుష్యుఁడు చావఁడు రాజాదులవలన దండనము రాదు. కాని కుకవి యగుట వలన కేవలము మృత్యువే.]

ఇఁక నా ప్రతిభ యనునది కారయిత్రి, భావయిత్రి యని రెండు విధములుగ కావ్యమీమాంస కారుఁడు వక్కాణించెను. కవిచేఁ గావ్యమును వ్రాయించుశక్తి కారయిత్రి. పాఠకునిచేఁ గావ్యము యొక్క యర్థమును భావింపఁ జేయునది భావయిత్రి. కాబట్టి కవికివలె నే పాఠకునకు ప్రతిభ యుండవలెను. లేకున్నచో గవిభావమును గ్రహింపలేకపోవును. ప్రతిభాతారతమ్యము ననుసరించియే "అప్పకవి" చెప్పినట్లు కవులలో నీ క్రింది భేదములు నేర్పడినవి.

ఆ॥వె॥ వినుతి గాంచు రిల వివేకి, వాచక, రాచి
కార్థ, శిల్పి, భూష, ణార్థు లనఁగ
మార్దవానుగతి సమాహ్వయుఁడును నాఁగఁ
గవులు సప్త నామకములతోడ.

కావ్యమున కుండవలసిన లక్షణములు
ఆలంకారికుల అభిప్రాయములు:

"సంగీత మపి సాహిత్యమ్ సరస్వత్యాః స్తనద్వయమ్" అన్నట్లు వాగ్దేవికి సంగీత సాహిత్యములు రెండును స్తనద్వయముగ నొప్పియున్నవి. సంగీతము నందెంత మోహనశక్తి గలదో, సాహిత్యమునందును, అంతటి మోహనశక్తి గలదు. రమారమి రెండు వేల సంవత్సరములనాఁడే "భరతుఁ"డను మహర్షి "నాట్య శాస్త్ర"మను గ్రంథమును రచించెను. అదియే సాహిత్య

శాస్త్రమున ప్రథమగ్రంథము. ఇది కేవలము రూపకములనుగూర్చి వాని భేదములనుగూర్చి చర్చించును. భరతునిదృష్టిలో గావ్యమన నాటకమే. నాటకములకే "రూపకము"లని వేరు పేరు. ఈతని మతమున గావ్యమునకు శరీర మితివృత్తమే. "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్"

భామహమతము

భరతునికి బిమ్మట నైదవ శతాబ్దిలోని "భామహ" నామకాలంకారికుడు శ్రవ్యకావ్యచర్చను సాగించి "శబ్దార్థౌ సహితౌ కావ్యమ్." కావ్యమునకు శబ్దార్థములు శరీరమని, స్త్రీ పురుషాదుల శరీరసౌందర్యమున కలంకారములు ప్రాధాన్యమైనట్లు, కావ్యశరీరమును వక్రోక్త్యాద్యలంకారములు పెంపొనరూర్చుననియు, కావ్యమున కలంకారములు ప్రాధాన్యమని నిర్వచించెను.

దండిమతము

ఆరవ శతాబ్దివాడగు "దండి" కావ్యసిద్ధాంతము నిట్లు ప్రతిపాదించెను. "శరీరం తావ దిష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ" (రమణీయార్థముగల పదసంఘాతము కావ్యశరీరము) ఈతని మతమున రమణీయార్థభూషితమగు శబ్దమే కావ్యము.

వామనమతము

తరువాత తొమ్మిదవ శతాబ్దిలోని వామనుడు "కావ్యాత్మ"ను గూర్చి విచారించి "రీతిరాత్మా కావ్యస్య" అని సిద్ధాంతీకరించెను. శరీరమున కాత్మవలె కావ్యశరీరమున కాత్మ యుండుననియు, అది "రీతి" యని యీతని మతము. రీతి కావ్యమున కాత్మయని చెప్పి భామహుని యలంకారసిద్ధాంతమును, దండిగుణసిద్ధాంతమును దన రీతితో సమన్వయపఱచెను. ఎట్లన? కావ్యాత్మ రీతి. రీతి గుణములచే నేర్పడును. అలంకారములు కావ్యసౌందర్యమును వృద్ధిచేయును. (కావ్యాలంకారసంగ్రహమితని గ్రంథము.)

ఆనందవర్ధనమతము

వామనునకు దరువాత నీతడు సాహిత్యక్షేత్రమున కరుదెంచెను. "ధ్వన్యాలోక" మను గ్రంథమును రచించెను. ఈతనిదొక క్రొత్త సిద్ధాంతము. కావ్యశరీరమున కాత్మ ధ్వని. అది వస్త్వలంకార రసరూపము లనగా వస్త్వలంకార రసధ్వనులని త్రివిధములు. ఈ మూఁటిలో వస్త్వలంకారధ్వనులకన్న రసధ్వని సర్వశ్రేష్ఠము. అయినను వస్త్వలంకారధ్వను లధమములు గావు. కావ్యమున కలంకారములు ముఖ్యాంగములు గావు. ఇతడు ధ్వనినే ప్రాధాన్యముగ నిర్వచించెను.

అభినవగుప్తమతము

ఆనందవర్ధనునికి బిమ్మట నభినవగుప్తుడను నొ యాలంకారికుడు సాహిత్యరంగమునకు వచ్చెను. ఈతడానందవర్ధనుని ధ్వనిసిద్ధాంతము నంగీకరించి యాతని "ధ్వన్యాలోకము" నకు "లోచన" మను వ్యాఖ్య వ్రాసెను. "రసేనైవ సర్వం జీవతి కావ్యమ్. నహి రసశూన్యం కావ్యం కించి దస్తి. రసయేవ వస్తుతః ఆత్మా. వస్త్వలంకార ధ్వనీతు సర్వథా రసం ప్రతిపర్యవస్యేతే" (రసముచేతనే కావ్యము జీవించును. రసశూన్యముగు కావ్య ముండెదు. మూఁడు విధములగు ధ్వనులలో రసధ్వనియే కావ్యాత్మ. వస్త్వలంకారములుగూడ రసపర్యవసాయులు గావలయును) ఈ సిద్ధాంతమే విశ్వనాథుని "వాక్యం రసాత్మకమ్ కావ్య"మ్మను కావ్యలక్షణమును లేవదీయించినది.

మహిమభట్టమతము

అభినవగుప్తుని పిమ్మట నీ ధ్వనిసిద్ధాంతమును "మహిమభ"ట్టను పండితుడు ఖండించెను. "ఇతడు "ధ్వన్యాలోకము"నకు ఖండనముగ "వ్యక్తివివేక"మను గ్రంథమును రచించెను. ఇతని ప్రతిన యిది—

శ్లో. అనుమానేంతర్భావమ్ సర్వస్యాపి
ధ్వనేః ప్రకాశయితుమ్
వ్యక్తివివేకం కురుతే ప్రణమ్య
మహిమా పరాం వాచమ్.

[ఎల్ల విధములగు ధ్వనుల ననుమానమునందే యంతర్భవింపఁజేయుటకై మహిమభట్టు వాగ్దేవికి నమస్కరించి వ్యక్తివివేక గ్రంథమును రచించుచున్నాడు.]

ఇతడు కావ్యమున రసప్రాధాన్యము నంగీకరించెను. "కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచిద్విమతిః" (కావ్యమున కాత్మ రసాదిరూపమనుటయందు విప్రతిపత్తి లేదు) ఈతని వాదము కడకు నిలువలేదు. మమ్మట, విశ్వనాథ, జగన్నాథాది మహాపండితులీతని

నాదమును ముక్కలు ముక్కలు జేసివైచిరి. ప్రత్యేకముగ ఆనందవర్ధనుని సిద్ధాంతమునే, అనఁగా "వ్యంజనావృత్తి"ని ప్రత్యేకముగ నంగీకరింపవలసినదని నిర్ధరించిరి.

కుంతక మతము

అభినవగుప్తుని కాలమునందలివాఁడే యీ కుంతకుఁడు. "ధ్వని" మతమునకుఁ బ్రతికూలముగ నొక సిద్ధాంతమును బ్రతిష్ఠించెను. ఈతని సిద్ధాంతము. "వక్రోక్తిః కావ్యజీవితమ్". భామహుని వక్రోక్తినే యీతఁడు విశేషముగఁ బెంచెను.

క్షేమేంద్ర మతము

కుంతకుని యనంతరమున క్షేమేంద్రుఁడను నొక పండితుఁడు నూతన సిద్ధాంతమును లేవదీసెను. అది:

"ఔచిత్యస్య చమత్కారకారిణ శ్చారు చర్వణే
రసజీవితభూతస్య విచారం కురుతే ధునా
కావ్యస్యాలమలంకారైః కిం మిథ్యా గుణితైర్గుణైః
యస్య జీవిత మౌచిత్యం విచింత్యాపి న దృశ్యతే
అలంకారా స్త్వలంకారా గుణా యేవ గుణా స్సదా
ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్."

[రసమునకు జీవితభూతమును, చమత్కారకారియు నగు నౌచిత్యమును గూర్చి విచారణ సేయుచున్నాను. కావ్యమునకు జీవిత భూతమైన యౌచిత్యము లేకున్నచో నలంకారము లేల? గుణము లేల? అలంకారము లలంకారములే! అనఁగా బాహ్యశోభాహేతువులు. కాని జీవితము గాదు. అట్లే గుణములును ప్రసిద్ధిపడ్డ శౌర్యశీలాదుల వలెనే గుణములే. అనఁగా నవియు జీవితము గావు. కాన రసవంతమగు కావ్యమునకు జీవిత భూత మౌచిత్యమే]

ఆంగ్లమున గూడ నీ యౌచిత్యచర్చ గలదు. ఔచిత్యమున కాంగ్లమున డికోరమ్ (Decorum) అందురు

"వాక్యం రసాత్మకం కావ్య" మనగా రసస్వరూపముగల వాక్యము (మహావాక్యము లేక వాక్య సమూహము) కావ్యమని విశ్వనాథుఁడు వచించెను. ఇట్లనుటచేఁ బ్రబంధములలోఁ గొన్ని నీరసపద్యములకుఁ గావ్యత్వము లేకపోవచ్చును. అట్టియెడ రసవత్పద్యములనుబట్టి కావ్యత్వమును నీరస పద్యములను బట్టి యకావ్యత్వము నొక్క కావ్యమందే సంభవించి యది కావ్యముగాని యకావ్యముగాని కాకపోవలసివచ్చునని శంకించి రసవత్పద్యములలోనున్న గొన్ని నీరస పదములకును బద్యరసముచే రసవత్త్వము గల్గినట్లు ప్రబంధరసముచే నీరసపద్యములకును రసత్వము గల్గునని సమాధాన మిచ్చెను.

"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అనగా రమణీయమగు నర్థమును దెలుపు శబ్దము కావ్యమని యర్థము. రమణీయార్థ మనఁగా నేయర్థమును జెరిగి తిరిగి భావించుటచే లోకోత్తరాహ్లాదము గలుగునో అది. ఆ లోకోత్తరమగు నాహ్లాదమునకే "చమత్కార" మనియు నామాంతరము. కాన రమణీయార్థమనగా చమత్కారమును గల్గించునది యని యర్థము. చమత్కారము లేకున్న కావ్యము గాఁజాలదు. ఎట్లన?

శ్లో॥ కింకవేస్తస్య కావ్యేన కిం కాండేన ధనుష్మతః
పరస్య హృదయే లగ్నం నఘూర్ణయతి యచ్ఛిరః॥

[పరహృదయమున నాటుకొని లగ్నమై తలయూపింపఁజేయనిచో, ఆ కవియొక్క కావ్య మేల? ఆ ధానుష్కుని బాణ మేల? అని యీ శ్లోకోక్తి కాన గావ్యమునఁ జమత్కారమున్న నే పాఠకుఁడు తలయూగించును.

ఆంగ్లమునందలి కావ్యలక్షణములు

1. The expression of the imagination (తన భావనను (ప్రతిభను) వాఙ్మూపకముగఁ బ్రకటించుటయే కవిత్వము

2. The language of the imagination. (తన భావనను ప్రకటించు భాషయే కవిత్వము).

3 The art of employing words in such a manner as to produce an illusion on the imagination (ప్రతిభకొక రూపమును గల్పించునట్టి మన వచనములను గూర్చు కళ కవిత్వము.)

4 The rhythmic creation of beauty— (సౌందర్యమును గణబద్ధముగా సృజించుటయే కవిత్వము)

5. The most delightful and perfect form of utterance that human words can reach (మానవ వాక్కులకందఁజాలినంత యానందకరమైనట్టియు, రసపోషకమైనట్టియు, నిర్దుష్టమైనట్టియు రచనారూపము కవిత్వము)

6. The art uniting pleasure with truth by calling imagination to the help of reason. ((ప్రతిభోత్పాదితమైన కారణములతో సత్యమును, ఆనందముతో మేళవముఁజేయు కళయే కవిత్వము.)

"జాన్‌స్టూవర్ట్ మిల్ "అను లాక్షణికుఁడు కావ్యమన నేమి? అని ప్రశ్నించుకొని పై లక్షణములకన్న భిన్నమగు దృక్పథముతో "మూర్తీభవించిన యావేశము గల పదములును, అర్థములును కావ్య"మనెను.

"వర్డ్స్‌వర్త్" యింతకన్న విశేషముగ "కావ్య మనఁ బరిపూర్ణమైన యావేశముతో హృదయమునుండి వెలువడు వాక్ప్రవాహ" మని తెలిపెను.

అట్లే 'జాన్ కీబెల్" అనునాతఁడు "కావ్యమన హృదయము యొక్క యొత్తిడులారసి ప్రవహించు భావనాప్రవాహమునకుఁ బరీవాహ" మనెను.

కావ్య ప్రయోజనము

మన వాఙ్మయమును (వైదిక లౌకిక వాఙ్మయములు) ప్రభు సమ్మితము, మిత్రసమ్మితము, కాంతా సమ్మితములని మూడు విధములుగా నభిజ్ఞప్రాజ్ఞులు ప్రథమమున వ్యవహరించిరి. తిరువాతి యాలంకారికు లెల్లరు నీ విషయము నిట్లే స్వీకరించిరి. వేదవాఙ్మయము ప్రభుసమ్మితము. పురాణ వాఙ్మయము మిత్ర సమ్మితము. కావ్యవాఙ్మయము కాంతాసమ్మితముగా విభజించిరి. ప్రభు సమ్మిత మనఁగా రాజువలె నిరంకుశముగ శాసించునది; వేదము. "సత్యం వద" "ధర్మం చర" ఇత్యాదికములగు కర్తవ్య ధర్మములను శాసనరూపమున బోధించును. ప్రభుశాసన ముల్లంఘింపరాని విధమున వేద శాసనముగూడ నుల్లంఘింప వీలుకానిది. మన కిష్టము లేకున్నను ప్రభు శాసనమును విధిగాఁ బాలింపవలసిన విధమున వేదశాసనమును బాలింపవలయును. ఈ వాఙ్మయమున శబ్దములకే ప్రాధాన్యత్వము. కావున వేదములు శబ్దప్రాధాన్యములు. మిత్రసమ్మిత మన మిత్రునివలె నుపదేశించునది.

లోకమున

"మాతా మిత్రం పితా చేతి స్వభావా త్రితయం హితమ్
కార్యకారణ తశ్చాన్యే భవంతి హితబుద్ధయః"

అన్నవిధమున మన మేలుకోరువారు తలిదండ్రులు, మిత్రుఁ డనువారు మువ్వురుమాత్రమే! అట్టి మిత్రునివంటి పురాణవాఙ్మయము వైదికమగు "సత్యం వద, ధర్మం చర" యను శాసనముచే సహేతుకముగ, సోదాహరణముగ, కథారూపమున, తదాచరణమువలన లాభములు, అనాచరణమువలనఁ గలుగునష్టముల నుపదేశించి, కర్తవ్య ధర్మాచరణమునందుఁ బ్రవేశింపఁ జేయును. కాన నీ వాఙ్మయ మర్థప్రధానము.

ఇఁక "కాంతాసమ్మిత" మనఁగా, నుత్తమురాలగు భార్య తన సుగుణాలంకారరూపములచే భర్తృమనోరంజనముఁ జేయుచు దుర్మార్గమున నున్నవానిని సన్మార్గమునకుఁ ద్రిప్పువిధమున, ఆయుత్తమ కాంత తనభర్తకు వాచ్య రూపముగ నుపదేశింపక, గుణ ప్రవర్తనలచే వ్యంగ్యరూపమున నుపదేశించును. ఆమెయే "స్వాధీన పతిక" యనఁబడును. కాన కావ్యవాఙ్మయము కాంతా సమ్మిత మనుటవలన వేదపురాణ వాఙ్మయములకన్న వైలక్షణ్య మీ వాఙ్మయమున కేర్పడినది. ఇందా రెండిఁటియందు లేని చిత్తరంజనము, వ్యంగ్యరూపమగు నుపదేశములు గలవు. మఱియొక విషయము :—

వైదిక వాఙ్మయమే కర్తవ్యధర్మమును, నిరంకుశముగ, శాసనరూపముగ బోధించుచున్నదో, ఆ కర్తవ్యధర్మము నే పురాణవాఙ్మయము సహేతుకముగ కథానికల రూపమునఁ దెలుపుచున్నది. తత్కర్తవ్యధర్మము నే కావ్యవాఙ్మయము "శైలీగుణాలంకారము"లచే ప్రజా హృదయముల నాకర్షించుచు, హృద్యముగ నుపదేశించుచున్నది. వేదము "సత్యం వద" యని శాసించెను. పురాణము "సత్య హరిశ్చంద్రా"ది కథల రూపమున నెఱుకపఱచెను. ఆ కథయే దృశ్య, శ్రవ్య కావ్యము లందింతకన్న మనోరంజకముగ ప్రదర్శింపఁబడి, యా ధర్మమును మరింత లెస్సగా మనస్సులందు నాటుకొనునటు లొనర్చుచున్నది.

ఈ క్రమమునుబట్టి మూఁడింటఁగాఁ గావ్యము తప్పక ధర్మము నుపదేశించునదిగా నుండవలెనని తెలియుచున్నది. కనుకనే "భామహుఁడు":

ధర్మార్థ కామ మోక్షేషు
వైచక్షణ్యం కలాసు చ।
కరోతి కీర్తిం ప్రీతిం చ
సాధుకావ్య నిషేవణమ్॥

అని చతుర్వర్గవ్యుత్పత్తియే "కావ్య ప్రయోజనము"గ పేర్కొనెను.

మఱియు కావ్య ప్రకాశకర్త;

"కావ్యం యశసే, అర్థకృతే,
వ్యవహార విదే, శివేతర క్షతయే,
సద్యః పర నిర్వృతయే,
కాంతాసమ్మితత యోపదేశయుజే"

అని సద్యః పర నిర్వృతిని (ఆనందమును) ఉపదేశమును, కావ్యఫలముగాఁ బేర్కొనెను. ధ్వన్యాలోక కారుఁడును "సదాచారోపదేశరూప నిబంధనాహి, నాటకాదిగోష్ఠీ వినోద జనహితార్థ మేవ మునిభి రవతారితా"! (పామరజనహితార్థమై - సదాచారోపదేశ మొనర్చుటకే భరతాదులు నాటకాదులు నిర్ణయించి)రని నుడివెను. కావున భరతాదులు "ఆనందమును. ధర్మోపదేశమును" కావ్యముయొక్క ముఖ్య ప్రయోజనములుగ వెల్లడించి యుండిరి. ఇట్టి కావ్యములు వెలువరించి కవు లాంధ్రరమణి కింకను శోభను వెలార్చుదురుగాక!

---

*ఈ వ్యాసము శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారి "కావ్యాలంకార సంగ్రహ" వ్యాఖ్యనాధారముగ రచించితిని. వారికి నాహృదయ పూర్వక వందనములు— రచయిత.

నాటకాంతం

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

మరదలు శకుంతల పెళ్ళికి వెళ్ళకూడదనే అనుకొన్నాడు సుబ్రహ్మణ్యం—ఆ ఉద్దేశంతోనే ముందుగా శారదను పంపించేశాడు. కాని, చిట్టచివరికి పోనీ ఒక్క రెండురోజులు వెళ్ళివస్తే ఏం పోయింది, లేకపోతే శారదకి అక్కడ నలుగురిలోనూ చిన్నతనంగానూ ఉంటుందనుకొని బయలుదేరేడు.

ఇదివరలో పెద్దమరదలు సరోజని పెళ్ళికి పదిహేను రోజులు ముందుగా వెళ్ళి, భారమంతా తన భుజస్కంధాలమీదే వేసుకొన్న సుబ్రహ్మణ్యానికి ఈమారు శకుంతల పెళ్ళికి అసలే వెళ్ళాలని లేకపోవడానికి కారణం ఏమిటి? అక్కచెల్లెళ్ళు ముగ్గురిలోనూ శకుంతల అందరికంటే అందమైనదే కాక తెలివయినదని కూడా సుబ్రహ్మణ్యం నమ్మకం—ఆమె కాలేజీలో ఇంటరు సీనియరు చదువుతూండగా (అంటే ఎనిమిదినెలల క్రిందట) బి. ఏ. సీనియరు చదువుతూన్న ఒక విద్యార్థితో లేఖామూలకమయిన ప్రణయవ్యవహారం కొంత జరిగిందన్న విషయం సుబ్రహ్మణ్యానికి తెలిసింది. వాళ్ళిద్దరికీ తమ భవిష్యత్తు గురించి ఎటువంటి అనుమానాలు లేకపోయినా పెద్దలకు అంగీకారం కుదరలేదు—సుబ్రహ్మణ్యం సలహా నిష్ప్రయోజనం అయింది. ఇప్పుడు కుదిరిన సంబంధం చాలా గొప్పదనీ, ఇటువంటిది మరెన్నడూ దొరకదనీ శారదతో సహా అందరూ విశ్వసిస్తున్నారు... కాని, శకుంతల మనస్థితిని గూర్చి ఆలోచించినవారెవ్వరూ లేరు—డబ్బు, కులమూ, గోత్రమూ... ఇవన్నీ ఆలోచించదగినవే కావచ్చును—గాని, వ్యక్తుల మానసిక స్థితి, అభిరుచులు వీటిని గూర్చి అసలే ఆలోచించక పోవటమన్నది ముందు ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో?... పెళ్ళి హడావిడిలో ఎలాగో వీలు కల్పించుకొని శకుంతలను అడిగితే గడుసుగా అటూ ఇటూ తేలకుండా చెప్పి తప్పించుకొంది—కాని, లోపల్లోపల 'ఇదేదో వీళ్ళందరి ఆమోదంకోసం చేస్తున్న పని, అంతేగాని దీంతో నాకేం సంబంధం లేదు' అన్న విరక్తభావన మెదల్తూన్నట్టుంది. ఇప్పటి ఈ హడావిడిలో ఇలాగే అనిపించవచ్చును. కాని, ముందు ముందు బాధ్యత అంతా తనదే. నిజంగా తనకి అయిష్టంగా ఉంటే ఇప్పుడే కాదని గట్టిగా ఎదురు తిరిగి ఉండవలసింది—ఎంత తెలివయినవాళ్ళకీ తమకి సంబంధించిన విషయాల్లో ఉద్రేకపు పాలు తప్ప హేతువాదపు ప్రభావం పనిచెయ్యదు కాబోలు?

గతిజలసేతుబంధనంవల్ల ప్రయోజనం లేదు—పెళ్ళి అయిపోయింది—మగపెళ్ళివారి ధోరణి అందరికీ దుస్సహంగానే పరిణమించింది. ప్రత్యేకించి పెళ్ళికొడుకుతో తాను ఆడిన కొద్దిమాటలవలన అతడి అహంకారమూ, ఔద్ధత్యమూ స్పష్టంగా బోధపడ్డాయి సుబ్రహ్మణ్యానికి.

ఇంకా మరి రెండు రోజులుండడానికి వీలుందనగానే బయలుదేరిపోయేడు—ఎవ్వరూ ఏమీ అభ్యంతరం చెప్పలేదు—'మరి రెండు రోజులుంటే నేను కూడా వచ్చేస్తాను కదా!' అంది శారద—'నిన్ను తొందరపెట్టడం ఇష్టంలేకనే నేను బయలుదేరిపోతున్నాను' అన్నాడు సుబ్రహ్మణ్యం.

రయిలందుకుందమనుకో లేదు—కాని, మామూలుగా వచ్చే అరగంటేకాక మరొక అరగంట కూడా లేటు కావడంతో అందింది.

మీది బెర్తుమీద హోల్డాలు పరచుకొని క్రిందను మూలగా ఉన్న స్థలంలో కూర్చొని సిగరెట్టు ముట్టించాడు.

సిగరెట్టు కాలుస్తూఉన్నా అతని ఆలోచనలు అతకని బ్రతుకులకు కారణమయిన పెళ్ళిళ్ళమీదనే లగ్నమయి ఉన్నాయి — సోక్రటీసు, అబ్రహాం లింకను, టాల్‌స్టాయి—మొదలయిన వాళ్ళ దాంపత్య జీవితాలు దుర్భరంగా తయారయాయంటే, తమ అభిప్రాయాలతో సరిపడని భార్యలను చేసుకోడమే—అలాగే ఎందరో స్త్రీల జీవితాలు జీవన్మృతస్థితిలో

ఉన్నాయంటే అందుకు అననుకూల దాంపత్యాలే కారణం—వివాహానికి ఉండే ఈ ప్రాముఖ్యాన్ని అందరూ గుర్తిస్తారు—కాని, తమతమ వివాహ సందర్భాలలో ఎందుకో అర్థంలేని తొందర పడుతున్నట్టనిపిస్తుంది.

ఎవరివరకూనో ఎందుకు; తన విషయంలో తాను అరుంధతిని చేజేతులా పోగొట్టుకొన్నాడంటే అంతకంటె తెలివితక్కువ ఇంకేమయినా ఉంటుందా? తరవాత శారద ఇంత మంచిదీ, అనుకూలవతీ అయిందంటే అది వేరే సంగతిగాని, తన పొరపాటు మాసిపోతుందా? అయినా అరుంధతి తెలివితేటలు, చాకచక్యమూ, పారస్పరాభినివేశమూ ఇవన్నీ శారదకెక్కడనుంచి వస్తాయి? అసలు అరుంధతినే గాని జారవిడుచుకోకపోయిఉంటే, ఈనాడు తాను ఏ స్థితిలో ఉండేవాడో? చాలా విషయాల్లో నేడు తాను ఉదాసీనంగా, విరక్తుడుగా, ఎలా అయితే అలా జరగనీ అన్నట్టుంటున్నాడు. ఇంతకంటే ఎంతో చొరవగా, ఉల్లాసంగా, ధైర్యంగా ఉండి ఉండేవాడేమో అరుంధతి నే పోగొట్టుకోకుండా ఉంటే.

అనుకొన్నట్టుగా సిగరెట్టు అయిపోగానే వీధి చెరువుమీదికి పోవడం జరగలేదు—మరొక సిగరెట్టు ముట్టించి, కనులరమోడ్చి వెనుకటిరోజులకు సంబంధించిన దృశ్యాలను నెమరు వేసుకోవడం మొదలుపెట్టేడు—

అవి తాను తాడుతెగిన గాలిపటంలా ఎగురుతున్న రోజులు—హఠాత్తుగా మేనమామ పోవడంతో బి. యే చదువు అర్థాంతరంగా ఆగిపోయింది. సిఫార్సులు లేని నిష్ప్రయోజనమయిన ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తూ, కాస్తా పసవున్న స్నేహితులను నిర్మొగమాటంగా కొంత కొంతకాలం ఉద్ధరిస్తూ, కాలక్షేపం నిమిత్తం పద్యాలు రాస్తూ ఉండిన రోజులవి—

బి. యల్ పాసయి కొత్తగా ప్రాక్టీసు పెట్టిన రాజేశ్వరరావును మాసేవరకూ తాను నిరుద్యోగిగా ఎంతకాలం గడిపిందీ గుర్తురాలేదు సుబ్రహ్మణ్యానికి. వాడు తాను జూనియర్ చదువుతున్నప్పుడు సెప్టెంబర్ పరీక్షకు వెళ్ళేడు.

తన మామూలుపద్ధతి—కొన్నిరోజులుండి, రైలు ఖర్చులకని పదో పదిహేనో పుచ్చుకొని బయలుదే పోయే పద్ధతి రాజేశ్వరరావు దగ్గర కుదరలేదు.

పద్యాల్లో పక్షుల స్వేచ్ఛాజీవితం గురిం వ్రాయడం బాగానే ఉంటుందిగాని, నిత్యజీవితంల పక్షుల్లా తయారవడం ఆత్మనాశనాన్ని తెచ్చుకోడ అన్నాడు రాజేశ్వరరావు—అతనితో పూర్తిగా ఏకీ వించలేక పోయినా, ఎదిరించలేకపోయేడు సు హ్మణ్యం.

'ప్రవాళమాల' (పద్యరచనల సంపుటి), పా కాల (కథానికల సంపుటి) ఈ రెండూ ఆనాడు ప రితమయేయంటే అందుకు రాజేశ్వరరావు పడ్డ తా త్రయం ఇంతా అంతా కాదు.

ఆ తరవాత ఈ ఆరేడేళ్ళలోనూ తాను ఎవ రచనలు చేసేడు, వాటిలో చాలావరకూ పత్రికలలో అచ్చయాయి కూడా. అయినా, ఇప్పటికి తాను మరొక పుస్తకం ప్రకటించలేక పోయేడు. ఇం వేగంలో వెలువడే సావకాశమూ కనిపించడం లేదు.

ఆనాడు రాజేశ్వరరావు తనకి కల్పించినది కే లం ఆర్థికమయిన ప్రోత్సాహం మాత్రమే కాదు; మా సికంగా ఎంతో ధైర్యాన్ని చేకూర్చాడు. అతన అంతగా ఆదుకొని ఉండకపోతే బైరాగులలో కలి పోవడమో ఆత్మహత్య చేసుకోవడమో ఈ రెంటిలో ఏదో ఒకటి తనకు శరణ్యం అయి ఉండును.

కేవలం ప్రాక్టీసు మీదనే ఆధారపడవలసిన అ సరం లేనిపాటి ఆస్తి కలవాడు రాజేశ్వరరావు. అట వంటి వాడికి సింహానికి ఎలుక చేసిన సహాయంలా తానొక చిన్న ఉపకృతి చేయగలిగేడంటే విశేషమే

అరుంధతి ఆ సంవత్సరం బి. యిడి., చదువు తూంది. ఆమెకు బి. యిడి చదవాలనే కోరిక పుట్ట ఉండకపోతే ఆరు నెలలకు పూర్వమే వాళ్లిద్దరి పెళ్ళి జరిగి ఉండేది. పెళ్ళి చేసుకొన్నా అవసరమయితే స్వతంత్రంగా జీవించగలిగే సావకాశం ఉండాల ఆమె అభిమతం.

అంతగా వ్యావహారికంగా అన్నిటినీ మా గలిగిన అరుంధతి అన్నీ ఉన్న రాజేశ్వరరావు కాదని ఏమీలేని తనని వరిస్తుందన్నది కలలోనయినా నమ్మలేని సంగతి.

కాని, కలల్లో ఊహల్లో అసాధ్యాలుగా భావించిన విషయాలు ఒక్కొక్కప్పుడు యథార్థంగా జరిగిపోతూ ఉంటాయి. ఆమెకి మొదటినుండి తనను ఎగతాళి చెయ్యడం అంటే ఎందుకో అంత సరదా అర్థం అయేదికాదు తానూ తీసిపోకుండా నోటికి వచ్చినట్టు వాగేవాడు. ఇద్దరినీ చూస్తూ, సిగరెట్టు కాల్చుకొంటూ గంభీరంగా కూర్చునేవాడు రాజేశ్వరరావు—అక్కడికో ఆగిపోయినా బాగుండును. ఆమెకు తనను డిగ్రీల పండితుణ్ణి చెయ్యాలనే సంకల్పం ఒకటి పుట్టుకొచ్చింది. చిన్న పిల్లవాణ్ణి శ్రద్ధగా కూర్చోపెట్టి చదివించినట్లుగా చదివించేది—ఎప్పుడయినా ఆమె చదవమని చెప్పినది చదవలేదనీ, పేకాట ఆడుతూనో, పద్యాలు రాస్తూనో కూర్చున్నాననీ అంటే ఆమెకు కోపంలో కళ్ళనీళ్ళ పర్యంతం అయేది...

ఏం జరిగినా రాజేశ్వరరావు సూచించి ఉండకపోతే తనకి అర్థమయేదేకాదు, ఆమె తనను ప్రేమిస్తున్నదని — అప్పటికీ నమ్మడం కష్టంగానే తోచింది.

కాని, కర్తవ్యం?...రాజేశ్వరరావు ఎలాగో అనగలిగాడు—మీరిద్దరూ పెళ్ళి చేసుకొని హాయిగా ఉండగలిగితే నాకంతే చాలును. ఆమె సుఖపడ గలిగితే, నేనూ సుఖపడినట్టే—నేను మరి పెళ్లి చేసుకోక పోయినా నాకు విచారంలేదు...వెంటనే రాజేశ్వరరావుకి ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు.

రాత్రంతా ఆలోచించి, ఆలోచించి తెల్లవారు జామున ఒక నిశ్చయానికి వచ్చేడు. మాటమాత్ర మయినా, రాజేశ్వరరావు తాను ప్రేమించిన స్త్రీ సుఖపడడమే తనకి కావాలన్నాడు. ఆ పనే తానెందుకు చెయ్యకూడదూ? స్నేహము—ప్రేమ—ప్రేమ ఎక్కువదే కావచ్చును—కాని, తాను ఆమెకు తగిన ఉజ్జీ కాగలడా? ఆమె ఆర్జిస్తూ ఉంటే ఇంట్లో కూర్చొని అసమర్థుడుగా పడి ఉండడమా? అంతే కాక, రాజేశ్వరరావు తనకు మనసులో ఏ లేశమో అనుమానం తట్టగానే "భాయి, ఈ పాతికా తీసుకొని రేపే నువ్విక్కణ్ణించి బసఎత్తి పెట్టెయి" అని ఉంటే ఏమవును?

వ్యక్తిగతంగా తనయెడల ఆమెకు ద్వేషం కలిగించుకోడమే అయితే అంత కష్టం కాకపోయేది—వెనుకటి స్థానంలో రాజేశ్వరరావును పునఃప్రతిష్ఠితుణ్ణి చెయ్యడం తేలికగా కుదరలేదు. అందుకుగాను లేని ప్రియురాళ్ళను సృష్టించుకోవలసి వచ్చింది, రాని ఉత్తరాలు రప్పించుకోవలసి వచ్చింది—ఎన్నడూ లేని దురభ్యాసాలు ఉన్నట్టుగా నటించవలసి వచ్చింది—

ఏమయితేనేం, నాటకంలో తన పాత్ర చాలా చక్కగా నిర్వహించినట్లే—ఆమె తన బి. యిడి. పరీక్ష పూర్తికాకముందే రాజేశ్వరరావుతో వివాహానికి అంగీకరించింది; అంతేకాదు, తమ వివాహానికి తాను రావడానికి కూడా ఆమె అంగీకరించలేదు.

తరవాత కొంతకాలంవరకూ కృతజ్ఞతతో ముంచెత్తుతూ రాజేశ్వరరావు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. అటువంటివాటికి ఏమిటి జవాబు రాయడం? ఏదో ముక్తసరిగా క్షేమసమాచారం మాత్రం తెలియజేసి ఊరుకొనేవాడు. కొన్నాళ్ళకి రాజేశ్వరరావుకీ రాసే ఓపిక తగ్గిపోయింది. ఇదే బాగుంది. ఒకమారు జరిగిన ఏదో పనికి పదేపదే కృతజ్ఞతను ప్రదర్శించడమన్నది రెండువైపులా సుఖతరమయిన వ్యాపారం కాదు—అంతేకాక, రాజేశ్వరరావు ఉత్తరం రాసినప్పుడల్లా, తాను అరుంధతిని పోగొట్టుకోవడంలోని తెలివితక్కువ మనసులో అస్పష్టంగా మెదలుతూ ఉండేదేమో?

ఒక వస్తువు మనకు అందుబాటులో ఉన్నప్పటి కంటె పూర్తిగా పోగొట్టుకున్నప్పుడే ఎక్కువ విలువయినదిగా రూపిస్తుంది. అరుంధతిని గూర్చిన జ్ఞాపకాలతో కొంతకాలం అసలే పెళ్ళి చేసుకోకూడదన్నంతటి వైరాగ్యం కలిగింది. కాని, తరవాత తరవాత ఏదో ఒక ఉద్యోగం దొరకడం, అక్కడ ఏర్పడిన పరిచయం మూలంగా శారద మేనమామగారికి తెలియడం—పెళ్లి—మొదలయిన వన్నీ జరిగాయి.

మొదట్లో కొంతకాలం ఏమాత్రం అసంతృప్తి కలిగినా మనసులో శారదను అరుంధతితో పోల్చుకోడం జరుగుతూ ఉండేది. కాని, ఆ విచారం అట్టే కాలం నిలవలేదు. శారదలో అరుంధతిలో ఉన్న వ్యక్తిత్వమూ తెలివితేటలూ లేకపోతేనేం, తనను సంతోషపరచడమే స్వీయానందంగా భావించుకోగలదు. తమ దాంపత్యజీవితం ఎటువంటి కలతలూ కల్లోలాలూ లేకుండా సాగిపోతుంది. ఇంతకంటే మరింకేం కావాలి?

మరదలు శకుంతల పెళ్ళికి సంబంధించి పుట్టిన ఆలోచనలు క్రమంగా విస్తరించి, గతంలోనికి వ్యాపించి, ఏనాటివో దృశ్యాలను స్మృతిఫలకంమీద ప్రకాశింపజేశాయి—

ఆనాడు తాను రాజేశ్వరావు కోర్కెకు అంగీకరించి ఉండకపోతే ఏమయి ఉండును?

అతను ఆశాభంగంవలన ఆత్మహత్య చేసుకొని వుండునా? అలాగే అయితే బ్రతికిఉన్నా ఆ జన్మాంతమూ తనకు తీరని వ్యథగా ఉండేది.

అంతమాత్రంలో అతను ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలి? సలక్షణంగా పెళ్ళిచేసుకొని హాయిగా సాంసారిక జీవితం గడుపుతూ ఉండి ఉండును— అయితే తమ పరిస్థితి ఏవిధంగా పరిణమించేదో? ఆమె మీద నిరుద్యోగస్థుడుగా ఆధారపడిన స్థితిలో తన మనసు ఎటువంటి వికారాలకు లోనయి ఉండేదో? తరవాత కూడా, ఇద్దరూ వేర్వేరు స్థలాల్లో ఉద్యోగాలు చెయ్యవలసివస్తే? అప్పుడు తమలో ఎవరో ఒకరు ఉద్యోగం మానేసి ఉండేవారా?

ఛ ఛ ఇవేమిటీ ఆలోచనలు? ఆమె ప్రస్తుతం తన స్నేహితుడి భార్య—అంతే.

అనా డెప్పుడో అలా కాక ఇంకోకలా జరిగి ఉంటే ఎలా ఉండేదో అని ఆలోచించడంకంటె, జరిగిన పద్ధతివలన వాళ్ళ జీవితాలు ఎంత మధురంగా గడిచిపోతున్నాయి అన్న రకం ఆలోచన తెచ్చుకోవడం మంచిదికదా అనుకొన్నాడు సుబ్రహ్మణ్యం.

ఈ రకమయిన బుద్ధి పుట్టడంతో అదివర కెన్నడూ కలగని కొత్త ఆలోచన ఒకటి వచ్చింది— రాజేశ్వరావునూ అరుంధతినీ గూర్చి ఊహించేకంటె ఒకమారు వెళ్ళి చూసివస్తే? అక్కడ పెళ్ళిహడావిడి ధరించలేక బయలుదేరిపోయాడే గాని మరొకటి రెండు రోజులు ఆలస్యంఅయినా బాగుండేది. మళ్ళీ ఎప్పుడో గాని తాను ఈ ప్రాంతం వచ్చేదిలేదు. ఇప్పుడే ఒకమారు రాజమండ్రిలో దిగితే?

ఇప్పటికీ అరుంధతి తనను మాసి అసహ్యించు కొనే పరిస్థితిలో ఉంటుందా? లేక ఈ మధ్యకాలంలో వచ్చిన మార్పులకు సంతోషిస్తుందా? ఆరేళ్ళలో తనలో ఎన్నో మార్పులు వచ్చినట్టే ఆ యిద్దరిలోనూ ఎన్నో మార్పులు వచ్చి ఉంటాయి. ఈనాడు వాళ్ళ దాంపత్య జీవితాన్ని పరిశీలించ గలగ[illegible] నిజంగా ఒక మంచి పాఠమే అవుతుంది.

సామర్లకోట వచ్చేసరికే రాజమండ్రిలో [illegible] తీరాలని నిశ్చయం అయిపోయింది. అక్కడనుం[illegible] మెయిలు చాలా నెమ్మదిగా పోతున్నట్టు, ఏమాత్ర[illegible] అవకాశం కనిపించినా ఆగిపోడానికే ప్రయత్ని[illegible]స్తున్నట్టు అనిపించసాగింది.

రాజమండ్రి స్టేషనులో మెయిలు ఆగేసరి[illegible] సాయంకాలం అయిదూ పదహైదయినది అయింది.

అదివరకల్లా అంత తొందరపడిన మనిషి, రైలు స్టేషనును విడిచిపెట్టేవరకూ (సుమారు ఇరవైనిమిషా[illegible] కాలం) ప్లాటుఫారంమీద నే గడిపాడు. చిట్టచివ[illegible] క్షణంలో మళ్ళీ రైల్లోకి ఎక్కిపోవా లనిపించింది. కాని, తన అనిశ్చితత్వానికి విసుక్కొని, హోల్డాల[illegible] కూలీనెత్తిమీద పెట్టి, దూరప్రయాణపు టిక్కట్టు కావడంవల్ల మధ్యలో ఒక రోజు ఆగే సావకాశాన్ని వినియోగించుకొని బైటపడ్డాడు.

సైకిలురిక్షాలో కూర్చొని తిన్నగా హోటలుకి తీసుకొని వెళ్ళమన్నాడు.

జన అని గది తీసుకోకపోయినా హోల్డాలు హోటలువారికే అప్పజెప్పి, వెనకటి రోజుల్లో అతి పరిచయమయిన ఇన్నీసుపేట వీధుల్లో నడక సాగించాడు.

అప్పటికే ఇంకా చిన్న సందేహం పుట్టింది— వాడు పోర్టుమంచి వచ్చినా క్లబ్బులో, మరెటో వెళ్ళి ఉంటాడేమో? వాడులేని సమయంలో వెళ్ళేకంటె ఉన్నప్పుడు వెళ్లడమే నయం. అందాకా కాస్తసేపు గోదావరి ఒడ్డున కూర్చోడం బాగుంటుంది—ప్రయాణపు బడలిక తగ్గుతుంది—అనుకొని, మరొక సిగరెట్టు ముట్టించి బయలుదేరేడు. ఈమధ్యకాలంలో రైలులోంచి వెళ్లిపోతూ నదిని చూడ్డమే గాని, గోదావరి ఒడ్డున కూర్చోడం జరగలేదు—రేపు ఉదయం తప్పకుండా స్నానం చెయ్యాలి...అస్తమయ సమయారుణ తరణి కిరణ శోభను ప్రతిఫలింపజేస్తూ ప్రకాశిస్తూ సాగిపోయే గోదావరి దృశ్యం, తాను చిత్రకారుడు కాకపోయినందుకు, ఇదివరకెన్నిమార్లలా గానో, మనసుకు నొప్పి కలిగించింది.

సిగరెట్టువెంట సిగరెట్టు కాల్చడంతో సిగరెట్ల మీద కలిగిన అరుచి, విసుగుదలా తన సంకోచంమీదికి

కూడా వ్యాపించాయి—మెయిల్లో దిగిన వాడిని ఇప్పటివరకూ ఏం చేస్తున్నావంటే ఏమని సమాధానం చెప్పడం?

ఇంకా సగమయినా కాలని సిగరెట్టును బలంగా విసిరేడు—అది నీళ్ళవరకూ వెళ్ళలేదు; మధ్యలో రాతిమెట్ల మీదనే పడింది.

ఈ మారు మరే సంకోచం లేకుండా తొందర తొందరగా వెళ్ళేడు—అప్పటికింకా ఏడుంపావు కంటె ఎక్కువ కాకపోయినా, మీదినుండి పడే వెన్నెల వెలుగులో వెలవెలబారే ఎలక్ట్రిక్ దీపాల ప్రభావంవల్ల ఎంతో రాత్రయినట్లనిపించింది.

ముందున్న క్రగేటు ఎప్పటి మాదిరిగానే దగ్గరగా వేసుకొని ఉంది కుడిచేతితట్టు గదిలో లైటుంది—అది వాడి ఆఫీసుగది—బహుశః వాడు ఉండే ఉండవచ్చును—లేకపోయినా...

తన ఆలోచన పూర్తి కాకుండానే మెట్లను సమీపించి, "రాజేశ్వర్రావ్! రాజేశ్వర్రావ్!" అని రెండు మార్లు పిలిచాడు.

గదిలోనుండి వినిపించింది అరుంధతి గొంతు... "ఎవరూ, మీరా? ఎన్నాళ్ళకి వచ్చేరు? రండి." ఈ మాటలను అంటూ ఆమె గుమ్మంలోనికివచ్చింది పక్క తలుపు తెరచుకొని.

మెట్లెక్కుతూ ప్రశ్నించాడు. "వాడింకా క్లబ్బునుండి రాలేదా?" అని.

ఆమె అతని మాటకు సమాధానం చెప్పకుండా, "ఎప్పుడు వచ్చారు? సామానదీ ఏమీ లేదా?" అని అడిగింది.

"ఇందాకా మెయిల్లో దిగేను—మళ్ళీ రాత్రి బండికే వెళ్లిపోవాలి. అందుకని హోల్డాలు స్టేషను లోనే విడిచి పెట్టేను. దార్లో ఎవళ్ళో కనిపిస్తే మాట లాడుతూ ఉండిపోవడంవల్ల ఆలస్యం అయిపోయింది."

"పోనీండి, అలాగే రైలుకి తిరిగివెళ్ళి పోకుండా ఇలా వచ్చేరు—కూర్చోండి. మంచినీళ్ళు తెస్తాను. కాఫీకూడా ఫ్లాస్కులో ఉంది."

"మంచినీళ్లుమాత్రం—ఇవ్వండి. కాఫీ వాడు వచ్చేకనే తాగుతాము ఇద్దరం కలిసి."

"ఆయనకోసం ఎదురు చూడనక్కరలేదు లెండి" అంటూ ఆమె లోనికి వెళ్లిపోయింది.

ఆగది, ఆ పరిసరాలూ చూస్తూఉంటే వాటన్నిటినీ తాను విడిచిపెట్టి వెళ్లిపోలేదన్నట్టే అనిపించింది. తనవయసుకూడా కొన్ని సంవత్సరాలు వెనక్కి జరిగినట్టు తోచింది.

కాఫీ పట్టుకొని వస్తూ ఆమె అడిగింది—"మీరొక్కరే వచ్చారే, కుటుంబం అంతటినీ తీసుకొని వచ్చిఉంటే బాగుండును కదా?" అంది—మరొకళ్ళయితే మీకు పెళ్ళి అయిందా? ఎందరు పిల్లలు? అని అడిగిఉండేవారు. ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పక తప్పలేదు. "కుటుంబం అంటే నేనూ మా శ్రీమతి శారదా మాత్రమే, ఇంకా పిల్లలులేరు" అని చెప్పుకోవలసి వచ్చింది.

"కాఫీలో మీకు కావాలని కొంచెం ఎక్కువగా పంచదార కలిపాను. ఈ మధ్యనుగాని పద్ధతి మారలేదు కదా?"

"ఇటీవల నేను మాయింట్లో తాగే కాఫీ అనే పదార్థాన్ని ఇతరులేమంటారో తెలీదు. పాల స్వచ్ఛమయిన తెల్లనిరంగు తగ్గడానికి మాత్రమే ఒక చిటికెడు కాఫీ పొడుము వేసిన పానీయం అది, కాకపోతే పానకం అనుకోవచ్చును."

మొదట్లో మీరే ఆవిడకు ఆవిధంగా అలవాటు చేసిఉంటారు. ఇప్పుడు మీరే తప్పులెన్నుతున్నారు."

"తప్పు అని కాదు, గాని, ఆవిడ ఇచ్చే కాఫీకే అలవాటుపడి బాగుందనడం తప్పనిసరికదా!"

"అదీ కొంతవరకు నయమే—తాము కావాలన్న ప్రకారమే చేసినా భార్యల చేతలను వంటనూ ఆడిపోసుకొనే మగవాళ్ళకంటె మేలు."

"అటువంటి భర్తలుంటారనేది మీకు ప్రత్యక్షానుభవం కాదుకదా? మావాడు మీ రెంతంటే అంతే అన్నిట్లోనూ. లేక ఇటీవల ఏమయినా మారిపోయాడా?..ఇటువంటి అంతరంగిక విషయం ప్రశ్నించ కూడనిదేగాని, వెనకటి చనువువలన అప్రయత్నంగా వచ్చేసింది. మీ కిష్టంలేకపోతే సమాధానం చెప్పకండి..."

"ఎందుకు సంకోచిస్తున్నారు? సిగరెట్టుకాల్చుకొందికేనా? నాకేం అభ్యంతరం లేదు. కాల్చుకోండి. కాని, మీకు ఇప్పటికీ చీటికీ మాటికీ ప్రతి చిన్నవిషయానికీ అనుకోకుండా అబద్ధం చెప్పే దురలవాటు పోలేదన్నమాట!"

"అలవాట్లు పుడకలతో గాని పోయేవి కావు లెండి గాని, ఇప్పుడు నేను మీతో ఏ విషయంలో అబద్ధం చెప్పానో నాకే తెలియకుండా ఉంది—ఏ విషయంలో...

"చెప్పనా? మీరు మెయిలు దిగి, ఇటు వస్తూ దార్లో ఎవరో స్నేహితులతో మాట్లాడుతూ నిలబడి పోయేరన్నది శుద్ధ అబద్ధం—అసలు మా యింటికి రావడమా మానడమా అన్న సంకోచంతో ఊరంతా చాంద్రాయణం చేస్తూ ఉండిఉంటారు ఒంటరిగా—

"ఊరంతా తిరగడం మాత్రం కాదుగాని, గోదావరి ఒడ్డున కూర్చుండిపోయేను—మీరు నన్ను ఈమాత్రం ఆదరంగా పలకరించి ఆతిథ్య మిస్తారనుకో లేదు—వాడితో కాస్తసేపు మాట్లాడి ఏ హోటలుకో పోయి భోంచెయ్యవలసి వస్తుందేమోనని కూడా అనుకొన్నాను.

"ఆ ఉద్దేశంతో నే హోల్డాలు కూడా తేలేదన్న మాట!" మీ రిలా కూర్చొని ఈ పత్రికలూ అవీ చూస్తూ ఉండండి. నేను వెళ్ళి భోజన ప్రయత్నం చేస్తాను."

"నా గురించి విశేషంగా ఏమీ చెయ్యనక్కర లేదు. వాడితో పంక్తిని కూర్చోడానికే తప్ప, దారిలో అడ్డమైన ఫలహారాలూ చెయ్యడంవల్ల ఇప్పుడేమీ ఆకలి కావడం లేదు. వీ డింకా రాలేదేం చెప్మా? వచ్చేసరికి మరోగంట పడుతుందంటే నేనూ క్లబ్బు వంకకు ఒకసారి వెళ్ళివస్తాను.

"ఈ రాత్రికి మీ రొక్కరూ భోంచెయ్యవలసిందే."

"ఏమిటి, వీడు గాని ఊళ్ళో లేడా? నేను..."

"మరేం భయపడకండి మిమ్మల్ని నే నిక్కడ కట్టిఉంచను—రాత్రి జనతాలో కదూ మీరు వెళ్ళాలనుకొంటున్నది. నేనూ రాత్రి ఇటు వెళ్ళేబండికి వెళ్తున్నాను. నాకు సాయంగా ఉంటారు రైలెక్క వరకూ."

"ఓ, అలాగే, అంతకంటేనా? అంటే ఇద్దరూ కలిసి తిరిగి వస్తారన్నమాట? ఇన్నాళ్ళకి వచ్చి వాణ్ణి చూడ్డంఅయిందికాదు, మిమ్మల్ని అయినా చూడగలిగాను. ఇకే రేపో ఎల్లుండో వచ్చి ఉంటే మరీ ఆశాభంగమయేది."

"అసలు బ్రతకడమే ఒక పెద్ద ఆశాభంగం" అంటు ఆమె లోనికి వెళ్ళిపోయింది.

ఇటువంటిమాట ఈవిడ నోటి వెంట రావడాని కారణం ఏమయి ఉంటుందా అన్న ఆలోచన అతే సేపు నిలవలేదు సుబ్రహ్మణ్యం మనస్సులో...పరధ్యానంగా ఏవో పత్రికలు తిరగవెయ్యడం కూడా కొంచెంసేపే సాగింది—కుర్చీలో నే వెనక్కి చేరగిలబడి నిద్రపోసాగాడు.

మెలకువ వచ్చేసరికి పదింపావయింది. ఎదురుగా ఆమె కుర్చీలో కూర్చొని చదువుకొంటూంది.

"మిమ్మల్ని లేపి మీ నిద్ర పాడుచెయ్య లనుకోలేదు. కాని, .భోజనానికి మరీ ఆలస్యం అవుతుందని పదింపావుకి అలారం పెట్టేను" అంది పుస్తకంలోకి చూస్తూ.

చాలా మంచి పనిచేసేరు. ఇంకా ఆలస్యమయితే మీకు మరీ శ్రమ. అయినా నిజానికి ఇప్పుడేమీ భోంచెయ్యాలని లేదు."

"ఎంత తినాలని ఉంటే అంతే తినవచ్చును—స్నానం చేస్తారా? బాత్ రూములో వేణ్ణీళ్ళూ సబ్బూ అన్నీ ఉన్నాయి ఇందాకా నేను చూసేసరికి వేడిగానే ఉన్నాయి. ఇప్పటికి వేడి తగ్గిపోయినా మరీ చల్లబడి ఉండవు."

స్నానం చేసేసరికి నిద్రబద్ధకం కొంత తగ్గింది. భోంచేస్తూ ఉండగా రాజేశ్వరరావు ప్రాక్టీసు గురించి, ప్రస్తుతపు సరదాలగురించీ ఇంకా ఎన్నెన్నో విషయాలు అడగాలనిపించిందిగాని, ఆమె సందివ్వలేదు.

జరిగిన సంభాషణ అంతా కూరలగురించీ ఊరగాయల గురించీ మాత్రమే.

భోంచేసి వచ్చేసరికల్లా వీధిగుమ్మంలో తినకని వెయ్యబడ్డ పక్క చూపించింది. మీకు బాగా నిద్ర వస్తున్నట్టుంది. పడుకోండి; రైలు వేళకు నేను లేపుతాను" అంది.

"సరేగాని, అక్కడ నా బెడ్డింగు భద్రంగా ఉందోలేదో, వెళ్ళి తెచ్చేసుకొంటే అప్పుడు తాపత్రయ పడవలసిన అవసరం ఉండదు.

అలాగే వెళ్ళిరండి; గాని, ఈ వెళ్ళడం ఇలాగే వెళ్ళిపోరుకదా?

పునర్నవం

గేయసంపుటి; రచన: దాశరథి; ప్రచురణ: శిశోద్ధారక గ్రంథమాల; 3-5-1027 నారాయణగూడ, హైదరాబాదు. వెల: 1-6 0.

ఈ సంపుటిలో మొత్తం 20 ఖండకృతులున్నాయి. ప్రకాశకులు స్థూలంగా వీటి నన్నిటినీ గేయాలు అని చెబుతున్నా వీటిలో కొన్ని వచన పద్యాలుకూడా వున్నాయి.

ఈ కృతులలో 'పునర్నవం', 'ప్రాణదీపం', 'అచుంబితం' మొదలైన కొన్ని రచనలు, భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలద్వారా లోగడ పాఠకులకు పరిచయం చేయబడినవే.

'పునర్నవమ్' అన్న కృతిలో శ్రీ దాశరథి కవిత్వానికి నిర్వచనం చెప్పారు:

'దూరాన పొడిగాలి దెబ్బలకు
తునాతునకలైపోయిన ఆకులతో
ముసలిముఖం పడిన వృక్షంమీద
యౌవనం చిగురించటం కవిత్వం.

రోజూ కనబడే నక్షత్రాల్లోనే
రోజూ కనబడని క్రొత్తదనంచూచి
రోజూ పొందని ఆనందానుభూతి
పొందటం అంటేనే కవిత్వం.

మనకంటే లక్షయేండ్లు పెద్దది
మన నెత్తిమీదున్న ఆకాశం
దూదిపింజెల్లాంటి కొత్తమబ్బుల్తో
తొంగి చూడ్డమే పునర్నవం.

ఎప్పటికప్పుడు జరాజీవితాన్ని చీల్చుకొని క్రొత్త చివుళ్లుగా పొటమరించటమే 'పునర్నవం'. ఇదే కవిత్వం అంటారు దాశరథి ఈ ఆవేశం ఈ గేయాలన్నిటా సర్వత్రా గోచరించుతున్నది. నవయుగోదయ తేజాలతో వికాసోన్ముఖ మవుతున్న లోకాన్ని భావించి రచయిత ఆనంద వివశుడౌతాడు :

ఆకు రాల్చిన మనసుల్లో
అప్పుడే పూలు పూస్తున్నాయి
పునర్నవకాలం వచ్చింది
పూచింది లోకం హర్షంతో

ఇంతవరకూ నిద్రాణమైవున్న కారణంగా ఈ మనోవికాసపు అనుభూతిని మానవజాతి పొందలేక పోయింది. బాహ్యజగత్తులో వ్యాపించివున్న అంధకారంలో కొట్టుమిట్టాడుతూ, అంతర్ముఖుడు కాలేక పోవటమే యిందుకు కారణం. ఇప్పుడు 'అచుంబిత' మైవున్న ఆ దివ్య సౌందర్యాన్ని ఆహ్వానించుతున్నాడు; 'అచుంబితం' అనే కావ్యంలో :

'మాట్లాడని మల్లెమొగ్గ
మాదిరిగా నడచిరా!
నిశ్శబ్దం ఎరగనట్టి
నిమ్నగవలె నడచిపో !

* * *

మఱ్ఱి ఆకుపై విష్ణువు
మాదిరి శబ్దమున శక్తి

* * *

మనకున్న నిఘంటువులు
విననట్టిది కననట్టిది
నది తరగలలో భావుకు
మదిలో వింత పలుకు'

అన్నారు. ఇలాంటి సొగసులు ఈ గేయాలలో చాలా వున్నాయి.

'బాల్యం' అనే కృతిలో :

'నిశ్శబ్దంగా నితాంత
జీవితాగ్రాన పూచే
నిర్మలమైన ఎర్ర రోజా
ప్రసూనం బాల్యం'

అన్నారు. నిజానికి ఈ భావం వర్డ్స్‌వర్త్ భావల (Ode on Intimations of Immortalit కోటీరపు తురాయి పువ్వులా ఎర్రగా పూసింది.

— —

రత్నావళి

మహాకవి శ్రీ హర్షుని సంస్కృత కృతికి అ వాదం: అనువాదకులు శ్రీ సామవేదం జానకి రా శర్మ, ప్రకాశకులు; రామా అండ్ కో, ఏలూ వెల రు. 1-8-0.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor:; S. Sambhu Prasad.